f t i /manamnews
www.manamnews.com

# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్
బుధవారం
05-07-2023
వెల. రూ.5
• సంపుటి : 7 • సంచిక : 154
పేజీలు : 12

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

ఆషాడ మాసం, బుధవారం, తిథి : విదియ ఉ.10.02 వరకు, నక్షత్రం: శ్రవణ, ఉ :05.39 వరకు, వర్జ్యం: ఉ.06.31-07.57 వరకు, దుర్ముహూర్తం: ఉ.11.54-12.46 వరకు, రాహుకాలం: మ.12.20-01.58 వరకు

## రెండు రోజులు.. 4 రాష్ట్రాలు..
## ప్రధాని మోదీ పర్యటన..!



న్యూఢిల్లీ, జూలై 4 : తెలంగాణ సహా నాలుగు రాష్ట్రాల్లో ప్రధాని నరేంద్ర మోదీ సుడిగాలి పర్యటనకు ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. జులై 7, 8 తేదీల్లో ఉత్తరప్రదేశ్, ఛత్తీస్గఢ్, తెలంగాణ, రాజస్థాన్ రాష్ట్రాల్లో ప్రధాని పర్యటించి రూ.50వేల కోట్ల విలువైన దాదాపు 50 ప్రాజెక్టులకు ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు చేయనున్నట్టు అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఉత్తరప్రదేశ్ మినహా మిగతా మూడు రాష్ట్రాల్లోనూ త్వరలో ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మోదీ పర్యటన ..మిగతా 2లో



## ద్వంద్వ వైఖరి వద్దు

ఉగ్రవాదాన్ని ఎన్నటికీ సహించొద్దు..

ఉగ్రవాదంపై మోదీ గట్టి వార్నింగ్

పాక్ ప్రధానికి వినబడేలా ప్రధాని మోదీ స్ట్రాంగ్ మెసేజ్

వివరాలు.. 2లో



## జార్ఖండ్ హైకోర్టులో రాహుల్‌కి ఊరట

ఆగస్టు 16న తదుపరి విచారణ

అన్ని పక్షాల వాదనలు విన్న కోర్టు..

సమాధానం ఇవ్వాలని పిటిషనర్ ఆదేశం

రాహుల్‌పై చర్యలు తీసుకోకుండా ఆదేశాలు జారీ

వివరాలు.. 2లో



నాకు ద్రోహం చేసినవారు..

## నా ఫొటో పెట్టుకోవద్దు

ఎవరు ఉపయోగించుకోవాలో నిర్ణయించే హక్కు నాకే ఉంది

అజిత్ పవార్‌ను ఉద్దేశించి శరద్ పవార్ కీలక వ్యాఖ్యలు

వివరాలు.. 2లో

### మంచిమాట

అన్నీ కోల్పోయినా.. ఆత్మవిశ్వాసాన్ని కోల్పోకూడదు. అదొక్కటి ఉంటే చాలు.. మనం కోల్పోయిన వాటన్నింటిని తిరిగి దక్కించుకోవచ్చు.

శుభోదయం

# నేతాజీ తరహాలోనే అల్లూరి పోరాటం





అల్లూరి పోరాటం, దేశభక్తి అసమానమైనది: ద్రౌపది ముర్ము

గడ్డిపరకలను గడ్డపారలుగా మార్చిన ధీరుడు అల్లూరి: కేసీఆర్

రాష్ట్రపతి సమక్షంలో అల్లూరి జయంతి ముగింపు ఉత్సవాలు సంతోషం

**హైదరాబాద్, జూలై 4 (మనం న్యూస్):** అల్లూరి సీతారామరాజు ఒక ప్రత్యేకమైన యుద్ధ నైపుణ్యంతో ఆంగ్లేయులపై పోరాటం చేశారని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. ఆయన పోరాటం, దేశ భక్తి అసమానమైనవని నేతాజీ తరహాలోనే ఆయన పోరాటం కూడా ప్రజల్లో స్ఫూర్తి నింపిందని అన్నారు. మహనీయుల చరిత్రను భవిష్యత్ తరాలకు భద్రంగా అందించాలని అన్నారు. స్వాతంత్ర్య పోరాట యోధుడు అల్లూరి సీతారామరాజు 125వ జయంతి ఉత్సవాల ముగింపు కార్యక్రమాన్ని హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించారు. ఈ వేడుకలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో పాటు ముఖ్యమంత్రి కేసీఆర్, గవర్నర్ తమిళిసై, కేంద్రమంత్రి కిషన్ రెడ్డిలు హాజరయ్యారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో ఏర్పాటు చేసిన అల్లూరి 30 అడుగుల కాంస్య విగ్రహం, స్మృతి వనాన్ని హైదరాబాద్ నుంచి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వర్చువల్‌గా ప్రారంభించారు. సీఎం కేసీఆర్ మాట్లాడుతూ.. అల్లూరి సీతారామరాజు లాంటి మహనీయుడి 125వ జయంతి ఉత్సవాలను నిర్వహించుకోవడం యావత్ జాతి కర్తవ్యం అని కేసీఆర్ అన్నారు. ఈ ఉత్సవాలు అల్లూరి సీతారామరాజు పోరాట ..మిగతా 2లో



## బాధపెట్టి ఉంటే క్షమించండి..

అందరికీ ధన్యవాదాలు బండి సంజయ్

బండి సంజయ్ అప్పగింతలు..

ఆఫీసు హ్యాండోవర్, పార్టీ కారు పంపించేశారు

**హైదరాబాద్, జూలై 4 (మనం న్యూస్):** తెలంగాణ బీజేపీ అధ్యక్ష పదవికి రాజీనామా చేసిన అనంతరం బండి సంజయ్ ఎమోషనల్ ట్వీట్ చేశారు. ఇన్నిరోజులు రాష్ట్ర అధ్యక్షునిగా ఉండటం గర్వకారణమని తెలిపారు. తన లాంటి సామాన్య కార్యకర్తకు అధ్యక్ష పదవి ఇచ్చిన ప్రధాని మోడీ, అమిత్ షా, నడ్డాలకు సంజయ్ ధన్యవాదాలు చెప్పారు. హైకమాండ్ అంచనాలను అందుకున్నానని భావిస్తున్నానని, అవకాశం ఇచ్చిన పార్టీ పెద్దలకు సహకరించిన పార్టీ పెద్దలకు బండి సంజయ్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యకర్తలకు రుణపడి ఉంటానని చెప్పారు. తన బాధ్యతను నిర్వర్తించానని, తెలియక ఎవరినైనా బాధపెట్టుంటే క్షమించాలన్నారు. కొత్తరాష్ట్ర అధ్యక్షుడు, ప్రస్తుత కేంద్రమంత్రి కిషన్ రెడ్డితో కలిసి పనిచేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని సంజయ్ స్పష్టం చేశారు. కిషన్ రెడ్డి నాయకత్వంలో అధికారంలోకి వస్తామని సంజయ్ ధీమా వ్యక్తం చేశారు. 2023 జూలై 04న ఢిల్లీలో నడ్డాతో ముగిసిన భేటీ అనంతరం సంజయ్ అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. అధ్యక్ష పదవికి సంబంధించిన మార్పులను బండి సంజయ్‌కు వివరించారు జేపీ నడ్డా. తెలంగాణ బీజేపీ కొత్త అధ్యక్షుడిగా కిషన్ రెడ్డిని అధిష్టానం నియమించింది. బండి సంజయ్ సేవలను కేంద్రంలో వినయోగించుకోనున్నారు పార్టీ పెద్దలు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా రాజీనామా చేసిన అనంతరం బండి సంజయ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. పార్టీ తనకు కేటాయించిన ఫార్చ్యూనర్ కారును స్టేట్ బీజేపీ ఆఫీసుకు పంపించారు. అంతేకాకుండా తన ఛాంబర్‌ను కూడా హ్యాండోవర్ చేశారు. గతేడాది 2022లో టయోటా ఫార్చ్యూనర్ బుల్లెట్ ప్రూఫ్ వాహనాన్ని సంజయ్‌కు కేటాయించింది కేంద్ర ప్రభుత్వం. ఈ వాహనం కోసం పార్టీ తరుపున రెండుకోట్లు కేటాయించింది. తన అధ్యక్ష పదవి ముగియడంతో బండి సంజయ్ తిరిగి దానిని పార్టీకి అప్పగించారు.

# పోడు పట్టాలతో భరోసా

భీంగల్‌లోనే కనీస విలువ 400 కోట్లు

మేము చేసే మంచి పనులకు అండగా నిలవాలి

గిరిజనులకు పట్టాలతో పాటు రైతుబంధు సొమ్ము కూడా జమ

పోడు పట్టాల పంపిణీలో మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి



**నిజామాబాద్, జూలై 4 (మనం న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పోడు పట్టాలతో గిరిజనులకు అస్తిత్వం, భరోసాను కల్పించిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. ఒక్క భీంగల్లోనే దాదాపు 400కోట్లకు పైగా విలువ కలిగిన భూములను అప్పగిస్తున్నామని అన్నారు. ప్రజల కోసం ఎన్నో పనులు చేస్తున్న మాకు మీరు మళ్లీ అండగా నిలవాలని మంత్రి అన్నారు. మీరు అండగా నిలబడితే మరిన్ని మంచి పనులు చేలుగుతామని అన్నారు. బాల్కొండ నియోజకవర్గం భీంగల్ మండలం తాళ్ళపల్లి గ్రామంలో 1011 మంది గిరిజనులకు పోడు పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో లక్షా 50 వేల మంది గిరిజనులకు 4లక్షల ఎకరాల పట్టాలు అందజేస్తున్నామని ..మిగతా 2లో

# పునర్నిర్మాణం అంటే గడీల సంస్కృతా?

వివరాలు.. 2లో





## బండి మార్పుతో పార్టీలో అసంతృప్తులు

పొంగులేటితో రాజగోపాల్ రెడ్డి భేటీ

తాజా పరిణామాలపై ఇరు నేతల చర్చలు

రాజగోపాల్ కాంగ్రెస్‌లోకి చేరుతారన్న ప్రచారం

**హైదరాబాద్, జూలై 4 (మనం న్యూస్):** బిజెపిలో చేసిన మార్పులు కొంత మంది నేతల్ని అసంతృప్తికి గురి చేస్తోంది. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డితో మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలు మంగళవారంనాడు భేటీ అయ్యారు. వారి మధ్య కాంగ్రెస్ పార్టీలో చేరాలన్న అంశంపై చర్చలు జరిగినట్లుగా తెలుస్తోంది. అయితే ఇప్పుడే పార్టీ మార్పుపై ఇప్పటికిప్పుడు నిర్ణయం తీసుకోలేనని రాజగోపాల్ రెడ్డి చెప్పినట్లుగా తెలుస్తోంది. బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న బండి సంజయ్‌ను మార్చాలని కోరిన వారిలో ..మిగతా 2లో

# తెలుగు రాష్ట్రాలకు కొత్త అధ్యక్షులు



ఏపి బిజెపి అధ్యక్షురాలుగా పురంధేశ్వరి

తెలంగాణ బిజెపి చీఫ్‌గా కిషన్ రెడ్డి

తెలంగాణ ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్‌గా ఈటల

జాతీయ కార్యవర్గ సభ్యునిగా కిరణ్ కుమార్ రెడ్డి

పంజాబ్, జార్ఖండ్ రాష్ట్రాలకూ కొత్త అధ్యక్షుల నియామకం



**న్యూఢిల్లీ/అమరావతి/హైదరాబాద్, జూలై 4 (మనం న్యూస్):** తెలుగురాష్ట్రాల్లో సంస్థాగత మార్పులపై దృష్టిపెట్టిన బీజేపీ రెండు రాష్ట్రాలకు కొత్త అధ్యక్షులను నియమించింది. ఇదే సందర్భంలో పలు రాష్ట్రాలకు బీజేపీ కొత్త సారధులను పార్టీ జాతీయ నాయకత్వం ప్రకటించింది. ఏపీ బీజేపీ చీఫ్‌గా పురంధేశ్వరి, తెలంగాణ బీజేపీ చీఫ్‌గా కిషన్ రెడ్డిల పేర్లను పార్టీ ప్రకటించింది. పంజాబ్, జార్ఖండ్ రాష్ట్రాలకు కూడా కొత్త అధ్యక్షులను మార్చింది. పంజాబ్ బీజేపీ చీఫ్‌గా సునీల్ జాఖడ్, జార్ఖండ్‌కు బాబూలాల్ మరండీలను నియమిస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఇక పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యునిగా మాజీ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డిని జేపీ నడ్డా నియమించారు. మరోవైపు.. తెలంగాణ ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్‌గా ఈటల రాజేందర్‌ను పార్టీ నియమించింది.తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిగా బండి సంజయ్ స్థానంలో కిషన్ రెడ్డిని నియమించింది. అలాగే ఏపీ బీజేపీ చీఫ్‌గా సోము వీర్రాజు స్థానంలో ఎన్టీఆర్ తనయ దగ్గుబాటిపురంధేశ్వరికి బాధ్యతలు అప్పగించారు. ఇక తెలంగాణ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్‌గా ఈటెల రాజేందర్‌ను బీజేపీ అధిష్టానం నియమించింది. కాగా ఇప్పటివరకు తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిగా ఉన్న బండి సంజయ్ ..మిగతా 2లో



## మా మధ్య ఎలాంటి గ్యాపులు లేవు..

రాజకీయ పార్టీలు అప్పుడప్పుడు ఆయా పరిస్థితులకు అనుగుణంగా మార్పులు, చేర్పులు చేస్తుంటాయని

ఎన్నికల కమిటీ నిర్వహణ ఛైర్మన్ ఈటల రాజేందర్ క్లారిటీ

**హైదరాబాద్, జూలై 4 (మనం న్యూస్):** కిషన్ రెడ్డితో తనకు విభేదాలున్నాయని వస్తున్న వార్తల్లో ఏమాత్రం వాస్తవం లేదని, తమ మధ్య అంతా సఖ్యతగానే ఉందని బీజేపీ ఎమ్మెల్యే, ఎన్నికల కమిటీ నిర్వహణ ఛైర్మన్ ఈటల రాజేందర్ క్లారిటీ ఇచ్చారు. అలాగే.. ఎంపి బండి సంజయ్ కుమార్తోనూ తనకు ఎలాంటి విభేదాలు ..మిగతా 2లో

## ద్వంద్వ వైఖరి వద్దు..

న్యూఢిల్లీ, జూలై 4 : ఉగ్రవాదం అనేది ఒక ప్రాంతానికే కాదు.. యావత్ ప్రపంచ శాంతికి ప్రమాదకారి. అలాంటి ఉగ్రవాద కట్టడి లో ద్వంద్వ వైఖరి అసలు పనికిరాదు. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడం లో ఎలాంటి ద్వంద్వ ప్రమాణాలు ఉండకూడదని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. సీమాంతర ఉగ్రవాదానికి మద్దతిచ్చే దేశాలను విమర్శించేందుకు ఎస్సీవో కమిటీ ఎన్నడూ వెనుకాడకూడదని స్పష్టం చేశారు. పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ముందే దాయాదిపై ఆయన పరోక్షంగా ధ్వజమెత్తారు. భౌగోళిక వివాదాలు, ఉద్రిక్తతలు, మహమ్మారులతో పోరాడుతున్న అనేక దేశాలకు ఇప్పుడు ఆహారం, ఇంధనం, ఎరువుల కొరత ప్రధాన సమస్యలుగా మారాయని మోదీ అన్నారు. వీటిని ఐక్యంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ అధ్యక్షతన షాంఘై సహకార సంస్థ (ఎస్సీవో) సమావేశం మంగళవారం జరిగింది. వర్చువల్గా జరిగిన ఈ భేటీలో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్ పింగ్, పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్లతో పాటు ఇతర సభ్యదేశాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. పాక్‌పై పరోక్షంగా విరుచుకుపడ్డారు. 'కొన్ని దేశాలు సీమాంతర ఉగ్రవాదాన్ని తమ విదేశాంగ విధానంలో భాగంగా మార్చుకుంటున్నాయి. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడం, ఉగ్ర కార్యకలాపాలకు నిధులను సమకూర్చడం వంటి వాటిని నిరోధించేందుకు నిర్ణయాత్మక చర్యలు అవసరం. సీమాంతర ఉగ్రవాదానికి మద్దతిస్తున్న దేశాలను విమర్శించడంలో ఈ కూటమి ఎన్నడూ వెనుకాడకూడదు. ప్రాంతీయ, ప్రపంచ శాంతికి ఉగ్రవాదం పెను ముప్పుగా మారింది. దానిపై మనమంతా కలిసికట్టుగా పోరాడాలి' అని ప్రధాని పిలుపునిచ్చారు.

**మనమంతా ఒకే కుటుంబం..**

ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. 'షాంఘై సహకార సంస్థ అనేది కేవలం పొరుగున్న దేశాల కూటమి మాత్రమే కాదు.. మనమంతా ఒకే కుటుంబం. భద్రత, ఆర్థికాభివృద్ధి, అనుసంధానత, ఐక్యత, సార్వభౌమత్వాన్ని పరస్పరం గౌరవించుకోవడం, ప్రాదేశిక సమగ్రత, పర్యావరణ పరిరక్షణ.. ఇవన్నీ మన సదస్సు మూల స్తంభాలు అని తెలిపారు. ఇక ఈ సదస్సులో భాగంగా ఉక్రెయిన్‌లో అనిశ్చితి, వాణిజ్యం తదితర అంశాలపై నేతలు చర్చించారు.

2001లో రష్యా, చైనా, కిర్గిస్థాన్, కజకిస్థాన్, తజకిస్థాన్, ఉజ్బెకిస్థాన్ దేశాల అధ్యక్షులు షాంఘై సహకార సంస్థను ప్రారంభించారు. 2005లో భారత్ ఇందులో అబ్జర్వర్‌గా చేరింది. ఆ తర్వాత 2017లో శాశ్వత సభ్య దేశంగా మారింది. ఈ ఏడాది ఇరాన్ కూడా ఈ కూటమిలో కొత్తగా చేరింది.

## రెండు రోజులు.. 4 రాష్ట్రాలు..

(మొదటిపేజీ తరువాయి)

కీలక ప్రాధాన్యం సంతరించుకుంది. జులై 7 శుక్రవారం ప్రధాని మోదీ తొలుత ఢిల్లీ నుంచి ఛత్తీస్గఢ్‌లోని రాయపూర్ వెళ్తారు. అక్కడ పలు ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, జాతికి అంకితం చేయనున్నారు. అనంతరం అక్కడ జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు. ఆ తర్వాత యూపీలోని గోరఖ్పూర్ వెళ్లి గీతా ప్రెస్ నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొంటారని సమాచారం. భారత రైల్వేశాఖ ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన వందే భారత్ రైళ్లను మరో మూడు రూట్లలో ప్రారంభించడంతో పాటు గోరఖ్‌పూర్ రైల్వేస్టేషన్ పునరుద్ధరణ పనులకు శంకుస్థాపనలు చేస్తారు. ఆ తర్వాత గోరఖ్‌పూర్ నుంచి తన నియోజకవర్గమైన వారణాశికి చేరుకోనున్న ప్రధాని.. అక్కడ పలు కీలక ప్రాజెక్టులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాల్లో పాల్గొంటారు. అలాగే, మణికర్ణిక ఘాట్, హరిశ్చంద్ర ఘాట్ల పునరుద్ధరణ పనులకు ప్రధాని మోదీ శంకుస్థాపన చేయనున్నట్టు సమాచారం. జులై 8న వారణాశి నుంచి వరంగల్ చేరుకోనున్న ప్రధాని.. ఇక్కడ విజయవాడ–నాగపూర్ కారిడార్‌తో పాటు పలు అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం వరంగల్లో జరిగే బహిరంగ సభలో ప్రధాని ప్రసంగిస్తారు. అనంతరం వరంగల్ నుంచి రాజస్థాన్లోని బికనేర్‌కు వెళ్లి అక్కడ పలు ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాల్లో పాల్గొంటారు. బికనేర్ రైల్వేస్టేషన్ పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం బహిరంగ సభలో పాల్గొని అక్కడి నుంచి హస్తినకు చేరుకోనున్నారు.

## జార్ఖండ్ హైకోర్టులో రాహుల్‌కి ఊరట

న్యూఢిల్లీ, జూలై 4 : కాంగ్రెస్ అగ్రనేత, మాజీ ఎంపీ రాహుల్ గాంధీకి జార్ఖండ్ హైకోర్టులో ఊరట లభించింది. పరువు నష్టం కేసులో దాఖలైన పిటిషన్ హైకోర్టు విచారణ జరిపింది. రాహుల్‌పై చర్యలు తీసుకోకుండా ఆదేశాలు జారీ చేసింది. ఈ పిటిషన్‌పై హైకోర్టు ఆగస్టు 16న విచారణ చేపట్టనున్నది. 2019లో కర్నాటక కోలార్‌లో జరిగిన బహిరంగ సభలో రాహుల్ గాంధీ.. ప్రధానిని ఉద్దేశించి.. 'మోదీ' ఇంటి పేరుపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత పలు రాష్ట్రాల్లో రాహుల్ గాంధీకి వ్యతిరేకంగా పరువు నష్టం కేసులు నమోదయ్యాయి. జార్ఖండ్‌లో నమోదైన కేసు విచారణ సందర్భంగా రాహుల్‌కు హైకోర్టు మధ్యంతర ఉపశమనం ఇచ్చింది. జస్టిస్ సంజయ్ కుమార్ ద్వివేది బెంచ్ పిటిషన్‌పై విచారణ జరిపింది. విచారణ సందర్భంగా అన్ని పక్షాల వాదనలు విన్న కోర్టు.. సమాధానం ఇవ్వాలని పిటిషనర్ ప్రదీప్ మోదీని ఆదేశించింది. అదే సమయంలో రాహుల్‌కి ఊరటనిస్తూ.. తదుపరి విచారణ వరకు ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఆదేశాలు జారీ చేసింది. రాంచీలో రాహుల్ గాంధీపై బీజేపీ నేత ప్రదీప్ మోదీ పరువునష్టం కేసు వేశారు. పరువు నష్టం కేసులో సూరత్ కోర్టు తీర్పు నేపథ్యంలో రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వం కోల్పోయిన విషయం తెలిసిందే.

## పోడు పట్టాలతో భరోసా

(మొదటిపేజీ తరువాయి)

వెల్లడించారు. నిజామాబాద్ జిల్లాలో 4300 మందికి 8,600 ఎకరాలు అందిస్తున్నామన్నారు. గతంలో వ్యవసాయం చేసుకునే సందర్భంలో అడవి బిడ్డలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. పంట వేసిన నుంచి ధాన్యం చేతికి వచ్చే వరకు ఇబ్బందులు పడ్డారని వెల్లడించారు.అలాంటి పరిస్థితుల నుంచి గౌరవప్రదంగా వ్యవసాయం చేసుకునే స్థాయికి తీసుకొచ్చిన ఘనత కేసీఆర్‌దే నని అన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినపుడు ఎంత సంతోష పడ్డానో గిరిజనులకు పోడు పట్టాలు ఇస్తున్నపుడు అంతే సంతోషంగా ఉందన్నారు. గిరిజనుల అభ్యున్నతి కోసం ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు తరువాత జరిగిన మార్పుపై ప్రజల్లో చర్చ జరగాలని పేర్కొన్నారు. గిరిజన తండాలో తీజ్ భవన్ నిర్మించేందుకు సీఎం కేసీఆర్‌కు విన్న వించానని త్వరలో అనుమతి వస్తుందని ఆశిస్తున్నానని తెలిపారు. గిరిజనులకు పట్టాలతో పాటు రైతుబంధు సొమ్ము కూడా జమ అయ్యిందన్నారు. మార్కెట్లో భూమి విలువ కనీసం 20 లక్షలు వేసుకున్నా.. అందులో సగం ధరలు లెక్క కట్టినా పోడు పట్టాల విలువ 400కోట్లు ఉంటుందన్నారు. ఇది ఇక మీ తరాలకు పట్టాగా నిలుస్తుందని అన్నారు. ఇన్ని మంచి కార్యక్రమాలు చేస్తున్న మాకు మీరు ఎప్పుడూ అండగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు రాష్ట్రాలకు కొత్త అధ్యక్షులు




(మొదటిపేజీ తరువాయి)

తన పదవికి రాజీనామా చేశారు. ఇక 2020 జులై 27న ఏపీ బీజేపీ అధ్యక్ష పదవి బాధ్యతలు చేపట్టిన సోము పదవీ కాలం కూడా ముగియడంతో పురంధేశ్వరికి బాధ్యతలు అప్పగించారు. కాగా మొదట బీజేపీ జాతీయ కార్యదర్శిగా ఉన్న సత్యకుమార్‌కు ఏపీ పగ్గాలు అప్పగించవచ్చని ప్రచారం సాగింది. అయితే చివరకు పురంధేశ్వరినే బీజేపీ అధిష్టానం ఖాయం చేసింది. అలాగే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి బీజేపీ జాతీయ కార్యవర్గంలో చోటు దక్కించుకున్నారు. సుమారు మూడేళ్ల పాటు ఏపీ బీజేపీ అధ్యక్షుడిగా ఉన్న సోము వీర్రాజు తీరుపై పలు ఫిర్యాదులున్నాయి. వైసీపీ ప్రభుత్వంపై దూకుడుగా వెళ్లడం లేదన్న ఆరోపణలు వచ్చాయి. దీనికి తోడు జనసేన అధ్యక్షులు పవన్ కల్యాన్ కూడా రాష్ట్ర బీజేపీ నాయకత్వంపై అసంతృప్తిగా ఉన్నారు. బీజేపీతో పొత్తు ఉన్నా రాష్ట్ర నాయకత్వం సహకరించడం లేదంటూ కమలం పార్టీపై విమర్శలు గుప్పించారు. అలాగే కన్నాలక్ష్మీనారాయణ వంటి సీనియర్ నేతలు పార్టీకి దూరమయ్యారు. ఈక్రమంలోనే పురంధేశ్వరికి బాధ్యతలు అప్పగించారు. ఆమె ఎన్టీఆర్ కూతురు కావడంతో కలిసివచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఇప్పటి వరకూ ఈమె బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలిగా ఉన్నారు. అంతేకాక, ఒడిశాకు బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జిగా ఉన్నారు. సోము వీర్రాజును రాజీనామా చేయించిన అనంతరం అధ్యక్ష పదవి కోసం సత్యకుమార్, సుజనా చౌదరి పేర్లు వినిపించాయి. కానీ అధిష్ఠానం పురంధేశ్వరి వైపే మొగ్గ చూపింది. చడీ చప్పుడు కాకుండా ఏపీ అధ్యక్షుడి పదవి నుంచి సోమువీర్రాజును తొలగించిన అధిష్టానం.. కొత్త అధ్యక్షురాలిగా పురంధేశ్వరిని నియమిస్తూ పార్టీ అధిష్టానం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు అధికారిక ప్రకటన విడుదలైంది. ఏపీ బీజేపీ అధ్యక్ష పదవికి రాజీనామా చేయాల్సిందిగా సోము వీర్రాజును అధిష్టానం ఆదేశించింది. సోము వీర్రాజును తొలగి స్తున్నట్టు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా స్వయంగా ఆయనకే ఫోన్ చేసి చెప్పి షాక్ ఇచ్చారు. సోమువీర్రాజును అధ్యక్ష పదవి నుంచి తొలగించి పురందేశ్వరిని నియమిస్తూ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం పురంధేశ్వరి అమర్నాథ్ యాత్రలో ఉన్నారు.

# నేతాజీ తరహాలోనే అల్లూరి పోరాటం

(మొదటిపేజీ తరువాయి)

చైతన్యాన్ని, దేశభక్తిని కొత్త తరానికి ఘనంగా చాటిచెబుతాయని నేను విశ్వసిస్తున్నానన్నారు. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సమక్షంలో ఈ ఉత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించడం చాలా సముచితమన్నారు. ఇలాంటి గొప్ప కార్యక్రమానికి తనను ఆహ్వానించడం అదృష్టంగా భావిస్తున్నట్లుగా కేసీఆర్ చెప్పారు. బ్రిటీష్ బానిస బంధాల్లో చిక్కుకుని భారతజాతి నలిగిపోతున్న వేళ విప్లవజ్యోతి అయి అవతరించిన వీర యోధుడు మన అల్లూరి సీతారామరాజు అని ముఖ్యమంత్రి ప్రశంసించారు. అన్నెంపున్నెం ఎరుగనటువంటి మన్యం బిడ్డల కన్నీరు తుడిచి, గడ్డిపరకలను గడ్డపారలుగా మార్చిన మహా యోధుడు మన అల్లూరి అని కొనియాడారు. భారతమాత గర్వించేటువంటి ఉత్తమ తనయుడు, నిర్మల దేశభక్తుడు, నిజమైన యోగి పుంగవుడు అల్లూరి అని కేసీఆర్ పేర్కొన్నారు. ఈ కర్తవ్యాన్ని భక్తిశ్రద్ధలతో నిష్ఠతో నిర్వహించిన క్షత్రియ సేవా సమితిని మనస్ఫూర్తిగా నేను అభినందిస్తున్నాను. ఈ ఉత్సవాలు అల్లూరి సీతారామరాజు పోరాట చైతన్యాన్ని, దేశభక్తిని కొత్త తరానికి ఘనంగా చాటిచెబుతాయని నేను విశ్వసిస్తున్నాను. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సమక్షంలో ఈ ఉత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించడం చాలా సముచితం. ఇలాంటి గొప్ప కార్యక్రమానికి నన్ను ఆహ్వానించడం, నేను పాల్గొనడం జరిగింది అని కేసీఆర్ పేర్కొన్నారు. యాక్టర్ కృష్ణ అల్లూరి సీతారామరాజు సినిమా నిర్మించి ఉండకపోతే, అందులో శ్రీశ్రీ లాంటి మహాకవి తెల్లవాడి గుండెల్లో నిదురించినవాడా.. మా నిదురించిన పౌరుషాగ్ని రగిలించిన వాడా.. అనే పాట కూడా చాలాచాలా పాపులర్ అయింది అని కేసీఆర్ గుర్తు చేశారు. అల్లూరి ప్రేమికులందరు కూడా ఆ పాటను నిరంతరంగా వింటారు. తెలంగాణ ఉద్యమ సందర్భంలో కూడా ఈ పాటను నా కారులో అనేకసార్లు పెట్టుకుని విన్నాను అని కేసీఆర్ తెలిపారు. మార్జినలైజ్డ్ సెక్షన్ల మీద ఎప్పుడైతే దాడి సంభవిస్తదో అప్పుడు కొందరు వీరులు ఉద్భవించి వాళ్లకు శాంతి కలుగజేస్తరు అని కేసీఆర్ పేర్కొన్నారు. చాలా గొప్ప చరిత్ర మన అల్లూరిది. చాలా చిన్న వయసులో అంత పెద్ద ప్రేరణ వారికి ఎలా కలిగిందో అందుకే నేను దైవాంశ సమ్మితులు అని చెప్పింది. అంత పిన్న వయసులో ఆ ప్రజలు పడే బాధలు చూడలేక, వారు ఆ యుద్ధరంగంలో దూకి 26 సంవత్సరాల కాలంలోనే రవి అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడ లాడించాడు. భారతజాతి గర్వంగా



చెప్పుకునే అనేక మంది స్వాతంత్ర్య సమరయోధులు.. భగత్ సింగ్ కావొచ్చు, ఆజాద్ చంద్రశేఖర్ కావొచ్చు.. సుభాష్ చంద్రబోస్ కావొచ్చు.. వారి సరసన మేము తక్కువకాదు అని మన తెలుగు జాతిని నిలబెట్టి, మనందరం గర్వించేటటువంటి మహానీయుడు మన అల్లూరి సీతారామరాజు. మేం తక్కువ కాదు అని నిరూపించిన వారి త్యాగనిరితిని, చివరకు చనిపోతూ కూడా దేశం గురించే మాట్లాడి, దేశం కోసం ప్రాణాలర్పించారు అని కేసీఆర్ గుర్తు చేశారు. మహాత్మా గాంధీ అహింస సిద్ధాంతాన్ని ప్రవచించిన వ్యక్తి.. అయినప్పటికీ ఆయన కూడా అల్లూరి సీతారామరాజును ప్రశంసించకుండా ఉండలేను అని గాంధీ స్టేట్‌మెంట్ ఇచ్చారు. అది రికార్డు అయి ఉంది అని కేసీఆర్ గుర్తు చేశారు. అటువంటి మహానీయుడు చేసినటువంటి ఆ పోరాటం వల్ల మనందరం ఇవాళ గౌరవంగా, సమున్నతంగా ఈ ఉత్సవాలను నిర్వహించుకుంటున్నాం. ఈ ఉత్సవాలను గౌరవంగా చేపట్టి, ఈ అమృత్ మహోత్సవ్‌లో అల్లూరి సీతారామరాజును చేర్చి, వారికి తగినటువంటి గౌరవాన్ని కల్పించిన కేంద్ర ప్రభుత్వానికి తెలుగు జాతి ప్రజలందరి తరపున ధన్యవాదాలు చెబుతున్నాను అని కేసీఆర్ తన ప్రసంగాన్ని ముగించారు. నేడు ఉదయం హకీంపేట ఎయిర్ పోర్టులో రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు గవర్నర్ తమిళి సై, సీఎం కేసీఆర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, మంత్రులు మహమూద్ అలీ, సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్, తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్, ఎమ్మెల్యేలు జీవన్ రెడ్డి, కాలేరు వెంకటేశ్, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, నవీన్, మేయర్ గద్వాల విజయలక్ష్మి, డీజీపీ అంజనీ కుమార్, సైబరాబాద్ పోలీస్ కమిషనర్, మేడ్చల్ కలెక్టర్ తదిరులు ఉన్నారు.

# పునర్నిర్మాణం అంటే గడీల సంస్కృతా?

- బీఆర్ఎస్‌వి మధ్య యుగపు కాలం నాటి ఆలోచనలు
- సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క
- తెలంగాణ జన గర్జన సభను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు



ఖమ్మం, జూలై 4, (మనం బ్యూరో) : తెలంగాణ పునర్నిర్మాణం అంటే గడీల సంస్కృతా అని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క ప్రశ్నించారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖమ్మంలో కాంగ్రెస్ భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయబోతున్నట్లు మూడు నెలల నుండే జిల్లా మండల కాంగ్రెస్ కమిటీల ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించడం జరిగిందని తెలిపారు. జిల్లా పోలీస్ యంత్రంగానికి కూడా తెలుసని అయినప్పటికీ ఉద్దేశపూర్వకంగా సభను అడ్డుకోవాలని విశ్వ ప్రయత్నాలు చేశారని అన్నారు. అయినా ప్రజా అభిమానం ముందు వారి ప్రయత్నాలు విఫలం చెంది తండోప తండాలుగా ప్రజలు హాజరై సభను విజయవంతం చేశారని అన్నారు. నేడు రాష్ట్రంలో మధ్యయుగపు కాలంనాటి సంస్కృతి కనిపిస్తుందని తెలంగాణను పునర్నిర్మానం చేస్తున్నాము అంటూ హైదరాబాద్ రాష్ట్రంలో చూసిన నిజాం నిరంకుశ పాలన తిరిగి కొనసాగిస్తున్నారని విమర్శించారు. దీనినే పునర్నిర్మాణం అనే భావనలో తెలంగాణ ప్రభుత్వం ఉందని ఎద్దేవా చేశారు. వందల ఎకరాల్లో అధికార పార్టీ ప్రజాప్రతినిధులు గడీల తరహా ఫామ్ హౌస్ లను కట్టి భూ దందాలు సెటిల్మెంట్లు చేస్తున్నారని ఆరోపించారు. నీళ్లు నిధులు నియామకాల కోసం కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో కృష్ణ గోదారి జలాల నుండి ఒక ఆయకట్టుకు నీరు అందించిన పాపాన పోలేదని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పై కేటీఆర్ అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. కాళేశ్వరం ద్వారా అదనంగా ఒక్క ఎకరానికైనా నీరు ఇచ్చారా కాళేశ్వరం కింద బ్రాంచ్ కెనాల్, పంట కాలవలు తీశారా, బ్రాంచ్ కెనాల్స్ డిస్ట్రిబ్యూటర్స్ కెనాల్ లేకుండా ఎక్కడ ఏ గ్రామానికి నీరు ఇచ్చారు అప్పనంగా అడ్డంగా ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రచార ఆర్భాటాలతో 45 లక్షల ఎకరాలకు నీరు ఇస్తున్నామని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. కాగ్ కూడా కాళేశ్వరం ప్రాజెక్టు విధానాలను తప్పు పట్టిందని అన్నారు. ఒక్క ఎకరానికి నీరు ఇవ్వకుండా 80 వేల కోట్లు ఖర్చు పెట్టామని చెప్పుకుంటున్నారని అన్నారు. ఏ నీళ్ళ కోసం అయితే రాష్ట్రం తెచ్చుకున్నామో ఆ నీళ్లు రాకుండా చేస్తున్నారని దూషించారు. ఖమ్మం జిల్లాకు సంబంధించి ఇందిరా సాగర్ రాజీవ్ సాగర్ ప్రాజెక్టులను రీడిజైన్ చేసి ప్రజలకు అందించాల్సిన అవసరం ఉన్నా కూడా ప్రభుత్వం ఆ దిశగా ప్రయత్నం చేయడం లేదని అన్నారు. రాహుల్ గాంధీ విమర్శించిన విధంగా బిజెపికి బీఆర్ఎస్ పార్టీ బీ టీం అనే మాట వాస్తవం అని అన్నారు. పాట్నాలో జరిగిన బిజెపి వ్యతిరేక పార్టీల కూటమిలో అఖిలేష్ యాదవ్ కూడా పాల్గొన్నారని హైదరాబాదులో అదే అఖిలేష్ యాదవ్ తో కెసిఆర్ రహస్య మంతనాలు జరుపుతున్నారని, బిజెపికి వ్యతిరేకంగా ఐక్యమవుతున్న కూటమి పక్షాలను విడదీసే ప్రయత్నం చేస్తున్నారని తద్వారా భారతీయ జనతా పార్టీ మేలు చేయడానికి బీఆర్ఎస్ కృషి చేస్తుందని తెలిపారు. రాష్ట్రంలో టిఆర్ఎస్కు వేసిన ప్రతి ఓటు బిజెపికే చెందుతుందని ప్రజలు ఆలోచించాలని కోరారు. విలేకరుల సమావేశ అనంతరం ఖమ్మం మార్కెట్ కమిటీ ఎక్స్ వైస్ చైర్మన్ మడుపల్లి భాస్కర్ ఆధ్వర్యంలో భట్టి విక్రమార్కను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, టిపిసిసి ఉపాధ్యక్షులు పోట్ల నాగేశ్వరావు, పీసీసీ సభ్యులు రాయల నాగేశ్వరావు, వడ్డే నారాయణరావు, పుచ్చాకాయల వీరభద్రం, రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ నాయకులు దాసరి దానియల్, పీపుల్స్ మార్చ్ పాదయాత్ర కన్వీనర్ బుల్లెట్ బాబు, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, జిల్లా కాంగ్రెస్ నాయకులు వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, జిల్లా మైనారిటీ అధ్యక్షులు సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, వనం బాబు, మద్ది వీరారెడ్డి, బోనకల్ జెడ్పీటిసి మోదుగు సుధీర్ బాబు, మాజీ ఖమ్మం వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ మడుపల్లి భాస్కర్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యర్రం బాలగంగాధర్ తిలక్, కార్పొరేటర్లు మలీదు వెంకటేశ్వర్లు, దుద్ధుకూరి వెంకటేశ్వర్లు, మిక్కిలినేని మంజుల, లకావత్ సైదులు నాయక్, బాలాజీ నాయక్, మాజీ కౌన్సిలర్ పాలకుర్తి నాగేశ్వరావు, అంజి, బచ్చలకూరి నాగరాజు, అంజి, నాగరాజు, తదితర నాయకులు పాల్గొన్నారు.

# తెలంగాణలో మరో భారీ పెట్టుబడి

### జీనోమ్ వ్యాలీలో ఆరిజోన్ ఫార్మా ఏర్పాటు: కెటిఆర్



హైదరాబాద్, జూలై 4 (మనం న్యూస్):తెలంగాణకు పెట్టుబడుల ప్రవాహం కొనసాగుతూనే ఉంది. తాజాగా మరో భారీ పెట్టుబడి వచ్చింది. ఆరిజెన్ ఫార్మా సంస్థ హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టనున్నట్లు ప్రకటించింది. ఈ ఫార్మా సంస్థ జీనోమ్ వ్యాలీలో 40 మిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టనుంది. 250 మందికి పైగా ఉపాధి కల్పించనుంది. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో బయో మ్యానుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీ ఏర్పాటు చేయనుంది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్‌తో సమావేశం అనంతరం ఆరిజెన్ ఫార్మా సంస్థ ఈ విషయాన్ని ప్రకటించింది. ఆరిజెన్ ఫార్మా సంస్థ నిర్ణయంపై మంత్రి కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు.

## మా మధ్య ఎలాంటి గ్యాపులు లేవు..

(మొదటిపేజీ తరువాయి)

లేవన్నారు. ఇదంతా మీడియా సృష్టించిన కన్ఫ్యూజన్ తప్ప, తమ మధ్య విభేదాలేమీ లేవన్నారు. నాయకులందరూ బాగానే కలిసి ఉన్నారని చెప్పారు. కొంతమంది ఈమధ్య రచ్చకీడ్చుకుంటున్నారని, అది మంచిది కాదని హితవు పలికారు. రాజకీయ పార్టీలు అప్పుడప్పుడు ఆయా పరిస్థితులకు అనుగుణంగా మార్పులు, చేర్పులు చేస్తుంటాయని.. బీజేపీ కూడా అలాంటి మార్పులే చేసిందని తెలిపారు. ఇటు రాష్ట్ర నేతలు, అటు అధిష్టానం.. తెలంగాణ గడ్డపై కాషాయ జెండా ఎగురవేయాలనే సంకల్పంతో ఉన్నారని.. అందుకే తాజా మార్పులు చేయడం జరిగిందని స్పష్టతనిచ్చారు. పార్టీ కోసం నిబద్ధతతో పని చేసే వారికే ప్రాముఖ్యత ఇవ్వడం జరుగుతుందని.. రాష్ట్రంలో పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు అందరం కలిసి సమిష్టిగా పని చేస్తామని ఈటల రాజేందర్ తెలిపారు. తాను గ్రూప్ రాజకీయాలను ఏమాత్రం ప్రోత్సాహించనని తెగేసి చెప్పారు. రాజకీయాల్లో తనకు, కిషన్ రెడ్డికి అపారమైన అనుభవం ఉందని.. తమకున్న అనుభవంతో తామిద్దరం కలిసి పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని అన్నారు. పార్టీలో పనిచేయాలన్నా, ఒక ప్రజాప్రతినిధిగా ఉండాలన్నా.. క్రమశిక్షణ, నిబద్ధత చాలా అవసరమని సూచించారు. కిషన్ రెడ్డికి రాష్ట్ర రాజకీయాలు కొట్టిన పిండి వంటివని కొనియాడారు. ఏదేమైనా.. అంతిమంగా గెలుపోటములు కీలకం కాబట్టి, గెలుపు దిశగా తామంతా కలిసి పని చేస్తామని చెప్పుకొచ్చారు. ప్రజలు బీజేపీని గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని, తెలంగాణ ప్రజల అంతరంగం తనకు తెలుసని అన్నారు. తనమీద విశ్వాసం ఉంచి, తనకు ఈ కొత్త బాధ్యతలు అప్పగించినందుకు గాను బీజేపీ హైకమాండ్కి ధన్యవాదాలు తెలిపారు.

## బండి మార్పుతో పార్టీలో అసంతృప్తులు

(మొదటిపేజీ తరువాయి)

ఈటల రాజేందర్, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కూడా ఉన్నారు.. తాజాగా బండి సంజయ్‌ని అధ్యక్ష బాధ్యతల నుంచి తప్పించి కిషన్ రెడ్డికి ఆ బాధ్యతను కట్టబెట్టింది. తెలంగాణ ఎన్నికల నిర్వహణ కమిటీ ఛైర్మన్ గా నియమితులయ్యారు. అయితే రాజగోపాల్ రెడ్డికి మాత్రం ఎలాంటి పదవి లభించలేదు. ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన పొంగులేటి, జూపల్లిలో కాంగ్రెస్ ఘర్ వాపసీపై విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. దీనిలో భాగంగానే నేడు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని కలిసి పార్టీలోకి ఆహ్వానించారు. నిజానికి రాజగోపాల్ రెడ్డి కాంగ్రెస్ నాయకుడు. ఆయన ఇటీవల బీజేపీలో చేరి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. ఉపఎన్నికల్లో మళ్లీ తన స్థానం మునుగోడు నుంచి పోటీ చేసి బీఆర్ఎస్ అభ్యర్థి చేతిలో పరాజయం పాలయ్యారు. రేవంత్ రెడ్డిని టీ పీసీసీ చీఫ్‌ను చేయడాన్ని రాజగోపాల్ రెడ్డి వ్యతిరేకించారు. ఆయన సోదరుడు కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఎంపీ. ఆయన కూడా రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని వ్యతిరేకించారు. అయితే మొదట ఉపఎన్నిక వ్యూహంలో భాగంగా రాజగోపాల్ రెడ్డి బీజేపీలో చేరారు. తర్వాత వెంకటరెడ్డి కూడా చేరుతారని అనుకున్నారు. కానీ కర్ణాటక ఎన్నికల ఫలితాల తర్వాత మొత్తం సీన్ మారిపోయింది. కేసీఆర్ ను ఓడించే పార్టీ బీజేపీ మాత్రమేనని ప్రకటనలు చేస్తూ వచ్చిన రాజగోపాల్ రెడ్డి ఇప్పుడు బీజేపీపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కేసీఆర్‌తో లోపాయికారీ ఒప్పందాలు చేసుకుంటున్నారన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కవితను అరెస్ట్ చేయకపోవడం ఢిల్లీ లిక్కర్ స్కాంలో తదుపరి చర్యలు తీసుకోకపోవడం.. బీఆర్ఎస్ నేతలపై కేంద్ర దర్యాప్తు సంస్థలు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడాన్ని రాజగోపాల్ రెడ్డి జీర్ణించుకోలేకపోతున్నారు. అందుకే ఆయన కాంగ్రెస్ వైపు చూస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. ఆయన సోదరుడు వెంకటరెడ్డి కూడా.. రాజగోపాల్ రెడ్డి కాంగ్రెస్ లోకి వస్తారని చెబుతున్నారు. ఇవాళ కాకపోతే.. రేపైనా రాజగోపాల్ రెడ్డి కాంగ్రెస్ లో చేరుతారన్న అభిప్రాయం వినిపిస్తోంది.

## నా ఫొటో పెట్టుకోవద్దు

ముంబయి, జూలై 4 : మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్‌ను ఉద్దేశించి నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ అధినేత శరద్ పవార్ కీలక వ్యాఖ్యాలు చేశారు. తనకు నమ్మక ద్రోహం చేసిన వాళ్లు తన ఫొటో వినియోగించవద్దని స్పష్టం చేశారు. భాజపా-శివసేన ప్రభు త్వానికి మద్దతు తెలిపిన ఎన్సీపీ నేత అజిత్ పవార్.. ఉప ముఖ్య మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన రెండు రోజుల తర్వాత శరద్ పవార్ ఈ విధంగా స్పందించారు. 'పార్టీకి జాతీయ అధ్యక్షుడైన నేను, రాష్ట్ర అధ్యక్షుడు జయంత్ పాటిల్ మాత్రమే నా ఫొటో ఉపయోగించుకోవచ్చు. తన ఫొటోను ఎవరు ఉపయోగించుకోవాలో నిర్ణయించే హక్కు తనకు ఉంది. నా భావజాలాన్ని వ్యతిరేకించేవా రు, నాతో సిద్ధాంతపరంగా విభేదించేవారు నా ఫొటోను వాడవద్దు' అని శరద్ పవార్ పేర్కొన్నారు. ఎన్సీపీ నేత అజిత్ పవార్‌తోపాటు మరో ఎనిమిది మంది ఎమ్మెల్యేలు భాజపా-శివసేన ప్రభుత్వానికి మద్దతు తెలిపిన విషయం తెలిసిందే. అజిత్ పవార్ ఉపముఖ్యమం త్రిగా, మరో ఎనిమిది మంది మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశా రు. ఈ పరిణామాలతో ఎన్సీపీ పార్టీ రెండుగా చీలిపోయినట్లయ్యిం ది. అనంతరం తమదే అసలైన ఎన్సీపీ అంటూ ఇరు వర్గాలు ప్రకటించుకున్నాయి. ఈ క్రమంలో ఎన్సీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న జయంత్ పాటిల్ను తొలగిస్తున్నట్లు అజిత్ వర్గం పేర్కొనగా.. అజిత్‌తోపాటు ఆయనతో వెళ్లిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని అసెంబ్లీ స్పీకర్కు జయంత్ పాటిల్ విజ్ఞప్తి చేయడం గమనార్హం.

## శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయంలో ముగిసిన టెండర్లు

- పలు వ్యాపారాలకు వేలంపాట వాయిదా




కొమురవెల్లి, జూలై 4, మనం న్యూస్ః శ్రీ కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయంలో టెండర్లు సీల్డ్ కం బహిరంగ వేలం ద్వారా నిర్వహించారు. గుట్టపై శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయం వద్ద కొబ్బరికాయలు అమ్ముకునే వేలం హక్కు రూ. 20 లక్షల రూపాయలకు పాట పాడి బుడిగె రమేష్ గౌడ్, కోరమీసాలు అమ్ముకునేందుకు బహిరంగ వేలం ద్వారా రూ. 6 లక్షలకు ఎక్కల్దేవి అరుణలు ఒక సంవత్సరం కాలపరిమితిని దేవస్థానం తరుపున పొందారు. మిగతా టెండర్లు తలనీలాలు, కొబ్బరిముక్కలు, వస్త్రాలు, ఒడి బియ్యం, పసుపు పోగు చేసుకునే వేలం సరైన పాట దేవస్థానానికి రానందున వాయిదా వేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారి బాలాజీ, ఆలయ చైర్మన్ గీస బిక్షపతి, జెడ్పీటిసి సిలివేరి సిద్దప్ప, ఆల య ఈఓ వైరాగ్యం అంజయ్య, ప్రధాన అర్చకులు మహదేవుని మల్లికా ర్జున్, పర్యవేక్షకులు నీల శేఖర్, పాలకమండలి సభ్యులు రఘువీరా రెడ్డి, గిరి, బుచ్చిరెడ్డి, సౌజన్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## పోరాట వీరుడు దొడ్డి కొమురయ్య

- మండల కురుమ సంఘం అధ్యక్షులు దేవునూరి పోచయ్య



తొగుట, జూలై 04, మనం న్యూస్: తెలంగాణ సాయుధ పోరాటంలో మొట్టమొదటగా గొడ్డలి ఎత్తుకొని ఎదురు తిరిగిన వీరుడు దొడ్డి కొమురయ్య అని తొగుట మండల కురుమ సంఘం అధ్యక్షులు దేవునూరి పోచయ్య కొనియాడారు. మంగళవారం దొడ్డి కొమురయ్య 77వ వర్ధంతి సందర్భంగా మండలంలోని ఎల్లారెడ్డిపేట, గుడికందుల గ్రామాల్లో కురుమ సంఘం ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్యకు ఘన నివాళులు అర్పించారు. ఈ సదర్భంగా పోచయ్య మాట్లాడుతూ దొడ్డి కొమురయ్య తెలంగాణ సాయుధ పోరాటంలో మొదటగా గొడ్డలి ఎత్తుకొని ఎదురు తిరిగిన వీరుడని, దున్నే వాడిదే భూమి అని, పోరుకు సై అన్న మహావీరుడు వంటి ధైర్యాన్ని మనలో నింపుకోవాలని తెలిపారు. అనంతరం కొమురయ్య విగ్రహానికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ కన్నయ్యగారి హరికృషారెడ్డి, గుడికందుల సర్పంచ్ మల్లయ్య, గ్రామ యూత్ కమిటీ అధ్యక్షులు కనికి ప్రవీణ్, జిగిరి ఐలయ్య, దేవునూరి అశోక్, శ్రీనివాస్, చెత్రి బాలయ్య, పర్శరాములు, బైతి శ్రీనివాస్, బైతి ప్రవీణ్, సాయి, అశోక్, పులి యాదయ్య, పులి రాజు, గురువారెడ్డితోపాటు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రజాదరణ చూసి బీజేపీ, బీఆర్ఎస్‌ల పీఠాలు కదులుతున్నాయి

- రఘునందన్‌రావు ఆరోపణలపై బండి సమాధానమివ్వాలి
- కరీంనగర్ సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు నరేందర్ రెడ్డి



కరీంనగర్, జులై 4 (మనం న్యూస్): ఖమ్మం జనగర్జన సభ ద్వారా ప్రజల్లో కాంగ్రెస్ పార్టీకున్న ప్రజాదరణ చూసి బీఆర్ఎస్, బిజెపి నాయకుల పీఠాలు కదులుతున్నాయని నగర కాంగ్రెస్ అధ్యక్షులు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఎద్దేశా చేశారు. నగర కాంగ్రెస్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌కు రోజురోజుకు పెరుగుతున్న ప్రజాదరణ చూసి జంకుతున్న బిఆర్ఎస్, బిజెపి నాయకులు అర్థం కాని రీతిలో వ్యవహరిస్తూ, ఇష్టారీతిన వ్యాఖ్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. పుస్తెలమ్మి ఎన్నికల్లో పోటీ చేసానని చెప్పిన బండి సంజయ్, వంద కోట్లు ఎలా సంపాదించారని బిజెపి ఎమ్మెల్యే రఘునందన్ రావు అన్న మాటలకు బండి సంజయ్ కుమార్ సమాధానం చెప్పాలని నరేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. బిఆర్ఎస్, బిజెపిల పాలనలో ఆయా పార్టీల నాయకులు అక్రమాలు, అవినీతి కార్యకలాపాలకు పాల్పడుతున్నారనడానికి రఘునందన్‌రావు వ్యాఖ్యలే నిదర్శనమన్నారు. కేవలం కాంగ్రెస్ వల్లనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమవుతుందన్న నమ్మకం ప్రజల్లో నెలకొందన్నారు. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పరిచేందుకు సిద్ధంగా ఉన్నారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. వృద్ధాప్య పింఛన్లు నెలకు నాలుగువేలు చొప్పన ఇస్తామని కాంగ్రెస్ ప్రకటిస్తే, అది సాధ్యం కాదని అంటున్న బిఆర్ఎస్ నాయకులకు కోట్ల రూపాయలు కమీషన్ల పేరు మీద దండుకోవడం మాత్రమే తెలుసని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాలలో ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చుతున్నామని రాజస్తాన్‌లో అయిదు వందల రూపాయలకే గ్యాస్ సిలిండర్, కర్ణాటకలో మహిళలందరికీ ఉచిత బస్సు ప్రయాణం, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో రైతులకు పండించిన పంటపై క్వింటాలుకు అయిదువందల చొప్పున బోనస్‌లు మొదలుకొని ఇచ్చిన ప్రతి హామీ నిలబెట్టుకున్న ఘనత కాంగ్రెస్ పార్టీదేనన్నారు. తెలంగాణలో కూడా నాలుగువేల రూపాయల వృద్ధాప్య పింఛన్ల తో పాటు అయిదువందల కే గ్యాస్ సిలిండర్, మహిళలందరికి ఉచిత బస్సు ప్రయాణం, విద్యార్థినులకు ఎలక్ట్రిక్ స్కూటర్లు, ఇందిరమ్మ ఇల్లు కట్టుకోవడానికి అయిదు లక్షల రూపాయలు, మొదటి సంవత్సరంలోనే రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ఇలా ఇచ్చిన ప్రతి హామీనీ నెరవేర్చుతామని నరేందర్ రెడ్డి అన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు ఎండి.తాజ్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, సయ్యద్ అఖిల్, కుర్ర పోచయ్య, సయ్యద్ ఖమ్రొరొద్దీన్, దన్న సింగ్, ముక్క భాస్కర్, మెతుకు కాంతయ్య, షబానా మహమ్మద్, ఊరడి లత, పోరండ్ల రమేష్, ఎండి.చాంద్, షేక్ శేహెన్షా, బాలబద్రి శంకర్, జీడి రమేష్, మామిడి సత్యనారాయణ రెడ్డి, రాజ్ కుమార్, మహమ్మద్ బారి, కమల్ తదితరులు పాల్గొన్నారు.

# తుక్కాపూర్‌లో స్మశానవాటిక, డంపుయార్డు కూల్చివేత





- రాత్రికి రాత్రే అధికారులే దగ్గరుండి కూల్చివేయించారన్న గ్రామస్తులు
- నోటీసులు ఇవ్వకుండా ఎలా కూలుస్తారన్న సర్పంచ్ చిక్కుడు చంద్రం
- రూ.11.60 లక్షల ప్రజాధనం వృధా
- ఇరిగేషన్ శాఖ భూమిలో సబ్‌స్టేషన్ నిర్మాణం కోసమంటున్న అధికారులు
- ప్లాట్లు, డబుల్‌బెడ్‌రూమ్‌లు ఇచ్చే వరకు ధర్నా చేస్తామంటున్న గ్రామస్తులు

తొగుట, జూలై 4, మనం న్యూస్: తొగుట మండలంలోని తుక్కాపూర్ గ్రామంలో సోమవారం రాత్రి ప్రభుత్వ నిధులతో నిర్మించిన స్మశాన వాటిక, డంపింగ్ యార్డును ప్రభుత్వ అధికారులు దగ్గరుండి కూల్చివేశారని కోపోద్రిక్తులైన గ్రామస్తులు సర్పంచ్ చిక్కుడు చంద్రం ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం మల్లన్న సాగర్ ప్రాజెక్టు వద్ద జరుగుతున్న పనులను అడ్డుకొని అక్కడే వంటావార్పు నిర్వహించి నిరసన తెలిపారు. తుక్కాపూర్ గ్రామంలో ప్రభుత్వ అధికారులు ఈఈ సాయిబాబా, డిఈ రమేష్, కె.ఎన్.ఆర్. కన్‌స్ట్రక్షన్ ఇంచార్జ్ ఆనంద్‌లు గ్రామ పంచాయతీ పాలక వర్గానికి కనీస సమాచారం ఇవ్వకుండా దౌర్జన్యంగా పబ్లిక్ ప్రాపర్టీ కూలగొట్టడానికి అధికారులు పూనుకున్నారని దుయ్యబట్టారు. ఇప్పటికే మల్లన్న సాగర్ ప్రాజెక్టులో 80 శాతం భూములు కోల్పోయి, దిక్కుతోచని స్థితిలో ఉన్న గ్రామస్తులకు గ్రామంలో చనిపోతే దహన సంస్కారాలు ఎలా చేయాలి, తడి పొడి చెత్త ఎక్కడ వేయాలంటూ వాపోయారు.

### తుక్కాపూర్ గ్రామానికి మొదటి నుండి అన్యాయమే

మల్లన్న సాగర్ ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభం అయ్యే ముందు జరిగిన భూ సేకరణలో మండలంలోని అన్ని గ్రామాల్లో ఎకరాకు రూ.6 లక్షల పరిహారం అందిస్తే తమ గ్రామానికి మాత్రం రూ. 5.50 లక్షలు మాత్రమే ఇచ్చారని, ప్రాజెక్టులోకి అదనంగా ఒక టిఎంసి నీటిని తరలించడానికి అదనపు టిఎంసి కాలువ పనులు జరగడానికి తీసుకున్న భములకు సైతం ఇంకా పూర్తి పరిహారం అందించలేదని ఆరోపించారు. గ్రామంలో ఉపాధి అవకాశాలు లేవని, భూములు కోల్పోయిన తమకు పని దొరకడం లేదని తుక్కాపూర్ గ్రామస్తుల ఇబ్బందులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

### హామీలు నెరవేర్చే వరకు పనులు అడ్డుకుంటాం

అదనపు టిఎంసి కాలువ నిర్మాణం కోసం గ్రామంలో భూ సేకరణను చేసే సమయంలో తమకు మెరుగైన పరిహారం ఇవ్వకుండా భూ సేకరణ జరుగనివ్వమని గ్రామస్తులు అడ్డుపడితే అప్పటి కలెక్టర్ వెంకట్రామిరెడ్డి ములుగు గెస్ట్ హౌజ్‌కు నిర్వాసితులను పలుమార్లు పిలిపించుకొని ఎమ్మెల్యే రఘునందన్‌రావు సమక్షంలో గ్రామస్తులకు 250 గజాల స్థలాన్ని ఇవ్వడంతోపాటు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కట్టిస్తామని హామీ ఇచ్చి తమను ఒప్పించారని, అధికారులు హామీ ఇచ్చి రెండేళ్లు అవుతున్నా ఇప్పటి వరకు పూర్తి పరిహారం రాలేదని, ప్లాట్లు, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు సైతం ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. ప్రాజెక్టు నిర్మాణం జరగాలని మొట్టమొదట సంతకాలు చేసి ప్రభుత్వానికి గ్రామస్తులు సహకరిస్తే గ్రామస్తులకు ఇబ్బందులు సృష్టించడం ఎంత వరకు సమంజసం అన్నారు. తమ గ్రామానికి న్యాయం జరిగే వరకు ప్రాజెక్టు పనులు అడ్డుకొని ఇక్కడే వంటావార్పు కొసాగిస్తామని హెచ్చరించారు. అదేవిధంగా నేడు డంప్‌యార్డు కూల్చి వేయడంతో స్థానిక మేఘా కంపెనీ కార్యాలయం ఎదుట గ్రామస్తులు చెత్తను పారబోసి తమ నిరసన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి తమ గ్రామానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.



### ఇరిగేషన్ శాఖ స్థలంలో కట్టడం వల్లే : ఎంఆర్ఓ జహీర్

మల్లన్న సాగర్ ప్రాజెక్టు నిర్మాణం సమయంలో రైతుల వద్ద నుండి భూ సేకరణ చేయగా ఆ స్థలంలో సబ్ స్టేషన్ కట్టడం జరిగిందని, మిగిలిన స్థలంలో కూడా మరో సబ్ స్టేషన్ కట్టాల్సి ఉండగా అందులో గ్రామ సర్పంచ్ డంప్‌యార్డు, స్మశాన వాటిక నిర్మిస్తామని తెలుపగా అప్పుడే వద్దని చెప్పడం జరిగిందని, ఆ భూమి ఇరిగేషన్ శాఖ ఆధీనంలో ఉండడంతో మరో సబ్ స్టేషన్ నిర్మాణం కోసం ఆ స్థలాన్ని ఆధీనంలోకి తీసుకోవడం జరిగింది.

### పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన పాలకవర్గం, గ్రామస్తులు

గ్రామానికి చెందిన స్మశానవాటిక, డంప్‌యార్డును కూల్చివేసిన సంఘటనలో ఇరిగేషన్ ఈఈ సాయిబాబా, డిఈ రమేష్, కేఎన్ఆర్ కన్‌స్ట్రక్షన్ ఇంచార్జ్ ఆనంద్‌లపై గ్రామ సర్పంచ్, పాలకవర్గం, గ్రామస్తులు కలిసి తొగుట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గ్రామ పంచాయతీ పాలకవర్గానికి కనీస సమాచారం లేకుండా ప్రభుత్వ నిధులతో నిర్మించిన డంప్ యార్డు, స్మశాన వాటికలను ఏ విధంగా కూల్చుతారని, సంఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామస్తులు, గ్రామపంచాయతీ పాలకవర్గం ఇచ్చిన ఫిర్యాదు పోలీసులు స్వీకరించి కేసు నమోదు చేశారు.

### డంప్‌యార్డు, స్మశాన వాటిక కూల్చివేయడం అన్యాయం: చిక్కుడు చంద్రం (సర్పంచ్)



గ్రామస్తులకు ఉపయోగపడే విధంగా రూ.11.60 లక్షలతో నిర్మించిన డంప్‌యార్డు, స్మశాన వాటికలను అధికారులు, కాంట్రాక్టర్ అర్ధరాత్రి కూల్చి వేయడం దారుణమని, కనీసం సర్పంచ్‌గా తనకు కానీ, పాలకవర్గానికి కానీ సమాచారం ఇవ్వకుండా ప్రభుత్వ నిధులతో నిర్మించిన వాటిని కూల్చివేయడం ఎంత వరకు సమంజసం అని, గ్రామ ప్రజలకు ఇబ్బందులు లేకుండా కూల్చివేసిన డంప్‌యార్డు, స్మశాన వాటికలను పునర్నిర్మించాలని, గ్రామస్తులకు ప్లాట్లు, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు తక్షణమే ఇవ్వాలని, లేనిపక్షంలో గ్రామస్తులతో కలిసి పెద్ద ఎత్తున నిరసన తెలిపి ప్రాజెక్టు పనులు అడ్డుకుంటామని హెచ్చరించారు.

# సోనియాగాంధీ రుణం తీర్చుకుందాం

- మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం
- ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ
- హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి



కోహెడ, జూలై 04, మనం న్యూస్: తెలంగాణ ప్రధాత సోనియా గాంధీ రుణం తీర్చుకునే సమయం వచ్చిందని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి అన్నారు. పల్లె పల్లెకు ప్రవీణ్ అన్న...గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని వరికోలు గ్రామంలో ఆయన మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులతో కలిసి గడప గడపకు తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే అమలు చేసే సంక్షేమ పథకాలను ఆయన ప్రజలకు వివరించారు. ఆనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే నిరుపేద ప్రజలకు ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షలు అందజేస్తామన్నారు. అంతే కాకుండా కర్ణాటక రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ అమలు చేస్తున్న ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని తెలంగాణ రాష్ట్రంలో కూడా అమలు చేస్తామన్నారు. గ్యాస్ సిలిండర్‌ను కేవలం రూ.500 కే అందజేస్తామన్నారు. రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం ద్వారా రూ.5 లక్షల వరకు అందిస్తామని, ఇంట్లో ఇద్దరు వృద్ధులుంటే కనీస పింఛన్ రూ.5000 ఇస్తామన్నారు. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాది రెండు లక్షల ఉద్యోగాల భర్తీ చేస్తామన్నారు. అన్ని పంటలకు గిట్టుబాటు ధరను రైతులకు కల్పిస్తామని ఆయన తెలిపారు. ధరణి పోర్టల్‌ను రద్దు చేసి భూమి ఉన్న రైతులతో పాటు కౌలు రైతులకు ఎకరానికి రూ.15 వేల సహాయం, భూమి లేని ఉపాధి హామీ రైతుల కూలీలకు రూ.12 వేలు సహాయం అందజేస్తామని ఆయన ప్రకటించారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. హుస్నాబాద్‌లో ఎగిరేది కాంగ్రెస్ జెండానే అని ఆయన ఆశాభావం వ్యక్తం చేసారు. ప్రతి ఊరికి వెళినప్పుడు ప్రజల సమస్యలను వింటుంటే అధికార పార్టీ పై వ్యతిరేకత ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరిస్తారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మంద ధర్మయ్య, వరికోలు ఎంపీటీసీ బోయిని నిర్మల-జయరాజు, గ్రామశాఖ అధ్యక్షుడు శనిగరం తిరుపతి, కిసాన్ సెల్ అధ్యక్షుడు భీంరెడ్డి తిరుపతి రెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు చింతకింది శంకర్, మండల ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు గూడ స్వామి, జిల్లా యువజన కాంగ్రెస్ కార్యదర్శి శివారెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దూలం శ్రీనివాస్‌గౌడ్, సోషల్ మీడియా కన్వీనర్ మహమ్మద్ రఫీక్, మాజీ ఎంపీటీసీ వసంత, మాజీ సర్పంచ్‌లు శెట్టి సుధాకర్, గౌరిట్యాల లక్ష్మణ్, బండిపల్లి నారాయణగౌడ్, చింతలపల్లి ప్రతాప్‌రెడ్డి, గడ్డం దుర్గారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి వేల్పుల వెంకటస్వామి, ఆయా గ్రామాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులున్నారు.



## త్రిపుల్ ఐటికి అంక్షాపూర్ నుంచి ఆరుగురు విద్యార్థులు ఎంపిక



నంగునూరు, జూలై 04, మనం న్యూస్: నంగునూరు మండల పరిధిలోని అంక్షాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి ఆరుగురు విద్యార్థులు స్వర్ణలత, శృతి, నవ్య శ్రీ, వర్షిత, సౌమ్య, నందకిషోర్‌లు బాసర త్రిపుల్ ఐటికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు అహ్మద్ తెలిపారు. గత విద్యా సంవత్సరంలో ఉపాధ్యాయులు ప్రణాళికాబద్ధంగా బోధిస్తూ పోటీ పరీక్షలకు సన్నద్ధం చేస్తూ విద్యార్థులు ఉన్నత ఫలితాలు సాధించేలా ప్రయత్నం చేయడం జరిగిందన్నారు. ఈ ఫలితాల్లో మంత్రి హరీష్‌రావు ప్రోత్సాహం, సమీక్ష సమావేశం నిర్వహించడం, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను, విద్యార్థులను ఉత్తేజపరచడం జరగింద న్నారు. ట్రిపుల్ ఐటికి ఎంపికైన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించారు. నంగునూరు ఉన్నత పాఠశాల నుండి ట్రిపుల్ ఐటికి 13 మంది విద్యార్థులు ఎంపిక కాగా వారిని మంగళవారం భూ లక్ష్మి మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఎంఈఓ దేశిరెడ్డి చేతుల మీదుగా ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులను మరింత ప్రోత్సహించినట్లయితే భవిష్యత్తులో మరింత ఉత్సాహంతో అన్నింటా రాణిస్తారన్నారు. ఈ సందర్భంగా భూ లక్ష్మి మెమోరియల్ ట్రస్టు వ్యవస్థాపకులు శనిగరం కనకయ్యను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు దుబ్బుడు రవీంద్ర రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## రావూస్ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలి



సిద్దిపేట అర్బన్, జూలై 04, మనం న్యూస్: సిద్దిపేట పట్టణ కేంద్రంలో నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన రావూస్ స్కూల్‌పై విద్యాధికారులు చర్యలు తీసుకోవాలని పిడిఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి విద్యానాథ్ అన్నారు. మంగళ వారం పిడిఎస్‌యు ఆధ్వర్యంలో విద్యాశాఖ కార్యాలయంలో వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘం నాయకులు మాట్లాడుతూ విద్యాహక్కు చట్టానికి పూర్తి వ్యతిరేకంగా కమర్షియల్ బ్లాక్‌లో పాఠశాలను నడపడమే కాకుండా పార్కింగ్ స్థలం లేకుండా రద్దీ ప్రాంతంలో పాఠశాలను ఏర్పాటు చేశారని, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ నాయకులు ప్రణయ్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## ట్యాంక్‌బండ్‌పై దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని పెట్టాలి

- కురుమ యువ చైతన్య సమితి డిమాండ్



హుస్నాబాద్, జూలై 4, మనం న్యూస్ః హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్‌పై దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని బీఆర్ఎస్ సర్కార్ పెట్టాలని కురుమ యువత చైతన్య సమితి సభ్యులు డిమాండ్ చేసారు. పట్టణ కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో దొడ్డి కొమురయ్య 77 వ వర్ధంతి వేడుకలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కురుమ యువ చైతన్య సమితి సంఘం నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి ఆద్యుడు, తొలి అమరుడు దొడ్డి కొమురయ్య అని వారు కొనియడారు. తెలంగాణ సాయుధ పోరాటం చరిత్ర అని తలుచుకోగానే మొదటగా గుర్తు వచ్చే వ్యక్తి దొడ్డి కొమురయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో సూరు ఐలయ్య, వీర్ల లింగయ్య, మ్యాకల ఓదయ్య, కోట అశోక్, చెంచు సంపత్, మ్యాకల రమేశ్, చెంచు యాదగిరి, తదితరులున్నారు.

# కాం(గ్రెస్‌ది జన గర్జన సభ కాదు

- నాయకుల గందరగోళ సభ
- స్టేషన్ ఘన్పూర్ లో బిజెపి జండా ఎగరవేస్తాం
- ప్రజల ఆశీర్వాదం నాకే ఉంది
- బిజెపి రాష్ట్ర నాయకులు బొజ్జపల్లి సుభాష్



స్టేషన్ ఘన్పూర్, జులై 4, మనం న్యూస్ : ఖమ్మం జిల్లాలో జరిగిన కాంగ్రెస్ జన గర్జన సభకు బిజెపి రాష్ట్ర నాయకులు బొజ్జపల్లి శుభాష్ స్పందించారు ఈ సందర్భంగా ఆయన పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో జరిగిన జన గర్జన సభ కాదని నాయకుల గందరగోళ సభ అని ఆయన అన్నారు. ఈ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గందరగోళంలో పడ్డారని ఎవరికి వారే యమునా తీరే అన్నట్టు ఒక్కొక్క జిల్లాలో ఒక్కొక్క నాయకుడు తమ నాయకుల పైనే విమర్శలు చేసుకుంటూ కాంగ్రెస్ పార్టీ దిగజారుడుతనానికి నిదర్శనంగా ఉన్నారని వారు అన్నారు కేవలం ఇతర పార్టీల నుండి నాయకులను లాక్కునే ప్రయత్నం చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీలో ఉన్న నాయకులు ఇతర పార్టీలకు వెళ్లే ప్రయత్నాలు చేస్తున్నారని ఇక రాష్ట్రాన్ని ఏమి ఏలుతారని రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్ రెడ్డి పైనే స్వయంగా రాష్ట్ర నేతలు ప్రతి చోట అవమానం చేస్తున్నారని ఆయన అన్నారు. స్టేషన్ ఘన్పూర్ నియోజకవర్గ నాయకుల కూడా ఇదే పరిస్థితి ఉన్నదని ముగ్గురు నలుగురు నాయకులు నేనంటే నేను అంటూ గ్రామాలలో తిరుగుతూ ఎన్నికల అప్పుడే నియోజకవర్గానికి వచ్చి తరువాత ముఖం చాటేస్తున్నారని ఇలాంటివారు నియోగ వర్గానికి ఏమి చేస్తారంటూ ఆయన ప్రశ్నించారు. ఇక బిఆర్ఎస్ పార్టీలో ముసలం ఈ నియోకార్గ ప్రజలందరికి తెలుసునని రాజయ్య, కడియం శ్రీహరి ల మధ్య జరుగుతున్న పోరులో ఇక్కడి కార్యకర్తలు ప్రజలు నలిగిపోతున్నారని ఇద్దరు ఉప ముఖ్యమంత్రిగా పనిచేశారు కానీ నియోజకవర్గానికి వరగబెట్టింది ఏంటని అనే ప్రశ్నించారు. డిగ్రీ కళాశాల లేదు, పోస్టుమార్టం లేదు, ఫైర్ స్టేషన్ లేదు, జాతీయ రహదారి పనులు ఎక్కడపడితే అక్కడ నిలిచిపోయాయి ఇలా చెప్పుకుంటూ పోతే ఏమి అభివద్ధి చేశామని మళ్ళీ నేనంటే నేనంటూ వస్తున్నారంటూ ఆయన తీవ్రంగా విమర్శలు చేశారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలకు, బిజెపి యే సరియైన పోటీ అని అధిష్టానం తప్పకుండా నాకు అవకాశం కల్పిస్తున్నదని నేను ఈ నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివద్ధి చేస్తానని ఏడు మండలాలకు చెందిన వారితో ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి నియోజకవర్గ అభివద్ధి అభివద్ధి చేస్తానని పర్యాటక కేంద్రంగా అవకాశాలు ఉన్నాయని చిలుకూరు గుట్ట, మల్లన్న గండి, ఘన్పూర్ పెద్ద చెరువు ఇలా అనేక విధాలుగా మనకు అవకాశాలు ఉన్నాయని వారన్నారు. స్టేషన్ ఘన్పూర్ నియోజకవర్గంలో శాసనసభ్యునిగా మా నాన్న సేవలు అందించారని గ్రామాలలో పరిచయాలు బాగా ఉన్నాయని నన్ను ఆదరిస్తున్నారని ఆయన అన్నారు.

బిఆర్ఎస్, కాంగ్రెస్ ఇతర పార్టీలకు చెందిన నాయకులు కూడా నాకు అవకాశం వస్తే తప్పకుండా సహకారం అందించేందుకు ముందుకు వస్తున్నారని ఆయన అన్నారు. ఏది ఏమైనా భారతీయ జనతా పార్టీ నుండి తప్పకుండా రాష్ట్ర పార్టీ నాయకత్వం నాకు అవకాశం కల్పిస్తారని ఈ నియోజకవర్గంలో గులాబీ జెండా ఎగురుతుందని తప్పకుండా కమలం పువ్వు వికసిస్తుందని బొజ్జపల్లి సుభాష్ తెలిపారు.

## బుగులు వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



చిల్పూర్, జులై 4, మనం న్యూస్: రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు జన్మదినాన్ని పురస్కరించుకొని చిల్పూర్ శ్రీ బుగులు వెంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివద్ధి కమిటీ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు ఆధ్వర్యంలో స్వామివారిని దర్శించుకొని రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు 67 వ జన్మదినాన్ని పురస్కరించుకొని మంత్రి గోత్రనామాలతో ఆలయ ప్రధానార్చకులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారిణి లక్ష్మీ ప్రసన్న, గన్ పూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్యాంసుందర్ రెడ్డి, ఆలయ అభివద్ధి కమిటీ సభ్యులు ఎడవల్లి దయాకర్, వేల్పుల గట్టయ్య, పల్లగుట్ట ఉపసర్పంచ్ బత్తిని శీను, ప్రధానార్చకులు రవీందర్ శర్మ, అర్చకులు సౌమ్యశ్రీ రంగాచార్యులు, కష్ణమాచార్యులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పిడుగుపాటుతో దుక్కిటెద్దు మృతి

- రైతు అస్వస్థత మల్లంపల్లి ఆసుపత్రికి తరలించిన గ్రామస్తులు



నల్లబెల్లి, జూలై 4, మనం న్యూస్ : పిడుగుపాటుతో మతి చెందిన సంఘటన మండలంలోని నందిగామ గ్రామంలో మంగళవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన దూకెర మల్లయ్య అనే రైతు తన వ్యవసాయ పనుల కోసం పొలం వద్దకు ఎడ్ల బండిపై వెళ్లి తిరిగి వస్తుండగా నందిగామ గ్రామ సమీపంకు చేరుకునే సమయంలో భారీ వర్షంతో కూడిన గాలి వీచడంతోపాటు పిడుగుపాటు పడడంతో ఒక దుక్కిటేద్దు మతి చెందగా మరో దుక్కిటద్దు భయంతో పరుగులు తీసింది. ఈ నేపథ్యంలో రైతు మల్లయ్య పిడుగుపాటుకు అస్వస్థకు గురికాగా స్థానికులు ములుగు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. పిడుగుపాటుకు మతి చెందిన దుక్కిటేద్దు విలువ సుమారు 80,000 ఉంటుందని బాధిత కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

## విద్యార్థులకు ఉచితంగా లాంగ్ నోట్‌బుక్స్ అందజేసిన అనితా రెడ్డి




వరంగల్ టౌన్, జులై 4, మనం న్యూస్ : జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్, అనురాగ్ హెల్పింగ్ సొసైటీ ఆధ్వర్యంలో డాక్టర్ అనితా రెడ్డి అధ్యక్షతన వరంగల్‌లోని పడిశాల వీరభద్రయ్య ఆంధ్ర బాలికల ప్రభుత్వ పాఠశాల పిల్లలకు చదువుకు చేయుత లో భాగంగా ఉచితంగా లాంగ్ నోట్ బుక్స్ అందజేయడం జరిగింది అనంతరం హైస్కూల్ విద్యార్థులకు, స్టాఫ్‌కి, సిబ్బందికి వినియోగదారుల రక్షణ, హక్కుల చట్టం 2019, జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ వినియోగదారు లకు ఎలా ఉపయోగపడుతుంది అన్న అంశాలపై అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులు నేషనల్ కన్జుమర్ రైట్స్ కమిషన్ తెలంగాణ రాష్ట్ర వైస్ చైర్మన్ డాక్టర్ అనితా రెడ్డి చట్టాల పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉన్నప్పుడే వాటిని వినియోగించుకోగలుగుతారని అన్నారు. పిల్లలకు చిన్నతనం నుండే వినియోగదారుల మెలకువలు నేర్చుకోవాలని, పిల్లలకు చదువుతో పాటు మంచి నడవడికని, క్రమశిక్షణ నేర్పించాలని టీచర్స్‌కి తెలిపారు. పేదరికము విద్యకు ఆటంకము కారాదని పిల్లలకు పుస్తకాలు అందించామని, పిల్లలు చదువుని ఇష్టంగా చదుకోవాలని అప్పుడే భవిష్యత్తులో అభివద్ధి చెందుతారని డాక్టర్ అనితా రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్సీఆర్సి స్టేట్ వైస్ చైర్మన్ డాక్టర్ అనితా రెడ్డి, జిల్లా చైర్మన్ దేవా సాంబమూర్తి, జనరల్ సెక్రటరీ కరుకాల రామ్‌రెడ్డి, హెచ్ఎమ్, వాణి ప్రియదర్శిని, శారద, మెంబర్స్ ప్రభాకర్, ధనుంజయ్, జగదీశ్వర్, వీరన్న, సురేందర్, సంతోష్, శైలజ తదితరులు పాల్గొన్నారు.

## 100 స్టీల్ వాటర్ బాటిళ్ళు పంపిణీ చేసిన రాజనాల శ్రీహరి



వరంగల్ టౌన్, జులై 4, మనం న్యూస్ : వరంగల్ తూర్పు నియోజకవర్గం లోని చౌరస్తా సెంటర్ నందు పంచాయతీరాజ్, గ్రామీణాభివద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు 67 వ జన్మదినం సందర్భంగా బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రాజనాల శ్రీహరి కేక్ కట్ చేసి అనంతరం పేద ప్రజలకు 100 వాటర్ స్టీల్ బాటిల్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రిజ్వాన షమీమ్ మసూద్ అలి, గంగాసానీ కష్ణారెడ్డి, ఎండి తాహిర్, పోలేపాక ప్రసాద్, మట్టెవాడ కుమార్ తోపాటు బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## దొడ్డి కొమురయ్యకు ఘన నివాళులు



కాజీపేట, జులై 4, మనం న్యూస్ : హనుమకొండ జిల్లా కాజీపేట మండలంలోని మడికొండ హైదరాబాద్ హైవే రోడ్ పైన మంగళవారం అమరజీవి దొడ్డి కొమురయ్య 77 వర్ధంతి సందర్భంగా హనుమకొండ జిల్లా సిపిఐ కార్యదర్శి కర్ర బిక్షపతి కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించినారు. ఈ సందర్భంగా బిక్షపతి మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో తొలి అమరుడు దొడ్డి కొమురయ్య అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, కాజీపేట మండల కార్యదర్శి మునిగాల బిక్షపతి, మాలోత్ శంకర్, మునిగాల స్వామి, మంద సుమన్, అరూరి రాజు, రసమల్ల కుమార్, పద్మ, సుమలత, భాగ్య, రమ పాల్గొన్నారు.

## ఎంపికైన అభ్యర్థులకు అన్యాయం చేయకండి

- సిపిఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి మారేపల్లి మల్లేష్



టేకుమట్ల, జూలై 4, మనం న్యూస్ : కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఉద్యోగులకు అన్యాయం చేస్తే ఎట్టి పరిస్థితుల్లో సహించ బోమని సిపిఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి మారేపల్లి మల్లేష్ అన్నారు. మంగళవారం నాడు మల్లేష్ విలేకరులతో మాట్లాడుతూ గత ఆరు నెలల క్రితం కేజీబీవీ (కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల లో)అసిస్టెంట్ కుక్, స్వీపర్, స్కావెంజర్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసి ధరఖాస్తు చేసుకున్న వారందరికీ 3 సార్లు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండల పరిషత్ అభివద్ధి అధికారి, తహసిల్దార్, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం స్పెషల్ ఆఫీసర్ ఈ కమిటీ ద్వారా పారదర్శకంగా ఇంటర్వ్యూలు నిర్వహించి జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేశారు. జూన్ 2 న జిల్లా నుంచి ఎంపిక చేసిన లిస్టు వచ్చినదని అభ్యర్థులను కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ పిలిచి వారం రోజులుగా పనిచేయించుకున్నాక కొందరు అధికార పార్టీ రాజకీయ నాయకుల జోక్యంతో పని బందు చేశారు. ఇట్టి విషయంపై జిల్లా కలెక్టర్ దష్టికి తీసుకెళ్లామని ఎలాంటి స్పందన లేదు ఒకసారి నోటిఫికేషన్ జారీ చేసి నియమించాక వారిని కాదని రాజకీ య నాయకులు చెప్పిన పేర్లు ఎలా మళ్లీ ఎంపిక చేస్తారు. వారు ఏమైనా వారి ఇంటి పని మనుషుల అని, ప్రజలకు సేవ చేయాల్సిన నాయకులు ప్రజలకు ఇబ్బందులకు గురి చేస్తున్నారని పారదర్శకంగా ఎంపిక చేసిన మొదటి లిస్టులో ఉన్న వారినే విధులకు తీసుకోవాలని లేని పక్షంలో సిపిఐ ఎంఎల్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని, మారేపల్లి మల్లేష్ డిమాండ్ చేశారు.

## వర్కింగ్ జర్నలిస్టుల నివేషణ స్థలాల కోసం దరఖాస్తు చేసుకోవాలి

- గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ సిక్స్‌మెన్ కమిటీ






వరంగల్, జులై 4, మనం న్యూస్ : వరంగల్ నగర పరిధిలోని అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులకు ప్రభుత్వం నుండి అందించాల్సిన నివేషణ స్థలాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు సిక్స్ మెన్ కమిటీ తెలిపింది. నివేశన స్థలాల కోసం ఏర్పడిన సిక్స్ మెన్ కమిటీ మంగళ వారం సమావేశమైంది. కన్వీనర్ బిఆర్ లెనిన్, కో-కన్వీనర్లు బొక్క దయాసాగర్, వేముల నాగరాజు, సభ్యులు గడ్డం రాజిరెడ్డి, మస్కపురి సుధాకర్, బొల్లారపు సదయ్యలు పాల్గొన్న సమావేశంలో ఈ క్రింది నిర్ణయాలు తీసుకున్నారు. కాకతీయ, ఏకశిల జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీలలో సభ్యులుగా లేని జర్నలిస్టుల నుండి దరఖాస్తులను ఆహ్వానిం చాలని నిర్ణయించింది. ఈనెల (బుధవారం, గురువారం) 5,6 తేదీలలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసే ప్రత్యేక కౌంటర్లలో స్వీకరిం చబడతాయని వెల్లడించారు. ఇందుకుగాను సిక్స్ మెన్ కమిటీ నిబంధనలను రూపొందించింది. ఐదు సంవత్సరాలకు పైగా అనుభవం ఉన్నవారి నుండి దరఖాస్తు స్వీకరించాలని నిర్ణయించింది. దరఖాస్తు ఫారంతో పూర్తి సమాచారం అందించాలని వర్కింగ్ జర్నలిస్టులకు పిలుపునిచ్చింది. అనుభవాన్ని ధ్రువపరిచే జిరాక్స్ ప్రతులను దరఖాస్తులకు జత చేయవలెనని కమిటీ స్పష్టం చేసింది. అనుభవాన్ని ధవపరేచేందుకు పనిచేస్తున్న సంస్థల ఇంచార్జులతో దరఖాస్తులపై తప్పనిసరి అటెస్టేషన్ చేయించుకొని సమర్పించాలని పేర్కొన్నారు. అందుబాటులో ఉండే స్థలాన్ని బట్టి సీనియార్టీ ప్రకారం అందరికీ నివేశన స్థలాలు అందించబడతాయని పేర్కొన్న సిక్స్ మెన్ కమిటీ, దరఖాస్తులపై తుది నిర్ణయం తీసుకునేందుకు కమిటీ సభ్యులకు పూర్తి స్వేచ్ఛ ఉంటుందని స్పష్టం చేసింది. వర్కింగ్ జర్నలిస్టులకు ఏమైనా అనుమానాలుంటే వాటిని నివత్తి చేసుకోవటం కోసం కమిటీ సభ్యులను సంప్రదించవచ్చునని తెలిపారు. జర్నలిస్టులు తొందరపడి సిక్స్ మెన్ కమిటీని నిందించే చర్యలను ఉపేక్షించబోమని, అలాంటి వారి దరఖాస్తులను తిరస్కరించేందుకు వెనకాడబోమని కమిటీ స్పష్టం చేసింది. పూర్తి పారదర్శకతతో కమిటీ చేస్తున్న కషిని ప్రతీ ఒక్కరు అర్థం చేసుకుని ఈ బహత్తర కార్యానికి సహకరించాలని కమిటీ విజ్ఞప్తి చేసింది.

## విశ్వవిద్యాలయ పరిపాలనను బలోపేతం చేద్దాం



కేయు, జులై 4, మనం న్యూస్ : విశ్వవిద్యాలయ పరిపాలన ను బలోపేతం చేద్దాం అని కాకతీయ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య తాటికొండ రమేష్ అన్నారు, విశ్వవిద్యాలయ కమిటీ హాల్ లో అధికారులకు నూతన పరిపాలన పదవులు ఉత్తర్వులు అందచేస్తూ మాట్లాడారు. నూతనంగా సోషల్ సైన్సు విభాగాల డీన్‌గా ఆచార్య టి మనోహర్, అబివద్ధి అధికారిగా రసాయన శాస్త్ర విభాగ ఆచార్యులు ఆచార్య ఎన్ వాసుదేవ రెడ్డి, హాస్టల్ డైరెక్టర్ గా జంతు శాస్త్ర విభాగ ఆచార్యులు ఆచార్య వై వెంకయ్య, అదనపు పరీక్షల నియంత్రణ అధికారిగా గణిత శాస్త్ర విభాగ సహా ఆచార్యులు డాక్టర్ తిరుమల దేవి, ఆంగ్ల విభాగ విభాగాదిపతిగా డాక్టర్ బి దీపా జ్యోతి, విశ్వవిద్యాలయ కాంపస్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్, మహబూబాబాద్, భుపాలపల్లి పిజి కళాశాలల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ గా కంప్యూటర్ సైన్సు విభాగ సహా ఆచార్యులు డాక్టర్ బి మంజుల, ఎస్సీ, ఎస్టీ సెల్, అంబేద్కర్ స్టడీస్, ఎస్సీ, ఎస్టీ రేమిడియాల్ కోచింగ్ సెల్ సంచాలకులు గా తెలుగు విభాగ ఒప్పంద అధ్యాపకుడు డాక్టర్ కే సదాశివ, బిసి సెల్, మహాత్మా జ్యోతి రావు ఫులే సెంటర్ ఫర్ రీసెర్చ్ అండ్ ఎంపవర్‌మెంట్ సెల్ సంచాలకులు గా పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగ ఒప్పంద అధ్యాపకులు డాక్టర్ ఆకుతోట శ్రీనివాసులు ను నియమించారు, ఆచార్య వి రామచంద్రం ను డీన్ సిడిసి గా, ఆచార్య ఆర్ మల్లికార్జున రెడ్డి నీ యుజిసి కోఆర్డినేటర్ గా, ఆచార్య మహమ్మద్ ముస్తఫా ను అదనపు పరీక్షల నియంత్రణ అధికారి గా, డాక్టర్ బి మేఘనరావు ను ఆంగ్ల విభాగ పాఠ్య ప్రణాళిక అధ్యక్షురాలు గా, డాక్టర్ జి పద్మజ ను భౌతిక శాస్త్ర విభాగ పాఠ్య ప్రణాళిక అధ్యక్షురాలు గా కొనసాగిస్తూ రిజిస్ట్రార్ ఆచార్య టి శ్రీనివాస రావు ఉత్తర్వులు జారీచేసారు.

## పేదలకు వరం సీఎం సహాయనిధి

- పెద్దపల్లి జిల్లా జడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్



మల్హార్, జూలై 4, మనం న్యూస్ : సీఎంఆర్ఎఫ్ నిరుపేదలకు వరం లాంటిదని బిఆర్ఎస్ పార్టీ మంథని నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే, పెద్దపల్లి జెడ్పి చైర్మన్ పుట్ట మధూకర్ అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హార్ మండలంలోని వల్లెంకుంట గ్రామానికి చెందిన గడ్డం వికాస్ రూ 24,000, రాజేశ్వరి రూ 14,000 మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర యువ నేత జక్కు రాకేష్ తో కలిసి జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ లబ్ధిదారులకు తన నివాసంలో అందజేశారు. ఈ సందర్భంగా పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర యువ నేత జక్కు రాకేష్ మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో ప్రజా సంక్షేమం కోసం అనేక అభివద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఎంతో మంది పేదలకు నాణ్యమైన వైద్యమందించి ఆదుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షులు కుంభం రాఘవ రెడ్డి, మండల కో ఆప్షన్ సభ్యులు ఎండి అయూబ్ ఖాన్, బిఆర్ఎస్ పార్టీ మండల లీడర్లు కోట రవి గౌడ్, వాల యాదగిరి రావు, భాద్రపు సమ్మయ్య, బిఆర్ఎస్ పార్టీ యూత్ మల్హార్ మండలాధ్యక్షుడు, మంథని నియోజకవర్గ యూత్ లీడర్ జాగరి హరీష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అజ్మీర సమ్మయ్య నాయక్, వల్లెంకుంట ఉప సర్పంచ్ వేముల శ్రీశైలం, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు బూడిద సదానందం, వల్లెంకుంట బిఆర్ఎస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు వేల్పుల లచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

## దొడ్డి కొమురయ్య వర్ధంతి



బచ్చన్నపేట, జులై 4, మనం న్యూస్ : బచ్చన్నపేట మండల కేంద్రంలో తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరవీరుడు దొడ్డి కొమురయ్య 77 వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జనగామ జిల్లారైతు బంధు సమితి అధ్యక్షులు ఇర్రి రమణారెడ్డి నాగిరెడ్డిపల్లి గ్రామంలోని దొడ్డి కొమురయ్య విగ్రహానికి పూలమాల ధరించి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో తొలి అమరుడు దొడ్డి కొమురయ్య అని అన్నారు. ఇప్పటి జనగామ జిల్లాలోని దేవరుప్పుల గ్రామంలో జన్మించిన కొమురయ్య భూమి కోసం భుక్తి కోసం, బానిస సంకెళ్ళ విముక్తి కోసం సిపిఎం పార్టిలో చేరి సంఘాలను ఏర్పాటు చేసి మొట్ట మొదటగా రజాకార్ల మీద విరుచుకుపడిన అలనాటి సింహ ం కొమురయ్య అని అన్నారు. విసునూరు దొరసాని రామచె ంద్రా రెడ్డి తల్లి జానకమ్మ ఆదేశాల మేరకు ఆదేశాల మేరకు 1946 జులై 4 న తన అనుచరులచే కాల్పులు జరిపించారన్నారు. ఈ కార్యక్రమంలో చెంద్రా రెడ్డి, వడ్డేపల్లి మాల్లారెడ్డి, భావానిశిధర్ రెడ్డి, జంగిటి సిద్దులు, షబ్బీర్ అహ్మద్, కర్ణాకర్, గోపి గ్రామస్తులు పాల్గొన్నారు. బచ్చన్నపేట మండల కేంద్రం లో వైస్ చైర్మన్ బేజాడి సిద్దులు అధ్యక్షులు, అధ్యక్షులు ఎంటే శ్రీని వాస్, కారికే కర్ణాకర్, ఒగ్గు ఐలయ్య, గుండా సిద్దులు, తుప్పత్తి బాల య్య, ఏనుగుల కుమార్ మల్గ రవి, బండారి రాజు, మల్గ కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి బహిరంగ సభను విజయవంతం చేయాలి

లింగాల ఘనపురం, జులై 4, మనం న్యూస్ : ఈ నెల 8 న హన్మకొండ జిల్లా పరిధిలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో జరిగే సభకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పాల్గొంటున్నారని ఆ బహిరంగ సభను విజయవంతం చేయాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాదాసు వెంకన్న పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో మండల పార్టీ అధ్యక్షులు గొరిగె సంపత్ అధ్యక్షతన జరిగిన మండల స్థాయి సన్నాహక సమావేశముకు ముఖ్య అతిథిగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాదాసు వెంకటేష్ పాల్గొని మాట్లాడుతూ కార్యకర్తలకు పలు సలహాలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి ఏదునూరి నాగరాజు, మండల ఉపాధ్యక్షులు నల్ల బాబు, ఓబిసి మోర్చ మండల అధ్యక్షులు చౌదరపల్లి సతీష్, బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి కాల్నే గణేష్, బూత్ అధ్యక్షులు కల్లెపు నాగరాజు, కెమిడి పర్శురాములు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా దొడ్డి కొమరయ్య వర్ధంతి వేడుకలు







- నివాళులర్పించిన జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి
- బీసీ కమిషన్ సభ్యులు శుభప్రద పటేల్ తదితరులు

వికారాబాద్, జూలై, 4 మనం ప్రతినిధి: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య అని వికారాబాద్ జిల్లా కలెక్టరు సి. నారాయణ రెడ్డి అన్నారు. మంగళవారం తెలంగాణ అమరవీరుడు దొడ్డి కొమురయ్య 77వ వర్ధంతి వేడుకలు జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. జిల్లా కలెక్టరు దొడ్డి కొమురయ్య చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం సాధించుకున్న తరువాత మహనీయులను గౌరవించుకుంటున్నామని, అందులో భాగంగా దొడ్డి కొమురయ్య వర్ధంతిని అధికారికంగా జరుపుకుంటున్నామని అన్నారు. అమరుల ఆశయ సాధనకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి కలిసికట్టుగా పనిచేసి తెలంగాణ రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా మార్చుకుందామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి పాటుపడుతుందన్నారు. విద్య, ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోని ఆశయ సాధన దిశగా ముందుకు సాగాలని అన్నారు. రాష్ట్ర బిసి కమిషన్ సభ్యులు శుభప్రద్ పటేల్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం సాధించుకున్న తర్వాత మహనీయులను స్మరించుకోవడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా దొడ్డి కొమరయ్య వర్ధంతిని అధికారికంగా జరుపుకుంటున్నామన్నారు. దొడ్డి కొమరయ్యతో పాటు తెలంగాణ సాయుధ పోరాటంలో అమరులైన చాకలి ఐలమ్మ, కొమరం భీమ్ జయంతి ఉత్సవాలను జరుపుకోవడం జరుగుతుందని, వీరి స్ఫూర్తికి గాను విగ్రహాలను కూడా ఏర్పాటు చేసుకోవడం జరుగుతుందన్నారు. ఒక కులానికి కాకుండా సమాజం కోసం పోరాడిన వారి చరిత్రను స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గొల్ల కురుమల అభివృద్ధి కోసం పెద్ద ఎత్తున 11 వేల కోట్లు కేటాయించి గొర్రెల పంపిణీ కార్యక్రమం చేపట్టడం జరుగుతుందన్నారు. వెనుకబడిన తరగతుల వారికి 300 పైచిలుకు గురుకులాలను ఏర్పాటు చేసి మంచి విద్యను అందించడం జరుగుతుందని, బీసీ కుల వృత్తుల వారికి ప్రోత్సహించేందుకు ఆర్థిక సాయం అందించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్విని యోగం చేసుకొని అభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సి పల్ చైర్ పర్సన్ మంజుల రమేష్, జిల్లా ఆదనపు కలెక్టర్ (రెవిన్యూ) లింగ్యా నాయక్, షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి మల్లేశం, సహాయ బిసి సంక్షేమ శాఖ అధికారి భీమరాజు, బీసీ కుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మొబైల్ అందించిన ఎస్ఐ వేణుగోపాల్ గౌడ్

- ఫిర్యాదుదారునికి మొబైల్ అందించిన ఎస్ఐ వేణుగోపాల్ గౌడ్



బషీరాబాద్, జూలై 4, మన న్యూస్: బషీరాబాద్ మండలంలో ఈనెల 15వ తారీఖున మంతన్ గౌడ్ తాండ పెండ్లిలో పోగొట్టుకు పోయిన సోమల భీమ్లా నాయక్ తండ్రి భోజనాయక్ అను వ్యక్తి తన యొక్క ఒప్పో సెల్ఫోన్ పోగొట్టుకున్నాడు అట్టి విషయంలో సోమల భీమ్లా నాయక్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా అట్టి విషయంపై బషీరాబాద్ పోలీస్ సిబ్బంది మొబైల్‌ను ట్రేస్ చేసి ఫిర్యాదుదారుడైన సోమ్లా భీమ్లా నాయక్ అప్పగించడం అయినది అని ఎస్సై వేణుగోపాల్ గౌడ్ తెలిపారు పోగొట్టుకున్న మొబైల్ తిరిగి తీసుకున్న వ్యక్తి ఎస్సై వేణుగోపాల్ గౌడ్ పోలీస్ సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## బషీరాబాద్ మండల్ డిప్యూటీ తహసీల్దార్‌గా టి.వెంకటయ్య



బషీరాబాద్, జులై 4, మనం న్యూస్: బషీరాబాద్ మండల్ డిప్యూటీ తహసీల్దారుగా టి వెంకటయ్య పదవి బాధ్యతలు స్వీకరించడమైనది ఇక్కడ పనిచేసిన ఉప తహశీల్దార్ వీరేష్ బాబు వికారాబాద్ తహశీల్దార్ ఆఫీస్‌కు బదిలీ అయ్యారు ఈ సందర్భంలో ఉపతసిల్దారు టి వెంకటయ్య మాట్లాడుతూ ఇంతకుముందు వికారాబాద్ సివిల్ సప్లై ఉప తహసిల్దార్ గా విధులు నిర్వహిస్తున్న అక్కడ నుంచి బషీరాబాద్ డిప్యూటీ తాసిల్దార్ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు ఆదేశాల ప్రకారం స్థానచలనం కల్పించారు ఈ ప్రాంత ప్రజలకు ఎటువంటి సమస్యలు ఉన్న నేరుగా వచ్చి వారి సమస్యలు తీర్చుకోవాలని మరియు ప్రజలకు సేవ చేయడమే నా లక్ష్యం అని పేర్కొన్నారు.

## విద్యార్థులకు ఉచిత నోట్ పుస్తకాల పంపిణీ



కోటపల్లి జులై 4 (మనం న్యూస్): శ్రీ వాసవి జ్యువెలర్స్ ప్రొపరేటర్ బాలరాజ్ ఆధ్వర్యంలో కోటపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం పుస్తకాలను స్థానిక సర్పంచ్ నక్కల విదేశీ లక్ష్మి చేతుల మీదుగా పంపిణీ చేశారు ఈ సందర్భంగా దాత బాలరాజు మాట్లాడుతూ కోటపల్లి ప్రైమరీ పాఠశాల విద్యార్థులకు గత 12 సంవత్సరాలుగా నోట్ పుస్తకాలను అందించడం జరుగుతుందని అన్నారు. విద్యాదానం మహాదానమని ఆనాడు ఒకవి ఏదైనా తరగని ఆస్తి విద్య అనేది ఎంతో గొప్ప విషయం అని గుర్తు చేశారు. ప్రతి విద్యార్థి ఇష్టంతో కష్టపడి చదివి మంచి భవిష్యత్తును సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయులు శ్రీధర్ రెడ్డి ప్రైమరీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలేశ్వరయ్య ఉపాధ్యాయుల విశ్వం పంతులు, వెంకటేశం, నరేందర్ గౌడ్, గౌసియా బేగం, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక అక్షరాస్యతపై జాతీయ స్థాయి క్విజ్ పోటీలలో 26 మంది ఎంపిక



వికారాబాద్ జూలై 4, మనం ప్రతినిధి :రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యత పై అఖిల జాతీయ క్విజ్ పోటీలను నిర్వహించడం జరిగిందని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 150 ప్రభుత్వ పాఠశాలల నుండి 300 నామినేషన్లు అందినవని, జూన్ 27 నుండి మండల స్థాయిలో విద్యార్థులతో క్విజ్ పోటీలను నిర్వహించడం జరిగిందన్నారు. 13 పాఠశాలల నుండి 26 మంది విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక అయినారని, మంగళవారం రోజు వికారాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల (బాలికలు) యందు జిల్లాస్థాయి పోటీలు నిర్వ హించి ఇద్దరు విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఇందులో స్టేట్ మోడల్ స్కూల్, పూడూర్ విద్యా ర్థులైన ఎన్ ప్రవీణ్ కుమార్, సాదియా ఇస్మాయిల్ ఈనెల 10వ తేదీన జరుగు రాష్ట్రస్థాయి ఆర్థిక అక్షరాస్యత పై నిర్వహించే కిస్ పోటీలలో పాల్గొనున్నట్లు తెలిపారు. జిల్లాలో నిర్వహించిన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ఆర్బీఐ ప్రతినిధి సర్టిఫికెట్లు అందించడం జరిగిందని, నగదు బహుమతులు కూడా అందజేయడం జరుగు తుందని రాంబాబు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యా యులు, ఆర్బీఐ ప్రతినిధులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాల నిర్మూలన సమష్టి కృషితోనే సాధ్యం







- జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిణి కేతావత్ లలిత కుమారి

వికారాబాద్, జూలై 4, మనం ప్రతినిధి: అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా మహిళా శిశు దివ్యాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ వికారాబాద్ ఆధ్వ ర్యంలో జిల్లా కేంద్రమైన వికారాబాద్లో సోమవారం ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం 2023 పురస్కరించుకొని స్థానిక సిద్ధార్థ జూనియర్ కళాశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిణి కేతావత్ లలిత కుమారి పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ విద్యార్థులు, యువత జీవితాలను చిన్నాభిన్నం చేస్తున్న మాదక ద్రవ్యాల నిర్మూలన సమష్టి కృషితోనే సాధ్యమవు తుందని పేర్కొన్నారు. పిల్లలు చెడు అలవాట్లకు బానిసలు కాకుండా నిరంతరం పర్యవేక్షిం చాల్సిన బాధ్యత తల్లిదండ్రులదేనని స్పష్టం చేశారు. డ్రగ్స్ వినియోగాన్ని నిర్మూలించేందుకు విద్యార్థులు, యువతలో చైతన్యం తీసుకురావాల్సిన అవసరముందన్నారు. మాదక ద్రవ్యాల వినియోగంతో ఏటా అనేక మంది తమ జీవితాలను అర్ధాంతరంగా ముగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్నేహితుల ద్వారానే విద్యార్థులు, యువత డ్రగ్స్ కు అలవాటు పడుతున్నారని, క్రమేపి వ్యసనపరులుగా మారుతుండడం పలు సందర్భాల్లో తేటతె ల్లమైందన్నారు. మిత్రుల ఎంపికపై ఆచితూచి వ్యవహరించాలని, సోషల్ మీడియా వినియోగంపై కూడా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సోషల్ మీడియాను సద్వినియోగం చేసుకుంటే ఉన్నత స్థాయి ఉద్యోగాలు కూడా సంపాదించవచ్చని, ఇందుకు నిదర్శనమే నేడు తెలంగాణ రాష్ట్రంలో బాలురు బాలికలు వివిధ రంగాలలో సాధించిన అభివృద్ధి మనకు కనిపిస్తుందన్నారు. మాదక ద్రవ్యాలకు బానిసలైన వారిపై చిన్నచూపు చూడడం తగదన్నారు. వికారాబాద్ జిల్లాను మాదక ద్రవ్య రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. డ్రగ్స్ వినియోగం మూలంగా మనిషి ప్రవర్తనలో క్రమేపీ మార్పు వచ్చి దీర్ఘకాలిక దుష్ప్రభావం కలుగుతుందన్నారు. నాడీ వ్యవస్థతో పాటు కాలేయం, నరాలు, ఇతర శరీర భాగాలపై తీవ్ర ప్రభావం చూపి, మరణం సంభవించే ప్రమాద ముందన్నారు. మాదక ద్రవ్యాలు వినియోగిస్తున్న వారిని గుర్తించి, రీహబిలిటేషన్ సెంటర్కు తరలిస్తే, వారిలో మార్పు వస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎక్సైజ్ డిపార్ట్మెంట్ సూపరింటెండెంట్ నవీన్ చంద్ర మాట్లాడుతూ సమాజాన్ని పట్టి పీడిస్తున్న భూతం మాదక ద్రవమ న్నారు. ప్రజల్లో మార్పుతోనే దీనిని నిర్మూలించ వచ్చని చెప్పారు. మాదక ద్రవ్యాల వినియోగంతో నేరాలు పెరుగుతున్నాయన్నారు. గంజాయి, నల్ల మందు, కొకైన్, ఇతర మాదక ద్రవ్యాలు జిల్లాలో ఎక్కడైనా లభించినట్లు తెలిస్తే, పోలీసులకు వెంటనే సమాచారమివ్వాలని కోరారు.

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ స్టాటిస్టికల్ ఆఫీసర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగంతో కుటుంబం చిన్నాభిన్నం అవుతుందన్నారు. వీటికి బానిసలుగా మారుతున్న వారిలో అత్యధిక శాతం దినసరి కూలీలు అని తెలియజేయడం జరిగింది. ఈ కార్య క్రమాన్ని ఉద్దేశించి వికారాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్ సిఐ శ్రీనివాస్ మాట్లాడుతూ నేడు ముఖ్యంగా డ్రగ్స్ అలవాటు పడిన వారిలో యువత ఎక్కువ ఉంటున్నారని గుర్తించినట్లు వెల్లడించారు. యువత జీవిత లక్ష్మాన్ని నిర్దేశించుకుని దానిని సాధించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మాదకద్రవ్యార్థ జీవిత నరకం వద్దు మాదకద్రవ్యాల వాడకం అనే నినాదాలతో రూపొందించిన వాల్ పోస్టర్ ను ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో లోకల్ పోలీస్ స్టేషన్ సీఐ శ్రీనివాస్, ఎక్సైజ్ డిపార్ట్మెంట్ సీఐ రాఘువీణ, ఎస్సై వీరాంజనేయులు, స్థానిక సిడిపిఓ వెంకటేశ్వరమ్మ, కళాశాల వైస్ ప్రిన్సిపల్ శివారెడ్డి, డవ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి మల్లారెడ్డి, ఎఫ్ ఆర్ ఓ వెంకటేష్ హాజరు కావడం జరిగింది.

## మహాయాగానికి ఆహ్వానించిన ఎమ్మెల్యే



బషీరాబాద్ జూన్ 4 మనం న్యూస్ : సుక్షేత్ర ఆర్కోడ్ (కర్నాటక స్వామీజీ చిన్న వీరశివచార్య గారిని ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి తరపున ఆహ్వానించిన ఎమ్మెల్యే బాబాయి శ్రీశైల్ రెడ్డి పంజుగుల. తాండూరు నియోజకవర్గ ప్రజల ఆయురారోగ్యాలు, సుఖసంతోషాల కొరకు 11 రోజులపాటు జగద్గురువులు, పీఠాధిపతులు సమక్షంలో ఈ మహాయాగం చేస్తున్నమని, నియోజకవర్గ వ్యాప్తంగా 11 వేలమంది దంపతులు సామూహిక హోమంలో పాల్గొంటున్నారని శ్రీశైల్ రెడ్డి స్వామీజీకి వివరించారు. ఇది గొప్ప సంకల్పమని ఆశీర్వదించిన స్వామీజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డితో ఫోన్లో మాట్లాడి తాము తప్పక హాజరవుతామని తెలిపారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జీవన్గి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దేశ్ముఖ్ సోమశేఖర్ రెడ్డి, దత్తయ్య గౌడ్, పట్లోళ్ల శ్రీనివాస్ రెడ్డి, విశ్వనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య మహిళా కేంద్రాన్ని సందర్శించిన మున్సిపల్ చైర్ పర్సన్



వికారాబాద్, జూలై 4, మన న్యూస్: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు ప్రభుత్వం మహిళల కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆరోగ్య మహిళ పథకం కింద వికారాబాద్ పట్టణంలోని రామయ్యగూడా పిహెచ్‌ఓలో నిర్వహిస్తున్న పరీక్ష కేంద్రాన్ని ఆరోగ్యశాఖ మంత్రి హరీష్ రావు ఆదేశాల మేరకు మంగళవారం రోజు వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేష్ సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ ఎలాంటి పరీక్షలు అందుబాటులో ఉన్నాయి అని డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చైర్ పర్సన్ మాట్లాడుతూ సాధారణంగా మహిళలు పని ఒత్తిడి కారణంగా తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తూ ఉంటారు. దాంతో అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతుంటాయి. మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబాలు బాగుంటాయి అనే మంచి ఉద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం ఆరోగ్య మహిళా అనే పథకాన్ని ప్రవేశపెట్టిందని అన్నారు. ఈ పథకం కింద మహిళలకు క్యాన్సర్ టెస్టులు, సూక్ష్మ పోషక లోపాలు, మూత్రనాళ ఇన్ఫెక్షన్ మరియు పిఐడి. పిసిఓఎస్ .ఋతుస్రావ సమస్యల నిర్వహణ, మెనోపాజ్, లైంగిక వ్యాధుల నిర్వహణ, శరీర బరువు నిర్వహణ లాంటి లక్షణాలను తెలిపే డయాగ్నస్టిక్స్ పరీక్షలు వారానికి ఒకరోజు ప్రతి మంగళవారం ఉచితంగా నిర్వహించడం జరుగు తుంది. కాబట్టి వికారాబాద్ పట్టణలోని 18 సంవత్సరాల పైబడిన మహిళలు ప్రతి ఒక్కరు కెసిఆర్ ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆరోగ్య మహిళలుగా జీవించాలని సూచించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేష్ సైతం టెస్టులు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో డిఎం అండ్ హెచ్ఓ పాల్వాన్ కుమార్, డాక్టర్ అరవింద్, డాక్టర్ సృజన, డాక్టర్ నికిత మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## రేపు స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశాలకు ఎంపికలు

బషీరాబాద్, జులై 4, మనం న్యూస్ : 2023 -24 స్పోరట్స్ స్కూల్‌లో ప్రవేశాలకు బషీరాబాద్‌లో మండల స్థాయిలో 4వ తరగతి 5వ తరగతులో ప్రవేశాలకు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ తెలిపారు 4వ తరగతి ప్రవేశాలకు 01/09/ 2014 నుండి 31/08/2015 మరియు 5వ తరగతి ప్రవేశాలకు 10/09/2013 నుండి 31/08/2014. మద్యలో జన్మించి ఉండాలి. ఆసక్తి ఉన్న విద్యార్థులు తమ ఆధార్ కార్డు జిరాక్స్ మరియు బోనఫైడ్ సర్టిఫికెట్‌తో ఈనెల 6న బషీరాబాద్ బాలుర ఉన్నత పాఠశాలలో ఉదయం 9:30 గంటలకు హాజరు కాగలరు కోరడమైనది.

# సమ్మెను జయప్రదం చేయండి



- బషీరాబాద్ మండలం ఎంపీడీవో ఆఫీస్‌లో సమ్మె నోటీస్
- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కే శ్రీనివాస్

తాండూరు, జులై 04 మనం న్యూస్ ; సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కే శ్రీనివాస్ మాట్లాడుతూ బషీరాబాద్ మండలం లో ఉన్న గ్రామ పంచాయతీ కార్మికులందరు జులై 6 నుండి గ్రామపంచాయతీ పనులు బందు పెట్టి సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని పెరిగిన జీతాలు పెండింగ్ 3నెలలు జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు గ్రామపంచాయతీ సిబ్బందిని వెంటనే పర్మినెంట్ చేయాలి జీవో నెంబర్ 51 ని వెంటనే రద్దు చేయాలి జీవో నెంబర్ 60 ప్రకారము గ్రామ పంచాయతీ వర్కర్లకు వేతనాలు చెల్లించాలి ఈ రాష్ట్రంలో 12,769 గ్రామ పంచాయతీలు ఉన్నాయి సుమారుగా ఈ రాష్ట్రంలో 50,000 మంది గ్రామపంచాయతీ వర్కర్లు ఉన్నారు వీరందరికీ ప్రభుత్వ ఉద్యోగులకు గుర్తించాలి కనీస వేతనాలు 26 వేల రూపాయలు ఇవ్వాలి పిఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలి జిపి వర్కర్స్ కు ట్రెజర్ ద్వారానే జీతాలు చెల్లించాలి పారిశుద్ధ్య కార్మికులకు స్వీపర్లు పంపు ఆపరేటర్లు ఎలక్ట్రిషన్లు డ్రైవర్లు కారోబార్లు బిల్ కలెక్టర్లు వాటర్ మ్యాన్లు నర్సరీలు వైకుంఠధామము పార్కులు ఆఫీస్ పనులు నిర్వహిస్తున్నారు సుమారుగా 20 సంవత్సరాల నుండి 30 సంవత్సరాలు అవుతున్న నేటి వరకు శ్రమజీవులు గాని మిగిలిపోతున్నారు వీరి కుటుంబాలలో పస్తులు ఉండవలసినటువంటి పరిస్థితి ఏర్పడ్డది ఆరోగ్యము మంచి ఉండాలన్న వారి పిల్లలు చదువులు చదువుకోవాలన్న మంచి తిండి తినాలన్న 26000 వెంటనే చెల్లించాలి ప్రతి కార్మికుడు ప్రతి మనిషి రోజువారీగా 2700 గ్రాముల తిండి తినవలసిన కానీ జిపి వర్కర్లు మాత్రము దానికి నోచుకోవడం లేదు ఒక్క మాటలో చెప్పాలంటే ముల్లే నక్క మీద తాటికాయ పడ్డ చందంగా ఉంది గ్రామపంచాయతీ సిబ్బందిని వెంటనే పర్మినెంట్ చేయాలి పి ఆర్ సి లో నిర్ణయించిన ప్రకారం పని భద్రత కల్పించాలి ప్రమాద బీమా లాంటి సౌకర్యాలు కల్పించాలి తెలంగాణ రాష్ట్రం ఏర్పడి తొమ్మిది సంవత్సరాలు అవుతున్న గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు తీరడం లేదు 2011 జనాభా లెక్క ప్రకారం 500 మందికి ఒక జిపి వర్కర్ నియమించడం తీవ్రమైన అన్యాయం జనాభా ప్రాతిపదికన లేకుండా గ్రామపంచాయతీ వర్కర్‌గా ఎంపీడీవో జిల్లా డిపిఓ ద్వారా నియమించాలి ప్రతి గ్రామ పంచాయతీలో ప్రజల అవసరాలకు అనుగుణంగా జిపి వర్కర్‌ను నియమించాలి ఎలాంటి షరతులు లేకుండా ప్రత్యేకంగా వీరికి ప్రభుత్వమే బడ్జెట్ను ప్రవేశపెట్టాలి ఈ కార్యక్రమంలో తాండూర్ నియోజకవర్గంలో ఉన్నటువంటి గ్రామ పంచాయతీలో పనిచేసే కార్మికులందరు ఈనెల జులై 6 నుండి పనులు బందు పెట్టి సమ్మెలో పాల్గొనాలని జయప్రదం చేయాలని కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బుగ్గప్ప గ్రామపంచాయతీ కార్మికుల నూతన కమిటీ అధ్యక్షులు ఎన్ శామప్ప ఉపాధ్యక్షులు లక్ష్మి లక్ష్మణ్ శామప్ప ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్ కోశాధికారి ఉషానప్ప మండల కమిటీ సభ్యులుగా నర్సింలు ఎల్లప్ప బసమ్మ దేవమ్మ పార్వతమ్మ రాములు చిన్న లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



# సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య

సూర్యాపేట జూలై 4 మనం న్యూస్ః తెలంగాణ సాయుధ పోరాట యోధుడు తొలి అమరుడు కామ్రేడ్ దొడ్డి కోమురయ్య అని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో దొడ్డి కోమురయ్య 77వ వర్ధంతి సందర్భంగా కలెక్టర్ ఎస్.వెంకట్రావ్‌తో కలిసి చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు ఆర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ....... దేశ్‌ముఖ్‌ల ఆగడాలను అణ చి వేయాలని తన చివరి శ్వాస వరకు పోరాట ం చేశాడని గుర్తు చేశారు. రైతు సాయుధ పోరాట యోధులను ఉమ్మడి రాష్ట్రంలో స్మరించుకోలేదని, స్వరాష్ట్రం సిద్ధించాకే మహనీయులకు తగిన గౌరవం దక్కిందన్నారు. దొడ్డి కొమురయ్య గురించి భావి తరాలకు తెలపానే ఉద్దేశ్యంతో ప్రభుత్వం అధికారికంగా వర్ధంతి వేడుకలను నిర్వహిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధనపు కలెక్టర్ హేమంత్ కేశవ్, పిడి కిరణ్‌కూమార్, జడ్పీ సీఈఓ సురేష్, డిఎఫ్ఓ సతీష్, సిపిఓ వెంకటేశ్వర్లు, డిపిఓ యాదయ్య, జడ్పీటిసి జీడి బిక్షం, మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్ట కిషోర్, ఆర్డీఓ రాజేంద్ర కూమార్, బిసి సంఘం నాయకులు సత్యనారాయణ పిళ్లై, జీవన్ కేశవ్, రాపర్తి శ్రీను, వెంకట్, తదితర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

సూర్యాపేటలో జిల్లా కేంద్రంలోని సిపిఎం, సిపిఐఎంఎల్ ప్రజా పంథా పార్టీల ఆధ్వర్యంలో మంగళవారం కామ్రేడ్ దొడ్డి కొమురయ్య 77వ వర్ధంతి సందర్భంగా ఆయా పార్టీల కార్యలయాల్లో కొమురయ్య చిత్ర పటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు ఆర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ... భూమి కోసం, భూక్తి కోసం పేద ప్రజల విముక్తి కోసం నిరంతరం పోరాటం చేసి





అమరుడైన దొడ్డి కొమురయ్య జీవితం నేటి యువతకు ఆదర్శప్రాయమైని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి, సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకూమార్, ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తిరుమలగిరిలో నాడు తెలంగాణ లో నిజాం పాలనకు ఎదురోడ్డి ప్రాణాలు విడిచిన అమరుడు కామ్రేడ్ దొడ్డి కొమురయ్య 77వ వర్ధంతి మండల కేంద్రంలోని గొర్రెల, మేకల పెంపక దారుల సంఘంతో పాటు స్థానిక మున్సిపల్ కార్యలయాలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు ఆర్పించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పోతురాజు రజిని, సంఘం జిల్లా అధ్యక్షుడు కడెం లింగయ్య మాట్లాడుతూ... దొడ్డి కొమురయ్య ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఈ తరం విద్యార్థులకు కొమురయ్య, చాకలి ఐలమ్మ, పోరాలటాలను పాఠ్య పుస్తకాలలో చేర్చాలని అలాగే హైదారాబాద్ ట్యాంక్ బండ్‌పై విగ్రహలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ దండు శ్రీను, కౌన్సిలర్‌లు బత్తుల శ్రీను, శ్రీలత, సరిత, బుచ్చిబాబు, జమ్మూద్వీప జనసమితి రాష్ట్ర నాయకులు పత్తేపురం యాదగిరి, బిసి సంఘం నాయకులు తన్నీరు ప్రభు, కడారి లింగయ్య, యాకయ్య, నిర్మల, అబ్రహం, సోమయ్య, రాములు, సత్యనారాయణ రెడ్డి, రమేష్, శ్యామ్, సాంభయ్య, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

## సిసి రోడ్డు పనులను పరిశీలించిన చైర్ పర్సన్



తిరుమలగిరి, జూలై 04 మనం న్యూస్ః పట్టణంలోని 9వ వార్డు ఈదుల పర్రె తండాలో సిసి రోడ్డు పనులను మున్సిపల్ చైర్ పర్సన్ పోతురాజు రజిని మంగళవారం పరిశీలించారు. చైర్ పర్సన్ వెంట కమీషనర్ దండు శ్రీను, జూనియర్ అసిస్టేంట్ ఖదీర్, బీల్ కలెక్టర్ పరుశురామ్‌లు ఉన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ



పాలకీడు, జూలై 4,(మనం న్యూస్)ః నిరుపేదల కుటుంబాలకు ఆపదలో అపన్నహస్తంగా ముఖ్యమంత్రి సహయనిధి వరంలా మారిందని జాన్‌పహడ్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు భూక్య రాజశేఖర్ అన్నారు. మండల పరిధిలోని జాన్‌పహడ్‌దర్గా గ్రామ పంచాయితీ కల్మెట్‌తండా గ్రామానికి చెందిన లావుడ్య నరేందర్‌కు మంజూరైన సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను మంగవారం బీఆర్ఎస్ నాయకులతో కలిసి పంపీణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..... తెలంగాణ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అన్ని వర్గాల ప్రజల అభివద్దే లక్ష్యంగా అమలవుతూ ముఖ్యమంత్రి సహయనిధి ద్వారా బాధిత కుటుంబాలకు అందిస్తున్న చెక్కులు వారి కుటుంబాలకు ఆసరాగా ఉంటున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు భూక్య చరణ్, వెంకటీ, రమేష్, శ్రీనివాస్, రవి, శోభన్, రాంసింగ్, శంకర్, రవి, గ్రామప్రజలకు పాల్గొన్నారు.

## 10 నుంచి ఈవీఎంల ద్వారా ఓటు హక్కు వినియోగంపై అవగాహన

వికారాబాద్ జూలై 4 , మనం ప్రతినిధి: ఈవీఎంల ద్వారా ఓటు హక్కును వినియోగించుకునేందుకు ప్రజలకు అవగాహన కల్పించేందుకుగాను ఈనెల 10వ తేదీ నుండి జిల్లాలో ఈవీఎంల ప్రదర్శన కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజలు డమ్మీ ఓటింగ్ లో పాల్గొనేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎన్నికల నిర్వహణ అధికారులతో మంగళవారం జిల్లా కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించి మాట్లాడుతూ, ఈనెల 10వ తేదీ నుండి అన్ని నియోజకవర్గ కేంద్రాలలోని హెడ్ ఆఫీస్ లలో ఈవీఎం ప్రదర్శన కేంద్రాలను ఏర్పాటు చేసి నియోజకవర్గాల నుండి గ్రామస్థాయి వరకు ఆగస్టు మాసంతం వరకు ప్రజల చేత డమ్మీ ఓటింగ్ చేయించి వారికి అవగాహన కల్పించాలన్నారు. ఇందుకు గాను నాలుగు మొబైల్ వాహనాలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి రోజు రెండు లొకేషన్ లలో వాహనాలను తిప్పుతూ ప్రజల ద్వారా డమ్మీ ఓటింగ్ నిర్వహించాలని ఆదేశించారు. నియోజక వర్గాలలో ఇట్టి ప్రక్రియ నిరంతరంగా కొనసాగించాలని సూచిం చారు. జూలై 13 నాటితో ఆన్లైన్ ప్రక్రియ నిలిచిపోతున్నందున అన్ని పనులను వేగవంతంగా పూర్తి చేసుకోవాలన్నారు. ఇంటింటి సర్వే అనంతరం చేపట్టాల్సిన డాటా ఎంట్రీ పనులను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా ప్రతి సెక్టార్‌కు ఒక సెక్టార్ ఆఫీసర్లను ఎంపిక చేయాలని రిటర్నింగ్ అధికారులను కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు రాహుల్ శర్మ, లింగ్యానాయక్‌లతో పాటు వికారాబాద్, తాండూరు ఆర్డీవోలు విజయ కుమారి, అశోక్ కుమార్, అన్ని మండలాల తాసిల్దారులు, సెక్షన్ సూపరింటెండెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.

## మైహోం పరిశ్రమకు సోషల్ రెస్పాన్సిబిలిటీ అవార్డు

మేళ్ళచెర్వు, జూలై 4,(మనం న్యూస్)ః తెలంగాణ ప్రభుత్వం పరిశ్రమల శాఖ, ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎక్సలెంట్ అవార్డ్స్ భాగంగా స్థానిక మైహోం ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ విభాగంలో అవార్డును అందుకుంది. ఇండస్ట్రీస్ మరియు శాఖ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా సంస్థ డైరెక్టర్ టెక్నికల్ వివిఎస్ నారాంగ్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ లక్ష్మీనారాయణలు అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... మైహోం ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ విభాగంలో గత కొన్ని సంవత్సరాలుగా పరిశ్రమ చుట్టుపక్కల గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తుందని, అలాగే మెడికల్ క్యాంప్స్, పాఠశాలల అభివృద్ధి, ఇతర సామాజిక కార్యక్రమాలు నిర్వహించినందుకు ప్రభుత్వం అవార్డు ఇచ్చిందని తెలిపారు. సంస్థ ప్రెసిడెంట్ వర్క్స్ యూనిట్ హెడ్



శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.... మేళ్ళచెర్వు యూనిట్ నందు యాజమాన్యం చేపట్టిన కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమాలను దృష్టిలో ఉంచుకొని ఈ అవార్డు ఇవ్వడం సంతోషకరమని, అవార్డుకు సహకరించిన పరిసర గ్రామ ప్రజాప్రతినిధులకు, ఈ అవార్డు రావడంలో తోడ్పడిన ప్రతికార్మికుడికి, ఉద్యోగులకు అభినందనలు తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య




● మున్సిపల్ చైర్మన్ గెల్లి అర్చన రవి

హుజూర్‌నగర్, జూలై 4,(మనం న్యూస్)ః ప్రభుత్వ పాఠశాలలో అనుభవ జ్ఞులైన, అంకిత భావంతో పని చేసే ఉపాధ్యాయులు విద్యార్థులకు విద్యాబుద్దులు నేర్పిస్తున్నారని ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని మున్సిపల్ చైర్మన్ గెల్లి అర్చనరవి అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ విద్యా సంవత్సరంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా విద్యార్థులకు ఉచితంగా అందజేసే నోట్‌పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్యను అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే అందిస్తున్నారని, బడి ఈడు పిల్లలందరిని ప్రభుత్వ బడిలో చేర్పించాలని, ప్రభుత్వం ఉచితంగా కల్పిస్తున్న పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, ఏకరూప దస్తులు, ఇంగ్లీష్ మీడియం, రుచికరమైన మధ్యాహ్న భోజనం వంటి సదుపాయాలను సద్వినియోగం చేసుకొని బాగా చదువు లలో రాణించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జక్కుల నాగేశ్వర్‌రావు, కౌన్సిలర్ మంగమ్మ, హెచ్ఎం మల్లెల ఉదయశ్రీ, ఉపాధ్యాయులు తాతరాజు శ్రీనివాస్, మాతంగి ప్రభాకర్, పులి దీనారాణి, ఆరే వసంతరావు, యరబోయిన ఉపేందర్, కుమ్మరి శేషగిరి, అన్వేష్, సుజాత, అరుణ, మున్నీబేగం, విద్యార్థులు పాల్గొన్నారు.

## నిజాంసాగర్ ఆయకట్టుకు నీరు వదలాలి



● బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మోహన్ రెడ్డి

నిజామాబాద్ కలెక్టరేట్, జులై 4 (మనం న్యూస్) : నిజాంసాగర్ ఆయకట్టు పరిధిలోని నవీపేట్, రేంజల్, ఎడపల్లి మండల వ్యవసాయ భూములకు సాగునీటినందించి రైతులను ఆదుకోవాలని కోరుతూ బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మోహన్ రెడ్డి మంగళవారం అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవీపేట్, రెంజల్, ఎడపల్లి, మండలాల పరిధిలోని రైతులు వరి పంటను వేసుకునేందుకు బోర్ల వద్ద నార్లు పోసుకొని వర్షాల కోసం ఎదురు చూస్తున్నారన్నారు. కానీ ఇప్పటివరకు సరిపడా వర్షాలు లేనందున నార్లు ముదిరి పంటకు ఆలస్యం అవుతుందని, నిజాంసాగర్ ప్రాజెక్టు నీటిని వదిలితే వరినాట్లు వేసుకోవడానికి ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. అదేవిధంగా అలీ సాగర్ ఎత్తిపోతల పథకం ద్వారా గోదావరి నీటిని సాగు అవసరాల కోసం వెంటనే ఇచ్చి రైతులను ఆదుకోవాలన్నారు. కాలేశ్వరం ఎత్తిపోతల పథకం రివర్స్ పంపింగ్ చేసి వరద కాలువ ద్వారా 30 టిఎంసిల నీటిని శ్రీరాం సాగర్ ప్రాజెక్టులో నింపి ఆయకట్టు రైతులను కాపాడాలని ఆయన కోరారు. 48 గంటల్లో ప్రభుత్వ యంత్రాంగం అధికారులు పట్టించుకోకపోతే రైతుల తరపున ఉద్యమం ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాగపూర్ సొసైటీ చైర్మన్ శైలేష్ కుమార్, జిల్లా ఎస్సీ మోర్చా కార్యదర్శి నాగభూషణం, నవీపేట్, ఎడపల్లి మండలాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

## మోడీ బహిరంగ సభ విజయవంతం చేయాలి

తొర్రూరు జూలై 04 ( మనం న్యూస్)ః ఈ నెల 8వ తేదీన ప్రధాని నరేంద్ర మోడీ గారు వరంగల్ లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడానికి విచ్చేస్తున్న సందర్భంగా బిజెపి ఆధ్వర్యంలో భారీ బహిరంగసభ ఏర్పాటు చేయడం జరిగింది అని బీజేపీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలి వచ్చి జయప్రదం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పెదగాని సోమయ్య,లేగా రాం మోహన్ రెడ్డి లు పిలుపునిచ్చారు. మంగళవారం తొర్రూర్ లోని పార్టీ కార్యాలయంలో బీజేపీ తొర్రూరు శాఖ అధ్యక్షుడు పల్లె కుమార్ సభాధ్యక్షతన బహిరంగ సభ సన్నాహక సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ గారు తెలంగాణ సమగ్రాభివృద్ధి కి చిత్త శుద్ధి తో క్రృషి చేస్తున్నారు అని తెలిపారు.ఎలాంటి వివక్ష లేకుండా టీమిండియా స్ఫూర్తి తో పనిచేస్తూ అభివృద్ధి నిరోధక పరుగులు పెట్టిస్తున్నారు అని తెలిపారు.మోడీ గారి 9 ఏళ్ళ సుపరిపాలన లో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకుపోతూ ప్రపంచ అగ్ర దేశాల సరసన నిలిచింది అని తెలిపారు. ఈ నెల 8వ తేదీన వరంగల్ బహిరంగ సభ కు బీజేపీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలి వచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి పాలకుర్తి నియోజకవర్గ కన్వీనర్ పూసాల శ్రీమాన్, రూరల్ మండలం అధ్యక్షుడు




బొచ్చు సురేష్, జిల్లా కార్యదర్శి పరుపాటి రాం మోహన్ రెడ్డి,15వ వార్డు కౌన్సిలర్ కొలుపుల శంకర్, జిల్లా నాయకులు అలిసేరి రవిబాబు, మంగళ పళ్ళి యాకయ్య, పైండ్ల రాజేష్, రాయపురం రాజకుమార్, కాగు నవీన్, విజయ్ కుమార్, నర్కటీ ఛలపతి, గంధం రాజు, అల్ప కాలిక విస్తారక్ వినోద్ కుమార్, మోహన్ దాస్, నూకల నవీన్, వినయ్ శర్మ,కొండ యాకన్న, సాయి, తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీపీ నెమ్మది బిక్షంని పరామర్శించిన బీఆర్ఎస్ నాయకులు



పెన్‌పహాడ్, జూలై 4(మనం న్యూస్)ః పెన్‌పహాడ్ మండల ప్రజాపరిషత్ అధ్యక్షులు నెమ్మది బిక్షం కాలుకు కొంకి నరం తెగి ఇబ్బంది పడుతుండగా శనివారం సూర్యాపేట శివజ్యోతి ఆసుపత్రిలో డాక్టర్ రమేష్‌నాయక్ శాస్త్ర చికిత్స నిర్వహించగా సోమవారం పెన్‌పహాడ్ గ్రామ బీఆర్ఎస్ గ్రామశాఖ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఎంపీపీని పరామర్శించారు. ఈసందర్భంగా ఆయన యోగ క్షేమాలను అడిగి తెలుసుకొని త్వరగా కోలుకోవాలని అన్నారు. పరామర్శించిన వారిలో తంగేళ్లగూడెం గ్రామశాఖ ప్రధాన కార్యదర్శి కాకునూరి సంతోష్ గౌడ్, గ్రామశాఖ యూత్ అధ్యక్షుడు పెన్‌పహాడ్ మండల సోషల్ మీడియా కాకునూరి బాబురావు బీఆర్ఎస్ నాయకులు నక్కల సతీష్‌లు ఉన్నారు.

## ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలి



జాజిరెడ్డిగూడెం, జూలై 4 (మనం న్యూస్)ః ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని ఎంపీపీ మన్నె రేణుక లక్ష్మి నర్సయ్య యాదవ్ అన్నారు. మంగళవారం జాజిరెడ్డిగూడెం మండలం కుంచమర్తి గ్రామంలో ప్రతి ఇంటికి మొక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉగ్గం ఉపేంద్రలింగరాజు, గ్రామపంచాయతీ కార్యదర్శి రవీందర్‌రెడ్డి గ్రామశాఖ అధ్యక్షుడు దుబ్బాక ఎల్లంరాజు, రైతు కోఆర్డినేటర్ గౌసుద్దీన్, ఫీల్డ్ అసిస్టెంట్ ఏడుకొండలు, వార్డు సభ్యులు మన్నె మౌనికలింగరాజు, పానుగంటి సుహాసిని, జానీ, తవిటి బాగ్యమ్మ, మేడి వీరస్వామి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలపై కళాజాత ప్రదర్శన



జాజిరెడ్డిగూడెం, జూలై 4(మనం న్యూస్)ః జాజిరెడ్డిగూడెం మండలంలోని నాణ్యతండా గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలపై తెలంగాణ సాంస్కృతిక సారధి జిల్లా అధ్యక్షుడు మేడిపల్లి వేణు ఆధ్వర్యంలో కళాబృందంచే కళాప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాచకొండ కావ్య, కళాకారులు వెన్నల నాగరాజు, గడ్డం ఉదయ్, పాలకుర్తి శ్రీకాంత్, పాక ఉపేందర్, పల్లెల రాము, లక్ష్మణ్, గజ్జి మంజుల, కుందమల్ల నాగలక్ష్మి, పోతరాజు శిరీష, మల్లెపాక ప్రియాంక, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## కోడూరు గ్రామ పాలసంఘం ఛైర్మన్‌గా వెంకన్న



జాజిరెడ్డిగూడెం, జూలై 4(మనం న్యూస్)ః జాజిరెడ్డిగూడెం మండలం కోడూర్ గ్రామ పాల సంఘం ఛైర్మన్‌గా గుండగాని వెంకన్న ఎనిమిదో సారి ఎన్నికయ్యారు. డైరెక్టర్లుర్‌గా మంగయ్యను ఎన్నుకున్నారు. ఈ ఎన్నికను సూపర్‌వైజర్‌లు ఎల్లయ్య, విజయ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుండగాని సోమేష్‌గౌడ్, మల్లయ్య, బుచ్చయ్య, నాగయ్య, వెంకన్న, మల్లయ్య, పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ నాయకుడు మృతికి సంతాపం తెలిపిన మంత్రి



పెన్‌పహడ్ జూలై 04 మనం న్యూస్ః మండల పరిధిలోని నారాయణగుడెఋ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ మండల నాయకుడు నారాయణ మాధవరెడ్డి అనారోగ్యంతో మృతి చెందగా మంగళవారం మృతదేహానికి రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి పూలమాలవేసి నివాళులు ఆర్పించారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అదేవిధంగా అదే గ్రామానికి చెందిన నిమ్మల ప్రవీణ్ తండ్రి వెంకటయ్యకు ఆరోగ్యం బాగోలేదని తెలిసి మంత్రి స్వయంగా ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆయన వెంట సర్పంచ్ మండలి మల్లయ్య, సింగిల్ విండో చైర్మన్ నాతాల జానకిరాంరెడ్డి, మామిడి నాగయ్య, చెన్ను శ్రీనివాస్ రెడ్డి, రమణ, దేవయ్య, కృష్ణ, జగన్, వినయ్, సతీష్, నారాయణరెడ్డి, లింగారెడ్డి, నరేష్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## గెలుపే లక్ష్యంగా బిజెపి కార్యకర్తల కృషి



రామకృష్ణాపూర్, జూలై 04 (మనం న్యూస్): రామకృష్ణాపూర్ మున్సిపాలిటీలో బిజెపి బూత్ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్బంగా బిజెపి పట్టణ అధ్యక్షులు మహాంకళి శ్రీనివాస్,విస్తారక్ యాదగిరి,బిజెపి ఐటి సెల్ సోషల్ మీడియా మండల అధ్యక్షులు మాట్లాడుతూ నరేంద్రమోదీ 9 సంవత్సరాల సేవ సుపరిపాలన పేదల సంక్షేమం అభివృద్ధి గురించి కార్యకర్తలకు వివరించారు. తెలంగాణలో బిజెపి గెలుపే లక్షంగా కార్యకర్తలు కృషి చేయాలని అన్నారు. ప్రతిరోజూ ప్రజలకు మోదీ సుపరిపాలన గురించి సోషల్ మీడియాలో ప్రచారం చేయాలని అన్నారు.భారతీయ జనతా పార్టీ మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బిజెపి కార్యాలయం నుండి రామాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆరుముళ్ల పోశం,ఐటి సెల్ సోషల్ మీడియా మండల ఇంచార్జి వేముల అశోక్,పట్టణ ప్రదాన కార్యదర్శి ఎల్పుల సత్యనారాయణ, సీనియర్ నాయకులు దండు రాజేందర్, ముద్దసాని శ్రీనివాస్, వీరమల్ల పాలరా జు,వైద్య శ్రీనివాస్, బంగారి ప్రసాద్, ఓరికంటి సాయి, శ్యాం, బద్రి సతీష్, మహిళా మోర్చా పట్టణ అధ్యక్షురాలు మేదరి లక్ష్మి పాల్గొన్నారు.

## నిబంధనలకు విరుద్దంగా పాఠ్యపుస్తకాల విక్రయాలు

- పట్టుకున్న ఏబీవీపీ నేతలు



పెద్దపల్లి, జులై 04 (మనం ప్రతినిధి) : ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ పాఠశాలలో విక్రయిస్తున్న పాఠ్యపుస్తకాలను ఏబీవీపీ నేతలు మంగళవారం పట్టుకున్నారు. అనంతరం విద్యాధికారులకు ఫిర్యాదు చేయడంతో పుస్తకాలను సీజ్ చేశారు. అనంతరం ఏబీవీపీ జిల్లా కన్వీనర్ బండి రాజశేఖర్ మాట్లాడుతూ పెద్దపల్లి పట్టణంలోని ట్రినిటి పాఠశాలలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్దంగా ఎటువంటి అనుమతులు లేకుండా బుక్స్టాల్ పేరుతో పాఠ్య పుస్తకాలు, స్టేషనరీ విక్రయిస్తున్నారని ఆరోపించారు. ధనార్జనే ధ్యేయంగా విద్యార్థుల తల్లిదండ్రులను తీవ్ర ఇబ్బందులకు గురి చేయడం జరుగుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబం ధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలు విక్రయిస్తున్నా ప్రైవేట్ పాఠశాలల గుర్తింపును రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కీసర మనిషా, వేల్పుల నాగచంద్ర, జిల్లా హాస్టల్ కన్వీనర్ రాసురి ప్రవీణ్,జిల్లా ఎస్ఎఫ్ఎస్ కన్వీనర్ సందనవేన ఓమేష్, అరవింద్, జగ్గంపల్లి అభి, శ్రీనివాస్, తదితరులున్నారు.

## కీర్తి పురస్కార గ్రహీత డాక్టర్ ముదిగంటికి ఘన సన్మానం



రామడుగు జులై 4 (మనం న్యూస్): పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కార డాక్టర్ ముదిగంటి సుధాకర్ రెడ్డి కి రామడుగు మండలం గోపాలరావు పేట లోనేడు వాయిస్ ఆఫ్ లవ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కొక్కెర కుంట ఫ్యాక్స్ చైర్మన్ ఒంటెల మురళీకృష్ణారెడ్డి స్థానిక సర్పంచ్ కర్రసత్య ప్రసన్న లు హాజరై పుష్పగుచ్చం హారం అందజేస్తూ శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా సర్పంచ్ సత్య ప్రసన్న మాట్లాడుతూ జనములో ప్రశ్నించే తత్వం పెంపొందే విధంగా అభివృద్ధి దిశగా పయనించడానికి అనేక సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజల్లో చైతన్యం పెంచే విధంగా కృషి చేస్తున్న ముదిగంటి అభినందనీయుడని అన్నారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ద్వారా కీర్తి పురస్కారం అందుకోవడం ఎంతో సంతోషమని ,తన సొంత గడ్డపై ముదిగంటిని సన్మానించడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. సందర్భంగా ముదిగంటి మాట్లాడుతూ ప్రతి పౌరుడు సామాజిక చైతన్యం కోసం ప్రశ్నించే తత్వమును పెంపొందించుకొని సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంస్థ చైర్మన్ ప్రార్ధన రేఖ ఎర్రా మల్లేశం వార్డ్ సభ్యురాలు నేరెళ్ల కవిత, విశ్రాంత ఉపాధ్యా యులు కర్ర రాజిరెడ్డి ,ముదిగంటి దామోదర్ రెడ్డి,సత్యనారాయణ రెడ్డి,పి రమేష్, బి రమేష్,బి సాయిలు అనంతరెడ్డి కనకయ్య శ్యామ్ రావు రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బిసి హాస్టళ్లకు నూతన భవనాలు నిర్మించాలి

హుజురాబాద్ రూరల్, జులై 4 (మనం న్యూస్): హు జురాబాద్ నియోజకవర్గంలోని శిథిలావస్థలో ఉన్న బిసి బాలుర, బాలికల హాస్టళ్లకు నూతన భవనాలు నిర్మించాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం ఆర్డీఓ హరిసింగ్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి కేశబోయిన రాముయాద వ్ మాట్లాడుతూ హుజురాబాద్‌లోని బిసి బాలుర, బాలికల హాస్టళ్లు కొనసాగుతోన్న ప్రైవేటు భవనాలు శిథిలావస్థలో ఉండి ప్రమాదకరంగా పరిణమించాయన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి హాస్టళ్లకు నూతన భవనాలు నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే విద్యార్థులకు అందించాల్సిన హాస్టల్ మెస్ చార్జీలు పెంచాలని స్కాలర్షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలి

- టీచర్ పోస్టులు భర్తీ చేయాలి
- ప్రభుత్వ యూనివర్సిటీలను బలోపేతం చేయాలి
- కలెక్టరేట్ ముట్టడించిన ఏబీవీపీ విద్యార్థులు






పెద్దపల్లి, జులై 04 (మనం ప్రతినిధి) : ఏబీవీపీ తెలంగాణ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు ఏబీవీపీ నేతలు మంగళవారం మహాధర్నా చేపట్టారు. అనంతరం ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మారవేణి రంజిత్ కుమార్, జిల్లా కన్వీనర్ బండి రాజశేఖర్‌లు మాట్లాడుతూ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రూ.5వేల మూడువందల కోట్ల స్కాలర్ షిప్, ఫీజు రియంబర్స్‌మెంట్‌ను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో బోధన, బోధనేతర ఖాళీలను వెంటనే భర్తీ చేయాలన్నారు. ప్రపంచవ్యాప్త విద్యార్థులను ఆకర్శించేటంతటి నాణ్యత కలిగిన విద్యా సంస్థలుగా మెడికల్, ఇంజనీరింగ్ కళాశాలలను, విశ్వవి ద్యాలయాలను తీర్చిదిద్దాలన్నారు. రాష్ట్రంలో మూసివేసిన 8624 ప్రభుత్వ పాఠశాలలను పునఃప్రారంభించి, ప్రభుత్వ విద్యను పటిష్ట పర్చాలని ప్రభుత్వానికి సూచించారు. ఫీజుల నియంత్రణ చట్టం చేసి, ఫీజుల దోపిడీలను అరికట్టాలని, విద్యతో వ్యాపారం చేస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థలను నిషేదించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ యూనివర్సిటీలో 75శాతంకు పైగా ఖాళీగా ఉన్న అధ్యాపక, ఆధ్యాపకేతర పోస్టులను భర్తీ చేయాలని, అధిక నిధులు కేటాయించి పరిశోధనలను ప్రోత్సహిస్తూ ప్రభుత్వ యూనివర్సిటీలను బలోపేతం చేయాలని కోరారు. ప్రైవేట్ యూనివర్సిటీలలో రిజర్వేషన్లు కల్పిస్తూ, అధిక ఫీజులను నియంత్రించి, అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ యూనివర్సిటీ భూములు, ప్రభుత్వ విద్యా సంస్థల భూములను పరిరక్షించాల్సిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు. సంక్షేమ, గురుకుల వసతి గృహాలకు, ప్రభుత్వ విద్యా సంస్థలకు పక్కా భవనాలను నిర్మించి, మెరుగైన మౌళిక వసతులు కల్పించాలని, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 191లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను యుద్ధ ప్రాతిపదికన భర్తీ చేసి, టీ.ఎస్.పిఎస్.సిని ప్రక్షాళన చేస్తూ, పటిష్టపరిచి జాబ్ క్యాలెండర్ తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పేపర్ లీకేజీ నిందితులన కఠినంగా శిక్షించాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినితి పత్రం సమర్పించారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వేల్పుల నాగచంద్ర, కీసరి మనిషా, జిల్లా హాస్టల్ కన్వీనర్ రాసురి ప్రవీణ్, జిల్లా ఎస్ ఎఫ్ఎస్ కన్వీనర్ సందనవేణి ఓమేష్, జిల్లా కన్వీనర్ రిషి, నాయకులు అరవింద్, అభి, రాకేష్, శ్రీనివాస్, ఉదయ్, పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఠాణా దివస్

- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్




ఇల్లంతకుంట, జూలై 4 (మనం న్యూస్) : ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజల వద్ద నుండి 56 అర్జీలు స్వీకరించి సమస్యల పరిష్కారం కోసం వెనువెంటనే అధికారులకు ఆదేశాలు అందజేయడం జరిగిందని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ఇల్లంతకుంట పోలీస్ స్టేషన్లో మంగళవారం రోజున 'ఠాణా దివస్' కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూప్రజలకు పోలీస్ లపై నమ్మకం కలిగేలా, దివ్యాంగులు, వృద్దులు,దూరప్రాంతల నుండి తన కార్యాలయనికి రాలేని వారి వద్దకే పోలీస్ సేవలు అందించాలనే ఉద్దేశ్యంతో 'ఠాణా దివస్' కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు.గ్రామాల్లో ఎప్పటికప్పుడు కమ్యూనిటీ పోగ్రామ్స్ నిర్వహిస్తు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారితో మమేకం అవుతూ గ్రామాలలో శాంతి భద్రతను పరిరక్షణకై కృషి చేస్తున్నామని అన్నారు.ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వయంగా స్వీకరించి వారి సమస్యలని అడిగి తెలుసుకుని అట్టి సమస్యల పరిష్కారం కోసం అధికారులను ఆదేశించడం జరిగిందని అన్నారు.భూతగాధాలలో క్రిమినల్ సమస్య ఉన్న ఫిర్యాదులలో ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని అధికారులను ఆదేశించామని తెలిపారు.,సివిల్ సమస్యకు సంబంధించిన పిర్యాదులను కోర్టు లో పరిష్కరించుకోవాలని దానికోసం లీగల్ సర్వీసెస్ అథారిటీ వాళ్ళతో అవగాహన కల్పిస్తాం అన్నారు.ఇరు వర్గాల మధ్య మధ్యవర్తిత్వం చేస్తూ సమస్యలు మేము పరిష్కరిస్తామని డబ్బులు వసూలు చేసే వారిపై మాకు ఫిర్యాదులు వస్తే చట్టపరపైన చర్యలు తీసుకుంటామని అన్నారు..శాంతి భద్రతలను కాపాడటానికి పోలీస్ శాఖ సమర్ధవంతంగా విధులు నిర్వహిస్తుదని,శాంతి భద్రతల కు విఘాతం కలిగిస్తే కఠినమైన చర్యలు తప్పవని,శాంతి భద్రతలను పరిరక్షించడంలో జిల్లా పోలీస్ శాఖకీలకంగావ్యవహరిస్తుం దన్నారు. ఈకార్యక్రమంలో సి.ఐ ఉపేందర్, ఎస్.ఐ రాజేష్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## జర్నలిస్టులు దేశానికి వెన్నెముక




మెట్ పల్లి ,జులై 04( మనం న్యూస్) : జర్నలిస్టులు దేశానికి వెన్నుముక లాంటి వాళ్ళని పట్టణంలోని జర్నలిస్టులకు కొమిరెడ్డి కుటుంబం అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే కొమిరెడ్డి రాములు కుటుంబ సభ్యులు కాంగ్రెస్ నాయకులు కొమిరెడ్డి రామ్ చందర్, కరమ్ చంద్, విజయ్ ఆజాద్‌లు అన్నారు. మంగళవారం పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన జర్నలిస్టుల సమావేశంలో మెట్ పల్లి ప్రెస్ క్లబ్ ప్రింట్ మీడియా అధ్యక్షులు ఆగ సురేష్,గౌరవ అధ్యక్షుడు దాసం కిషన్ లతో పాటు కార్యవర్గాన్ని కాంగ్రెస్ నాయకులు కొమిరెడ్డి రాం చందర్, కరమ్ చంద్, విజయ్ ఆజాద్‌లు సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టులు దేశానికి వెన్నుముక లాంటి వాళ్ళని జర్నలిస్ట్ ల సమస్యలపై మాజీ ఎమ్మెల్యే దివంగత నేత కొమిరెడ్డి రాములు పోరాటం చేసే వాడ న్నారు. జర్నలిజంచదివిన వ్యక్తిగా ఆయనకు జర్నలిస్టుల పైన అమితమైన ప్రేమ ఉండేదన్నారు. ఆయన పోరాట స్ఫూర్తిని పునికి పుచ్చుకున్న ఆయన వారసులుగా జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. అంతకు ముందు మాజీ ఎమ్మెల్యే దివంగత నేత కొమిరెడ్డి రాములు కు మెట్‌పల్లి ప్రెస్ క్లబ్ ప్రింట్ మీడియా సభ్యులు రెండు నిముషాలు మౌనం పాటించి నివాళులు అర్పించారు ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు భూరం సంజీవ్, మ్యాకల శివ, ఉపాధ్యక్షుడు మహ్మద్ అజీమ్, జంగం విజయ్, తరి రాజశేఖర్, అలలా రాజేష్, ఓంకారి శ్రీనివాస్, మదస్తు రాజేష్, పఠాన్ ఫిరోజ్ ఖాన్, మసూద్, హేమాద్, పింజరీ శివ కుమార్, బొల్లాం రాజు, కలిమ్, సజెబ్, మహ్మద్ సభియొద్దిన్,మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

## ఇంజనీరింగ్ విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

- బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర కో-ఆర్డినేటర్ రవి గౌడ్



సిరిసిల్ల టౌన్, జులై 04 (మనం న్యూస్): ర్యాంక్ తో సంబంధం లేకుండా బిసి ఇంజనీరింగ్ విద్యార్థులందరికీ పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర కో-ఆర్డినేటర్ కంచర్ల రవిగౌడ్ డిమాండ్ చేశారు. బిసి విద్యార్థి సంఘం సిరిసిల్ల డివిజన్ ఇంచార్జి ఇల్లందుల ప్రకాష్ అధ్వర్యంలో బిసి భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యకు పదివేల ర్యాంక్ నిబంధనను పూర్తిగా ఎత్తివేయాలన్నారు. నిరుపేద బిసి విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం చేసేందుకే ఈ నిబంధన విధించారని ఆరోపించారు. ఇంజనీరింగ్ విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ ను వెంటనే అమలు చేయాలని, లేని పక్షంలో బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ నాయకత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించనున్నట్లు హెచ్చరించారు. ఈ సమావేశంలో బిసి విద్యార్థి సంఘం నాయకులు నవీన్ కుమార్, మట్టె నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య

- జిల్లా కలెక్టర్ సంగీత సత్యనారాయణ



పెద్దపల్లి, జులై 4(మనం ప్రతినిధి) : తెలంగాణలో రైతులపై జరిగిన అకృత్యాలను ఎదురించి పోరాడి అమరుడైన తొలి వ్యక్తి దొడ్డి కొమురయ్య అని జిల్లా కలెక్టర్ సంగీత సత్యనారాయణ అన్నారు. సమీకృ త జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం బీసీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దొడ్డి కొమురయ్య వర్ధంతి వేడుకల కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లు వి.లక్ష్మీనారాయణ, కుమార్ దీపక్‌లతో కలిసి దొడ్డి కొమురయ్య చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్బంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణలో రైతులపై జరుగుతున్న అన్యాయాలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో అమరుడైన తొలి వ్యక్తి దొడ్డి కొమురయ్య అని కొనియా డారు. దొడ్డి కొమురయ్య మరణంతో రైతాంగ ఉద్యమం తెలంగాణ సాయుధ విప్లవంగా మారిందని గుర్తు చేశారు. ఈకార్యక్రమంలో జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి అధికారి రంగారెడ్డి, జిల్లా గ్రామీణాభి వృద్ధి అధికారి శ్రీధర్, కురుమ సంఘ సభ్యులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఉచిత నోట్ బుక్కుల పంపిణీ



చిగురుమామిడి, జులై4 (మనం న్యూస్) : చిగురుమామిడి మండలం బొమ్మనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోవిద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మండల ప్రాదేశిక సభ్యుల పోరం అధ్యక్షులు మిట్టపల్లి మల్లేశం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యార్థులకు రాయడానికి- చదువుకోవడానికి ప్రభుత్వం ఉచితంగా రెండు జతల యూనిఫామ్,పాఠ్య పుస్తకాలు ఉచితంగా అందిస్తుందని తెలిపారు. విద్యార్థులు ఇష్టం తో కష్టపడి చదువాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాను గంటి రాజమౌళి, ఉపాధ్యా యులు జ్యోత్స్న, గోవర్ధన్, శంకరమ్మ, శంకర్, ప్రతిమ అయిలయ్య, ప్రతిమ, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉమ్మడి జిల్లా ట్రెజరీ ఎన్జీవోల సమావేశం



కరీంనగర్, జులై 4 (మనం న్యూస్): ఉమ్మడి కరీంనగర్ జిల్లా ట్రెజరీ, ఎన్జీఓ ఉద్యోగుల సమావేశం ట్రెజరీ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కొండయ్య ఆధ్వర్యంలో మంగళవారం కరీంనగర్ జిల్లా ట్రెజరీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిధులుగా హాజరైన ట్రెజరీ డిప్యూటీ డైరెక్టర్ నాగరాజ్, టిఎన్జిఓ జిల్లా అధ్యక్షులు దారం శ్రీనివాస్ రెడ్డి హాజరైనారు. సమావేశంలో ట్రెజరి ఉద్యోగులు తమ సమస్యలను తెలిపి పరిష్కరించే విధంగా కృషి చేయాలని కోరారు. అనంతరం టిఎన్జిఓ జిల్లా అధ్యక్షులు దారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడానికి సంఘం ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మామిళ్ళ రాజేందర్, మారం జగదీశ్వర్‌లు ముఖ్యమంత్రి కెసిఆర్ దృష్టికి తీసుకువెళ్లి నిరంతరం ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారన్నారు. అతి త్వరలోనే ఉద్యోగుల సమస్యలన్నీ టిఎన్జిఓల రాష్ట్ర నాయకుల సారథ్యంలోనే పరిష్కరామవుతాయన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన టిఎన్జిఓ జిల్లా కార్యవర్గాన్ని ట్రెజరీ డిప్యూటీ డైరెక్టర్ నాగరాజు, ఏటి ఓ రాజయ్య, ఎస్‌టిఓ జరీ, ఉమ్మడి కరీంనగర్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముప్పిడి కిరణ్ కుమార్, రాగి శ్రీనివాస్, రజేష్, భరద్వాజ్ ,నేరెళ్ల కిషన్ ,కొండయ్య, రంజిత్,శ్రీధర్, ట్రెజరీ ఉద్యోగులు పాల్గొన్నారు.

## యువకుల నిండు ప్రాణాలను బలిగొన్న ఇసుక ట్రాక్టర్

- ముగ్గురు యువకుల దుర్మరణం



తిమ్మాపూర్, జులై 04 (మనం న్యూస్) :కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం రేణికుంట బ్రిడ్జి సమీపంలోని రాజీవ్ రహదారిపై బైక్‌ను ఇసుక ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో ముగ్గురు యువ కులు దుర్మరణం పాలయ్యారు. బైక్‌పై వెళుతున్న ముగ్గు రు యువకులను వెనుక నుంచి వేగంగా వచ్చిన ఇసుక ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో ఒక యువ కులు అక్కడికక్కడే మృతి చెం దగా, మరో ఇద్దరు యువకులు ఆస్పత్రిలో చికిత్స పొం దుతూ మరణించారు. పోలీసుల కథనం మేరకు సోమవారం రాత్రి కరీంనగర్ వైపు వస్తోన్న ఎపి 15 బిఎన్ అనే నంబరు గల ఇసుక ట్రా క్టర్ అతి వేగంగా వచ్చి అదే వైపు వెళుతున్న కరీంనగర్ జిల్లా చిగురు మామిడి మండలం రామంచ గ్రా మానికి చెందిన గుడ్డి పల్లి అర వింద్(25), శివరాత్రి సంప త్(19), శివరాత్రి అంజి (25)లు ప్రయాణిస్తో న్న పల్సర్ బైక్‌ను వెనుక వైపు నుంచి ఢీకొంది. ఈ ఘటనలో అరవింద్ అక్క డికక్కడే మృత్యువాతపడగా, సంపత్, అంజిలు ఆస్పత్రిలో చికి త్స పొందుతూ మంగళవారం ఉదయం మరణించారు. ఈ ప్రమాద ఘటనపై మృతుడు శివరాత్రి సంపత్ తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రమోద్ రెడ్డి తెలిపారు.

## లాభాల వాటా ప్రకటించాలి

రామకృష్ణాపూర్,జూలై 04 (మనం న్యూస్): ఆర్కే1ఏ గని పైన ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించిన గేట్ మీటింగ్ లో రామకృష్ణాపూర్ బ్రాంచి సెక్రటరీ ఎండీ అక్బర్ అలీ మాట్లాడుతూ కార్మికులకు లాభాల వాటావెంటనే ప్రకటించాలని, 11వ వేజ్ బోర్డ్ ఏరియర్స్ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. 11వ వెజ్ బోర్డులో పెరిగిన జీతాలలోఇన్కమ్ టాక్స్ ఎక్కువ కట్ అవుతుందని వెంటనే గుర్తింపు సంఘం,రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని అధికారులకు ఇన్కమ్ టాక్స్ పై పెరెక్స్ ఎలాగైతే ఇస్తున్నారో కార్మికులకు కూడా రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాలని డిమాండ్ చేశారు.కాంట్రాక్ట్ కార్మికులకు హై పవర్ వేతనలు చెల్లించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచి నాయకులు సిద్ధం బాబు,ఆర్కే1ఏ పిట్ సెక్రటరీ సురమల వినయ్ కుమార్,కమిటీ సభ్యులు సుంకర గట్టయ్య, సిహెచ్ రమేష్,కొత్త గిరి ప్రసాద్,శ్రీనివాస్, గాజులు రాయమల్లు,బొంకూరు సురేష్ తదతరులు పాల్గొన్నారు.

# ఖచ్చితమైన యాక్షన్ ప్లాన్‌తో స్వచ్ఛ్ సర్వేక్షణ్ పూర్తి చేయాలి

- అదనపు కలెక్టర్ అభిలాష అభినవ్



మహబూబాబాద్, జూలై 4(మనం ప్రతినిధి): పటిష్టమైన చర్యలతో స్వచ్ఛ్ భారత్ మిషన్ కార్యక్రమాన్ని గ్రామాలలో అమలు చేయాలని అదనపు కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మహబూబాబాద్ డివిజన్ ఎంపిడివో, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాలలో పచ్చదనం పరిశుభ్రతకు పటిష్టమైన చర్యలు చేపట్టి ప్రజలకు అవగాహన కల్పించి పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. గ్రామాలలో ఎప్పటికప్పుడు చెత్తను రోజువారీగా సేకరించి డంపింగ్ యార్డులో వేయాలని, మురికి నీరు నిల్వ ప్రదేశాలను గుర్తించి నీరు నిల్వకుండా చర్యలు చేపట్టాలని, రానున్న వర్షాకాలానికి అనుగుణంగా ముందస్తు జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, త్రాగునీరు ఇబ్బందిలేకుండా చూసుకోవాలని, కాచి వడబోసిన నీటినే త్రాగే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని ఎప్పటికప్పుడు రికార్డులను అప్డేట్ చేయాలని నివేదికలను అధికారులకు అందజేయాలని, పూర్తయిన వైకుంఠదామాలలో విద్యుత్ సరఫరాకు కనెక్షన్లను ఇచ్చే విధంగా విద్యుత్ శాఖ అధికారుల సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ఇంకా సొంతంగా గ్రామ పంచాయితీ భవనాలు లేని వాటి నివేదికలను అందజేయాలన్నారు. రానున్న 15 రోజులలో స్వచ్ఛ భారత్ మిషన్ పనుల పర్యవేక్షణ కు కేంద్ర బృందం జిల్లాలో పర్యటించ నున్నందున గ్రామ పంచాయతీలలో జరిగిన అభివృద్ధి పనులపై ర్యాంకింగ్ ఇవ్వనున్న సందర్భంగా గ్రామపంచాయతీలలో అన్ని మౌలిక సదుపాయాలతో కార్యక్రమాలు చేపట్టాలని ప్రతీ ఇంటిలో స్వచ్ఛత ప్యారామీటర్ పాటించే విధంగా చూడాలని, సెగ్రిగేషన్ షెడ్డులలో కంపోస్టు తయారీ పనులను పర్యవేక్షించాలని, గ్రామపంచాయతీ లలోని అనువైన స్థలాల్లో గోడలకు స్వచ్ సర్వేక్షణ్ పెయింటింగ్ పనులను చేపట్టాలని, గ్రామ పంచాయతీ పాఠశాలల్లో టాయిలెట్స్ అందుబాటులో ఉండేలా, పాఠశాలల్లో, అంగన్వాడీ కేంద్రాలనుండి, ప్రభుత్వ సంస్థల నుండి చెత్త సేకరణ జరిగే విధంగా చూడాలని, కమ్యూనిటీ సోక్ పిట్ లను ఏర్పాటు చేసుకోవాలని అందుకు సంబంధించిన ప్రతీ రికార్డును రిజిస్టర్ ను తయారు చేసి పెట్టుకోవాలని గ్రామాల వారీగా విచారణలో భాగంగా కేంద్ర బృదం అభివృద్ధి పనులకు మార్కులు కేటాయిం చడం జరుగుతుందని కావున అధికారులు, పంచాయతీ కార్యదర్శులు ప్రతీ పనిపై దృష్టి సారించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డి.ఆర్. డి.ఓ సన్యాసయ్య, జడ్పి సీ.ఈ.ఓ.రమాదేవి, డి.పి.ఓ నర్మద, వివిధ మండలాల ఎంపిడీవోలు, ఎంపీవో లు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

## రిజర్వుబ్యాంకు ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై క్విజ్ పోటీలు

- లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఆర్.సత్యనారాయణ మూర్తి



మహబూబాబాద్, జులై 4(మనం ప్రధాన ప్రతినిధి): జి.20 సన్నాహక సదస్సుల్లో భాగంగా దేశవ్యాప్తంగా ఆర్థిక అక్షరాస్యత పై రిజర్వుబ్యాంక్ వారు రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన క్విజ్ పోటీలను జిల్లాలో మంగళవారం పట్టణంలోని పోస్ట్ ఆఫీసు పక్కన గల జడ్పిహెచ్ఎస్ బాలికల పాఠశాలలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఆర్.సత్య నారాయణ మూర్తి ఆధ్వర్యంలో 8వ తరగతి నుండి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్.డి.ఎం మాట్లాడుతూ ఈ క్విజ్ కార్యక్రమంలో గ్రూపుకు ఇద్దరు చొప్పున విద్యార్థులు 8 గ్రూపులలో పాల్గొన్నారని అందులో విజేతలుగా నిలిచిన ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలోని గ్రూపుల విద్యార్థులకు 10వేలు, 7500, 5వేల రూపాయల చొప్పున నగదు బహుమతులను, ధ్రువపత్రాలను ఆర్బీఐ అధికారి నితీష్ అందజేశారు. ఇందులో ప్రథమ స్థానంలో నిలిచిన విజేతను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ఎల్.డి.ఎం ఆర్.సత్యనారాయణ మూర్తి తెలిపారు.ఈ కార్యక్రమంలో ఫైనాన్షియల్ కౌన్సిలర్ ఎస్.రమేష్, సి.ఎఫ్.ఎల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ డ్రైవర్‌గా అవార్డు అందుకున్న రామగిరి మురళి




తొర్రూర్, జూలై 4 (మనం న్యూస్): తొర్రూర్ డిపో నుండి ఉత్తమ డ్రైవర్‌గా రామగిరి మురళి మంగళవారం హైదరాబాదులో బస్ భవన్ యందు ఆర్టీసీ ఎండి సాజ్జనార్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ తాను అవార్డుకు ఎంపికైనందుకు చాలా గర్వంగా ఉందన్నారు నా విధి నిర్వహణలో భాగంగా ప్రయాణికులను సురక్షిత ప్రాంతాలకు తరలించానన్నారు. తోటి డ్రైవర్ల కంటే నేను ప్రయాణించే మార్గంలో సంస్థకు లాభాలు తీసుకువచ్చానని డ్యూటీ సమయానికంటే ముందే డిపోకు చేరుకుంటానన్నారు బస్సుకు ఎటువంటి ప్రాబ్లం వచ్చిన దగ్గరుండి మెకానిక్‌లతో చేయించుకుంటానన్నారు మెకానిక్ లతో స్నేహంగా ఉంటానని సంస్థ బాగుంటేనే మేము బాగుంటామని అన్నారు. ఈ అవార్డు వచ్చిన సందర్భంగా తోటి డ్రైవర్లు కండక్టర్లు సంతోషాన్ని వెళ్ళబుచ్చారు.

## జనాభా పెరుగుదలపై అవగాహన కల్పించాలి

మహబూబాబాద్, జూలై 04 (మనం ప్రతినిధి): ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ర్యాలీలు నిర్వహించి ప్రజలకు జనాభా పెరుగుదలపై అవగాహన కల్పించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ హరీష్ రాజ్ అన్నారు. మంగళవారం ఐడిఓసి లోని వైద్యశాఖ కార్యాలయంలో 11-07-2023న ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని వైద్యాధికారులకు, సూపర్వైజర్ సిబ్బందికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి హరీష్ రాజ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం.సి.ఎచ్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఉమా గౌరీ, మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ర్యాలీలు చేపట్టాలని, జనాభా పెరుగుదల గురించి అవగాహన కల్పించాలని, తాత్కాలిక పద్ధతిలు మరియు పర్మినెంట్ పద్ధతులపై అవగాహన కల్పించాలని, మొదటి కాన్పు రెండవ కాన్పు మధ్య ఎడమ ఉండేలాగా, తాత్కాలిక పద్ధతులు వాడేలాగా అవగాహన కల్పించాలని, ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజ్ కుమార్ , ఇంచార్జి డిప్యూటీ డెమో కెవి రాజు,హెల్త్ ఎడ్యుకేటర్ మహేందర్ రెడ్డి, డీపీఎంఓ రుక్ముద్దీన్, పురుషోత్తం, వైద్యాధికారులు మరియు హెల్త్ సూపర్వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

## మహిళలపై ప్రభుత్వ నిర్బంధం ఆపాలి

- మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తాం
- పది మంది మహిళలపై కేసులు పెట్టి జైలుకు పంపుతారా
- ఇది ధర్మమేనా
- కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు సాదుల శ్రీనివాస్




మహబూబాబాద్, జూలై 04(మనం న్యూస్) : గూడు లేని పేదలు గూడు కోసం గుడిసెలు వేసుకుంటే ప్రభుత్వ అధికారులు పీకేసి వారిపై దాడులకు పాల్పడి కేసులు బనాయించి అర్ధరాత్రి జైలుకు పంపించడం దుర్మార్గమైన చర్యని కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు సాధుల శ్రీనివాస్ హెచ్చరించారు. మంగళవారం స్థానిక తిరుమల జగన్నాథం భవనంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సాదుల శ్రీనివాస్ మాట్లాడుతూ. ప్రభుత్వ భూములు రియల్ స్టేట్ వ్యాపారులు ఆక్రమించుకుంటే వాటిని వెలికి తీసి గుడిసెలు వేసుకున్న తర్వాత నువ్వు కబ్జాదారులకు వత్తాసూ పలుకుతూ ఇది ప్రభుత్వ భూమి అని బోర్డులు పెట్టి పేద ప్రజల గుడిసెలు కూల్చడం ఎంతవరకు సమంజసమని అన్నారు. పేదల గుడిసెలు వేసుకోకపోతే ఆ భూములు ప్రభుత్వం కాకుండా రియల్ వ్యాపారుల చేతికి పోయేవని అన్నారు. రియల్ ఎస్టేట్ అధికారులకు వత్తాసు పలుకుతూ పేదలపై విరుచుకోవడం ప్రభుత్వ అధికారులకు ఎందుకు ఇంత కక్ష సాధింపు చర్యగా తీసుకుంటున్నారని అన్నారు. పేదలు గత ఆరు నెలలుగా శాంతియుతంగానే పోరాడుతున్నారని ఎప్పుడైనా కూడా ఎదురు తిరగలేదని అన్నారు. నిన్న జరిగిన ఘర్షణలో రియల్ టర్ల ఏజెంట్లు ఎక్కడి నుంచో రాళ్లు విసిరినందుకు గుడిసే వాసులపై విరుచుకు పడడం సోచనియమన్నారు. వాసులు ఏనాడు కూడా ఘర్షణలకు పాల్పడలేదని సామరస్యంగానే పోరాడుతున్నారని అన్నారు. ప్రభుత్వం ప్రభుత్వ ఆఫీసుల కొరకని పేదలు వెలికి తీసిన భూమిలో ఆఫీసులు పెడతాము అని చెప్పడం ఎంతవరకు సమంజసం అని విమర్శించారు. వాళ్లే గుడిసెలు చేసుకోకపోతే ఆ భూములు ఎవరి చేతులకు వెళ్లేవో ప్రజలు ప్రజాసామిక వాదులు అర్థం చేసుకోవాలని గుడిసె వాసులకు మద్దతు తెలియజేయాలని కోరారు. కొంతమంది అధికారులు గతంలో 2021లో అంబేద్కర్ భవనం కొరకు స్థలం కేటాయింపు చేశామని ఆర్డర్ను చూపిస్తూ పేదలు వేసుకున్న గుడిసెలలో అంబేద్కర్ భవనం కట్టాలని అంబేద్కర్ సంఘాలను పేద ప్రజలకు తగువు పెట్టించే విధంగా పథకం వేస్తున్నారని అన్నారు. అంబేద్కర్ భవనం కూల్చివేత ఏనాడు జరిగింది ఇప్పటివరకు ఎందుకు కేటాయించలేదు ఇది సిగ్గుచేటు కాదా సంఘాల నాయకులు నిలదీయాలని అన్నారు. మహిళలపై ఇంత ఆగాయిత్యం జరుగుతుంటే మహిళా ప్రజాప్రతినిధులు ఉండి కూడా స్పందించకపోవడం విచారకరమైన విషయం అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఐదువేల ఎకరాల అసైన్డ్ భూములు ఉన్నాయని అవి ఎవరికి అసైన్డ్ చేశారో మిగులు భూమి ఎంత ఉందో శ్వేత పత్రం విడుదల చేయాలని అధికారులను కోరారు. ఎస్సీ ఎస్టీలకు అసైన్డ్ చేసిన భూములను కూడా పోడు చేయడం లేదని సాకుతో ప్రభుత్వ కార్యాలయాలకు లాక్కుంటున్నారని విమర్శించారు. అట్టి భూములకు ప్రభుత్వ స్థలాలుగా బోర్డులు ఏర్పాటు చేయాలని అన్నారు. ఇప్పటికైనా ఇలాంటి చర్యలకు స్వస్తి చెప్పకపోతే మానవ హక్కుల కమిషన్ కు సిఫారసు చేస్తామని హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో జిల్లా నాయకులు సూర్ణపు సోమయ్య ప్రజా సంఘాల జిల్లా నాయకులు గునిగంటి రాజన్న అల్వాల వీరయ్య ఆకుల రాజు భానోత్ సీతారాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## రేపటి నుండి జీపీ సిబ్బంది నిరవధిక సమ్మె



- ఎంపీడీవోకు సమ్మె నోటీస్ ఇచ్చిన యూనియన్ నేతలు

మరిపెడ, జూలై 4(మనం న్యూస్): తెలంగాణ గ్రామ పంచాయతీ సిబ్బంది, అండ్ కారోబార్ల, బిల్ కలెక్టర్ మల్టీపర్పస్ వర్కర్లు సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జులై 6 నుండి నుండి రాష్ట్ర వ్యాప్తంగా గ్రామపంచాయతీ సిబ్బంది సమ్మె సైరన్ మోగనించినట్లు మరిపెడ మండల గ్రామపంచాయతీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నేతలు ప్రకటించారు. మంగళవారం మరిపెడ మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవోకు కెదన్ సింగ్‌కు సమ్మె నోటీసును అందజేశారు. అనంతరం జరిగిన సమావేశంలో సంఘం మండల కార్యదర్శి అలవాల యాదగిరి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 50 వేల మంది గ్రామపంచాయతీ సిబ్బంది ఉన్నారని వారు గత అనేక ఏళ్ల నుండి చాలీచాలని వేతనాలతో పని చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వచ్చిన తర్వాత 51వ జీవో తీసుకువచ్చిందన్నారు. ఆ జీవో ద్వారా మల్టీపర్పస్ వర్కర్స్ సిబ్బందితో కలిసి కారోబార్లు కూడా పనిచేయాలని పెట్టిన నిబంధనాలను ఉపసంహరించుకోవాలని ప్రభుత్వానికి గతంలో కోరినట్లు వారు తెలిపారు. 10దేళ్లయిన ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. సీనియర్ గ్రామపంచాయతీ సిబ్బంది కారోబార్లను గుర్తించి వారికి అసిస్టెంట్ కార్యదర్శిగా పోస్టింగ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంతేగాక సిబ్బందికి 15,500 రూపాయల వేతన ఇవ్వాలని కారోబర్లకు 19,500 కనీస వేతనం కింద చెల్లించాలని కోరినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో బంగారు తెలంగాణగా తీర్చిదిద్దడానికి గ్రామ పంచాయతీ సిబ్బంది చేసిన కృషి అంత ఇంత కాదన్నారు. పల్లెల్లో సుందరంగా తీర్చిదిద్దిన మాకు కడుపులుకాలి ఆకలితో అలమటిస్తున్నామని ఆవేదన చెందారు. పీఎఫ్ ఈఎస్ఐ,ఇవే కాక ఇతర సమస్యలతో పాటు మా డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. సమస్యల సాధన కోసం మే 5 నుండి రాష్ట్రవ్యాప్తంగా సమ్మెకు వెళుతున్న సందర్భంలో ప్రజలు మమ్ములను అర్థం చేసుకొని మాకు సహకరించాలని కోరారు. ఈ కార్య క్రమంలో తెలంగాణ గ్రామ పంచాయతీ కారోబార్ల, సిబ్బంది యూనియన్ మండల కార్యదర్శి అలవాల యాదగిరి, మండల ఉపాధ్యక్షులు గుగులోతు నరేష్, కోశాధికారి గంగుల మహేష్, నాయకులు ఎ వేణుగోపాల చారి, ఆర్ వెంకన్న, జి నగేష్, ఎం యాకయ్య, ఏ నర్సయ్య తదితరులు ఉన్నారు.

## బహుజన రాజ్యస్థాపన కోసం యువత ముందుండాలి

- బిఎస్పీ జిల్లా కార్యదర్శి ఐనాల పరశురాములు



మరిపెడ, జూలై 4(మనం న్యూస్): బహుజన రాజ్యస్థాపనకోసం యువత ముందుండాలి. అక్షరం, ఆరోగ్యం, ఆర్థికం ఆరెస్పి లక్ష్యం అని బిఎస్పీ జిల్లా కార్యదర్శి, డోర్నకల్ అసెంబ్లీ ఇంచార్జ్ ఐనాల పరశురాములు పిలుపునిచ్చారు. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ అసెంబ్లీ మరిపెడ మండలంలోని ఉల్లేపల్లి గ్రామంలో బహుజన్ సమాజ్ పార్టీ గ్రామ జనరల్ బాడీ సమావేశం ఎడ్ల లక్ష్మణ్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి బిఎస్పీ జిల్లా కార్యదర్శి, డోర్నకల్ అసెంబ్లీ ఇంచార్జ్ ఐనాల పరశురాములు ముఖ్యఅతిధిగా పాల్గొని ఆయన మాట్లాడుతూ భారత దేశానికి స్వాత్రంత్రం వచ్చి ఎనమిది దశాబ్దాలు పూర్తయిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో కేవలం తక్కువ జనాభా కలిగిన బ్రాహ్మణులు రెడ్లు, కమ్మలు, వెలమ దొరలు మాత్రమే పదే పదే అధికారం మార్పిడి చేసుకొంటూ పాలిస్తున్నారని అధిక జనాభా కలిగిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మత మైనారిటీలు, అగ్రకుల పేదలకు ఒరిగింది సూన్యం అని, మళ్ళీ అధికార మార్పిడి కోసం రెడ్లు ఏకమవుచున్నారని స్థానిక ప్రజాప్రతినిధులను నడిపేది దొరలేనని వారి పాలనను పాతరేయుటకు బహుజనులు ఏకం కావాలని అన్నారు. డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ నాయకత్వంలొ సబ్బండా జాతులు ఏకమై బహుజన రాజ్యం సాధించుకొని జనాభా ప్రాతిపధికన రాజ్యాధికారన్ని అనుభవించాలని అన్నారు.అనంతరం రెండు బూత్ కమిటీలను నియమించడం జరిగింది. ఈకార్యక్రమంలో బిఎస్పీ మరిపెడ మండల అధ్యక్షులు జినక కృష్ణమూర్తి, గ్రామ నాయకులు మేడెబోయిన నాగరాజు యాదవ్, దుద్ధిమెట్ల లింగన్న యాదవ్, గుమ్మడి శ్రీకాంత్, గోరెంట్ల పూర్ణచందర్, గుండ్ల శ్యాంసుందర్ పద్మశాలి, మంచ గణేష్ యాదవ్, ఊళ్లోజ్ మహేష్,నవీతే అప్పారావు, కంచనపల్లి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## 8న చలో వరంగల్ బహిరంగ సభను విజయవంతం చేయండి

- బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పెదగాని సోమయ్య



పెద్దవంగర, జులై 4, (మనం న్యూస్) : జూలై 8వ తారీఖున భారత ప్రధాని నరేంద్ర మోడీ వరంగల్ పర్యటనకు వస్తున్నారని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పెదగాని సోమయ్య అన్నారు. మంగళవారం రోజున మండల కేంద్రంలోని బిజెపి కార్యాలయంలో మండల అధ్యక్షులు బొమ్మరబోయిన సుధాకర్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న పెదగాని సోమయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో బిఆర్ఎస్ ప్రభుత్వం అవలంబిస్తున్న వ్యతిరేక విధానాలను ఎండగట్టారు. రాబోయే రాజుల్లో డబుల్ ఇంజన్ సర్కారు రావడం ఖాయమని అభివృద్దే ధ్యేయంగా బిజెపి పని చేస్తుందని వ్యాఖ్యానించారు. ప్రతి ఒక్కరూ 8వ తారీఖున వరంగల్ లో జరిగే ప్రధానమంత్రి మోడీ భారీ బహిరంగ సభకు తరలిరావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు లేక రామ్మోహన్ రెడ్డి, పాలకుర్తి అసెంబ్లీ కన్వీనర్ పూసాల శ్రీమాన్, మండల సోషల్ మీడియా కన్వీనర్ కట్టోజ్ భాస్కర్, ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షులు తలారి సోమయ్య, నాయకులు జలగం ఆనంద్, జాటోత్ శంకర్, సాయిని రవి, విజయ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అనిషాకు చిక్కిన పంచాయితీ రాజ్ శాఖ అవినీతి చేప

- లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ఏఈ



పెద్దవంగర, జులై 4, (మనం న్యూస్): 5000 లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు పంచాయత్ రాజ్ శాఖ ఏఈ దొడ్డ లలిత చిక్కారు. మంగళవారం రోజున మండలంలోని కన్వాయిగూడెం గ్రామానికి చెందిన కర్ర అశోక్ రెడ్డి అనే వ్యక్తి గ్రామంలో వైకుంఠధామం నిర్మాణానికి రూ 12. లక్షల 60వేలకు సంబంధించిన బిల్లు చేయడానికి పంచాయతీ రాజ్ శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దొడ్డ లలిత 5 వేలు ఇస్తేనే బిల్లు చేస్తాను అనడంతో బాధితుడు అవినీతి నిరోధక శాఖ అధికారులను ఆశ్రయించగా మేము సంబంధిత శాఖ అధికారిని రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నామని ఎసిబి డిఎస్పీ సుదర్శన్ గౌడ్ తెలిపారు.

## రైతాంగ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్యకు ఘన నివాళి



పెద్దవంగర, జులై 4, (మనం న్యూస్) : తెలంగాణ రైతన్న సమస్యల గురించి పోరాటం చేసిన తొలి అమరుడు దొడ్డి కొమురయ్య 77వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. మంగళవారం రోజున మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో యాదవ బాంధవులందరూ రైతు అమరుడు అయిన దొడ్డి కొమురయ్యను స్మరించుకుంటూ ఆయన యొక్క 77వ వర్ధంతి వేడుకను ఘనంగా నిర్వహించారు, ఆయన బాటలో నడవడానికి ప్రతి ఒక్క రైతు ముందు ఉంటాడని అన్నారు, ఈ కార్యక్రమంలో మండల యాదవ సంఘం అధ్యక్షులు బొమ్మరబోయిన రాజు యాదవ్, బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు ఈదురు ఐలయ్య, శ్రీరామ్ సుధీర్, పల్లె కొమురయ్య యాదవ్, ఏరసాని రామ్మూర్తి యాదవ్,సుభాష్ చంద్రబోస్, ఎరుకల సమ్మయ్య, రెడ్డబోయిన గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

## కలువల మోడల్ స్కూల్ నుండి ఐఐఐటికి ఎంపికైన రసాజ్ఞ




కేసముద్రం, జూలై 4 (మనం న్యూస్): కలువలలోని ఆదర్శ పాఠశాలకి చెందిన విద్యార్థిని గొట్టం రసజ్ఞ బాసరలో ట్రిపుల్ ఐటీ కి ఎంపిక అయ్యింది. రసజ్ఞ ఎంపిక పట్ల తన తండ్రి, ఆదర్శ పాఠశాల ఎస్ఎంసి ఛైర్మెన్ లక్ష్మి నారాయణ సంతోషం వ్యక్తపరిచారు. మంగళవారం పాఠశాలలో రసజ్ఞను ప్రిన్సిపల్, ఉపాధ్యాయ బృందం మోమెంటోతో సత్కరించారు. ఎస్ఎంసి చైర్మన్ గొట్టం లక్ష్మినారాయణ మాట్లాడుతూ తమ కూతురు రసజ్ఞ విజయానికి కారణమైన ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు.



## నగల దుకాణంలో చోరీ..

- రూ.12 లక్షల విలువ చేసే ఆభరణాలు మాయం
- రంగంలో కి దిగిన క్లూస్ టీం
- త్వరలో దొంగలను పట్టుకుంటాము సి.ఐ అశోక్

చర్ల, జూలై 4 (మనం న్యూస్) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలకేంద్రంలో యూనియన్ బ్యాంక్ ఎదురుగా ఉన్నటువంటి శ్రీ హనుమాన్ జ్యువెలరీలో దొంగలు పడ్డారు. సోమవారం రాత్రి సుమారు తొమ్మిది గంటల సమయంలో షాపు వెనుక భాగంలో ఉన్న తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లి దుండగులు వెండి కేజి, రెండు వందల గ్రాముల బంగారంను అపహరించుకపోయారు. విషయం తెలుసుకున్న యజమాని స్థానిక పోలీస్ స్టేషన్‌కి సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి పోలీస్ సిబ్బంది సిసీ కెమెరాలను పరిశీలించగా ఇద్దరు ముసుగులు వేసుకున్న వ్యక్తులు దొంగతనానికి పాల్పడినట్లు తెలిలిపారు.జ్యువెలరీ షాప్‌లో సుమారు పదిలక్షల డెబ్బై వేల రూపాయల నగలు అపహరించినట్టు షాపు యజమాని లక్ష్మనాచారి తెలిపారు. స్థానిక సిఐ బి.అశోక్, ఎస్సైలు సూరీ, వెంకటప్పయ్య సంఘట స్తాలానికి చేరుకొని దొంగతనం జరిగిన ప్రదేశాలను పరిసీలించారు. సిఐ బి.అశోక్ క్లూస్ టీం వారికి సమాచారం అందించగా కొత్తగూడెం నుంచి వచ్చిన క్లూస్ టీం వారు దొంగతనం జరిగిన ప్రదేశాలను ఇంటి వెనకాల భాగం తలుపులను అన్నిటినీ పరిశీలించి వేలిముద్రల నమూనాలను సేకరించారు. సిఐ బి.అశోక్ మాట్లాడుతూ కేసు దర్యాప్తు చేస్తున్నాము.నిందితులను వీలైనంత త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు.

## కూపన్ల పేరుతో విచ్చలవిడిగా ఇసుక దందా

అన్నపురెడ్డిపల్లి, జూలై 4(మనం న్యూస్): అన్నపురెడ్డిపల్లి మండలం అబ్బుగూడెం గ్రామంలో గత కొంతకాలంగా కూపన్ల పేరుతో విచ్చలవిడిగా ఇసుక దందా సాగుతోంది. గృహ నిర్మాణాలు ఇతర నిర్మాణలకు అవసరమగు ఇసుకను..వ్యాపారంగా మలుచుకొని. అధిక ధనార్జనే ధ్యేయంగా వివిధ ప్రాంతాలకు తరలిస్తూ ట్రాక్టర్ల యజమానులు కొంతమంది దందా నడిపిస్తున్నారు.ప్రశ్నించిన వారికి తహశీల్దార్ నుంచి కూపన్లు తీసుకున్నామంటూ సాకులు చెబుతూ వ్యాపారం సాగిస్తున్నారు. ఇసుక తరలింపు విషయంపై సంభందిత అధికారులను వివరణ కోరగా సరైన స్పందన ఉండట్లేదు. విచ్చలవిడి ఇసుక దందా వ్యాపారం వైపు అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్న తీరుపై ముడుపులు మూడుతున్న ఏమో అన్న అనుమానాలు వ్యక్తపరుస్తున్నారు పలువురు గ్రామస్తులు.ఇసుక మాఫియాను అధికారులు అడ్డుకోకపోతే రానున్న రోజుల్లో పారుదల సాగే వాగులో ఎక్కడపడితే అక్కడ గుంతలు ఏర్పడి భూమి వరదకోతకు గురవ్వాల్సి వస్తుందని. భూగర్భ జలాలు దెబ్బతినే పరిస్థితులు ఏర్పడతాయని ప్రమాదం జరగ ముందే ఇసుక మాఫియా ను అరికట్టాలని. గ్రామ ప్రజలు కోరుకుంటున్నారు.

## నవోదయ 6వ తరగతిలో ప్రవేశం కోసం దరఖాస్తుల ఆహ్వానం



భద్రాద్రి కొత్తగూడెం, జూలై 4 (మనంప్రతినిధి) : జవహర్ నవోదయలో 6వ తరగతిలో ప్రవేశం కొరకు ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ తెలిపారు. నవోదయ పాఠశాలల్లో 6వ తరగతిలో ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ అయిన నేపథ్యంలో ప్రభుత్వ మరియు ప్రభుత్వ గుర్తింపు పొందిన అన్ని యాజమాన్యాల పాఠశాలలలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులకు 2024-25 సంవత్సరానికి 6వ తరగతి లో ప్రవేశం కొరకు జవహర్ నవోదయ విద్యాలయ ఎంపిక పరీక్ష 2024 కు దరఖాస్తు చేసుకోవాలని ఆయన చెప్పారు. ఆన్ లైన్ ద్వారా దరఖాస్తు చేయడానికి చివరి తేదీ ఆగస్టు 10 వరకు ఉన్నట్లు చెప్పారు. మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు ప్రభుత్వ మరియు ప్రభుత్వ గుర్తింపు పొందిన అన్ని యాజమాన్యాల పాఠశాలల నుండి ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుండి ఎక్కువ మంది విద్యార్థులు ఈ ప్రవేశ పరీక్షకు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఆన్లైన్ డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ. నవోదయ. జీవోవి. ఐయన్ దరఖాస్తు చేయు అంశంపై అన్ని పాఠశాలలు ఉపాధ్యాయులు విద్యార్థులకు, వారి తల్లి తండ్రులకు అవగాహన కల్పించాలని ఆయన స్పష్టం చేశారు..

## పోడు భూమి పట్టాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే పొదెం వీరయ్య



భద్రాచలం, జూలై 4( మనం న్యూస్) : దుమ్ముగూడెం మండలం దబ్బనుతల గ్రామంలో అర్హులైన పోడు భూములు సాగు చేసుకునే గిరిజన లబ్ధిదారులకు పోడు భూముల పట్టాలను ఎంఎల్ఏ పొదెం వీరయ్య పంపిణీ చేశారు. గ్రామంలో 74 మంది లబ్ధిదారులకు పోడు భూముల పట్టాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఏ వెంట దుమ్ముగూడెం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లంకా శ్రీనివాస్ రావు సీనియర్ కాంగ్రెస్ నాయకులు బైరెడ్డి సీతారామారావు,దర్శి సాంబశివరావు గారు పిలుక వెంకటరమణారెడ్డి,నారాయణమూర్తి, రామచిట్టి,అప్పల్ రెడ్డి,ఎంపీపీ, జడ్పీటీసీ,దేవా, ఉబ్బ వేణు, తెల్లం నరేష్, సతీష్, వేమన రెడ్డి, కోడి చంటి, సమ్మయ్య,వెంకయ్య చౌదరి, గుమ్మడి శ్రీను, సుందర్ తదితరులు పాల్గొన్నారు.

# పోడు భూములకు పట్టాలు శాశ్వత హక్కు

- పోడు భూములకు పట్టాలు శాశ్వత హక్కు
- పెనుబల్లి మండలంలో 901 మంది రైతులకు పట్టాలు పంపిణీ
- పాల్గొన్న కలెక్టర్ విపి గౌతమ్, ఎంఎల్ఏ సండ్ర వెంకట వీరయ్య



ఖమ్మం/పెనుబల్లి, జూలై 4(మనం న్యూస్): పోడు భూములకు ప్రభుత్వం ఇచ్చే పట్టాలు శాశ్వత హక్కుగా, భావితరాలకు భద్రతగా జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. మంగళవారం పెనుబల్లి మండల కేంద్రంలోని సప్తపది గార్డెన్స్‌లో సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య తో కలిసి పెనుబల్లి మండలంలోని 12 గ్రామాల 901 మంది పోడు రైతులకు సంబంధించి 1437.275 ఎకరాల పట్టా పాస్ పుస్తకాల పంపిణీని కలెక్టర్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2005 లో ఆటవీహక్కుల చట్టం క్రింద ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో కేవలం 6144 మంది గిరిజన రైతులకు పోడు పట్టాలు ఉండేవని అన్నారు. ప్రస్తుతం పోడు భూ సర్వే చేపట్టి, 6589 మందికి 13139.05 ఎకరాలకు పాస్ పుస్తకాలు జారిచేసామన్నారు. పెనుబల్లి మండలంలో గతంలో 110 మందికి 370 ఎకరాలకు పోడు పట్టాలు ఉండేవని, ఇప్పుడు 801 మందికి ఇచ్చామన్నారు. అర్హులైన గిరిజన కుటుంబానికి ఫారెస్ట్ శాఖ నుండి ఎలాంటి వత్తిడిలు ఉండవని ఆయన తెలిపారు. మిగిలిన అటవీ సంరక్షణ పై దృష్టి పెట్టాలన్నారు. ఆదివాసీలు అటవీ శాఖకు పూర్తిగా సహకరించాలన్నారు. భూమి కీలకమైన ఆస్తి అని ఆయన అన్నారు. జల్ జంగల్ జమీన్ అని కొమురం భీం అన్నారో, అడవులను రక్షించుకుంటూ, వాటి ద్వారా బ్రతుకుదేరువు పొందాలన్నారు. పట్టా హక్కు మాత్రమే కాదని, రైతుబంధు, రైతుభీమా, గిరివికాసం అన్ని రకాల ప్రభుత్వ పథకాలకు అర్హులవుతారని ఆయన తెలిపారు. ఇట్టి భూముల్లో ప్రభుత్వ సాయంతో ఆయిల్ పామ్ తోటలు పెట్టవచ్చని ఆయన అన్నారు. కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య మాట్లాడుతూ, అటవీ హక్కు చట్టం క్రింద పట్టాలు ఇచ్చి, పూర్తి స్థాయిలో హక్కులు కల్పించి, ప్రభుత్వం గిరిజన కుటుంబాల్లో వెలుగులు నింపిందన్నారు. ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో 4.5 లక్షల ఎకరాలకు హక్కులు కల్పించిందని ఆయన తెలిపారు. పట్టా కలిగిన సాధారణ రైతులకు కలిగే లబ్ధి పోడు రైతులు పొందుతారన్నారు. స్వయం పాలనకు ఆందోళనలు చేస్తున్న గిరిజనుల 3900 కు పైగా తండాలు, గూడెం లను గ్రామ పంచాయతీలుగా మార్చిందన్నారు. రైతుబంధు, రైతుభీమా, గిరివికాసం, సీతారామ జలాలు, బ్యాంక్ రుణాలు అన్ని రకాల లబ్ధి వుంటుందన్నారు. ప్రతి గిరిజన గూడెం కు కరంట్ ఇచ్చామన్నారు. పట్టాలిచ్చి, హక్కులు కల్పించాక, పోడు కేసులకు అర్థం లేదని, సీఎం అన్ని పోడు కేసులను ఎత్తివేశారన్నారు. గిరిజనేతరులకు ప్రభుత్వం అన్యాయం చేయదని, అధైర్య పడవద్దని ఎమ్మెల్యే తెలిపారు. పోడు పట్టాల లబ్ధిదారులతో కలెక్టర్, ఎమ్మెల్యే, అధికారులు సహఫంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ భద్రాచలం పీవో గౌతమ్ పోట్రూ, జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఉమామహేశ్వరరావు, కల్లూరు ఆర్డీవో సిహెచ్. సూర్యనారాయణ, ఎఫ్డివో మంజుల, ఎంపిపి, జెడ్పిటిసిలు, సర్పంచులు, ఎంపిటిసిలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బాలల భవిష్యత్తును తీర్చి దిద్దాలి

- జిల్లా కలెక్టర్ అనుదీప్
- మహిళా శిశు మరియు వయోవృద్దుల సంక్షేమ శాఖ ఆద్వర్యంలో ఆపరేషన్ ముస్కాన్




భద్రాద్రి కొత్తగూడెం, జూలై 4 (మనంప్రతినిధి) : తప్పుదోవ పట్టిన బాలల భవిష్యత్తును తీర్చి దిద్ది బావిభారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన భాద్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా కలెక్టర్ అనుదీప్ తెలిపారు. మంగళవారం ఐడిఓసి కార్యాలయపు సమావేశపు హాలులో మహిళా,శిశు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆద్వర్యంలో ఆపరేషన్ ముష్కాన్,ఆపరేషన్ స్మ్రైల్ కార్యక్రమాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బడికి వెళ్లకుండా పనులు చేస్తున్న బాలలను గుర్తించి వారికి విద్యాబుద్ధులు నేర్పించే విధంగా చర్యలు చేపట్టాలని చెప్పారు. వివిధ కారణాల వల్ల దారి తప్పిన వారిని సక్రమమార్గంలో నడిపించకపోతే పెద్దయ్యాక సమాజానికి శత్రువులుగా తయారవుతారని అటువంటి వారి పట్ల ఆదరణ చూపి సక్రమమార్గంలో నడిపిస్తే మంచివాళ్లుగా తయారై సమాజానికి ఉపయోగపడే పౌరులుగా ఎదుగుతారని చెప్పారు. ఇలాంటి వారి భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన బాధ్యత సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరిపై ఉందని ఆయన పేర్కొన్నారు. రెస్క్యూలో గుర్తించిన బాలలకు బావిజీవితాన్ని ఇవ్వాల్సిన అవసరం ఉన్నట్లు చెప్పారు. బాలలు పనిచేస్తున్న హాట్స్పాట్స్ గుర్తించాలని,యజమానులపై పోలీస్ కేసులు నమోదు చేయాలని,గుర్తించిన హాట్స్పాట్లపై నిరంతర పర్యవేక్షణ చేయాలని చెప్పారు. ఆపరేషన్ ముష్కాన్లో గుర్తించిన చిన్నారులు ఎక్కడి నుండి వస్తున్నారన్న కారణాలను విశ్లేషించాలని చెప్పారు. రెవిన్యూ,పోలీస్ సహాకారంతో ఇటుకబట్టీలు తనిఖీ చేసి ధృవీకరణ నివేదికలు అందచేయాలని కార్మిక అధికారులను ఆదేశించారు. ఆపరేషన్ ముష్కాన్, సైల్లో గుర్తించిన బాలలకు సంక్షేమ వసతిగృహాల్లో రిజర్వేషన్ల ప్రకారం విద్యాభాసానికి సీట్లు కేటాయించాలని చెప్పారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఏ శాఖ రోల్ ఆ శాఖ పోషించాలని చెప్పారు. ఆపరేషన్ ముష్కాన్, సైల్ కార్యక్రమాలపై సోమ,గురువారాల్లో నివేదికలు అందచేయాలని చెప్పారు. బాలల సంరక్షణ కేంద్రాల్లో సౌకర్యాలను తనిఖీ చేసి నివేదికలు అందచేయాలని చెప్పారు. అన్ని సౌకర్యాలు ఉన్నట్లు నివేదికలు ఇస్తే తదుపరి ఏదేని సంఘటన జరిగినా అందుకు సంబంధిత శాఖ సిబ్బందిని బాధ్యులను చేసిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోక్సో బాదితులకు ప్రభుత్వం అందించు ఆర్థిక సహాయం అందించుటలో చిరునామాలు లభించిన బాధితుల సమాచారం పోలీస్ శాఖ ద్వారా సేకరించాలని చెప్పారు. జిల్లాలో ఇప్పటి వరకు 389 మంది బాధితులకు కోటి 54 లక్షల 25 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించినట్లు చెప్పారు. పరిహారం అందించేందుకు పెండింగ్ ఉన్న 8 మంది బాదితుల సమస్యను వారం రోజుల్లో పరిష్కరించు విధంగా చర్యలు తీసుకోవాలని సంక్షేమ అధికారికి సూచించారు. బాల్య వివాహాలు జరుగుతున్న మండలాలపై ప్రత్యేక ఫోకస్ పెట్టాలని చెప్పారు. బాల్య వివాహాలు చేసే తల్లిదండ్రులపై పోలీస్ కేసులు నమోదు చేయాలని చెప్పారు. మిషన్ వాత్సల్యకు 372 దరఖాస్తులు రాగా వాటిలో పెండింగ్ ఉన్న 365 దరఖాస్తులు పరిష్కారానికి చర్యలు చేపట్టాలని చెప్పారు. అనంతరం ఆపరేషన్ ముష్కాన్,ఆపరేషన్ స్మైల్ కార్యక్రమాల గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో మహిళా శిశు,వయోవృద్ధుల సంక్షేమాధికారి సబిత,డిఆర్డిఓ మధుసూదన్ రాజు,జిల్లా వైద్యాధికారి డాక్టర్ శిరీష,మైనార్టీ సంక్షేమ అధికారి సంజీవరావు,కార్మిక అధికారి షర్ఫుద్దీన్,బాలల సంరక్షణ అధికారి హరికుమారి,బాలల సంరక్షణ కమిటి సభ్యులు తదితరులు పాల్గొన్నారు .



## గిరిజనుల జీవితాలలో వెలుగులు నింపిన పోడు పట్టాలు

- వందల ఏళ్ల కలను నిజం చేసిన ఘనుడు సీఎం కేసీఆర్
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే రేగా కాంతారావు

ఆళ్లపల్లి, జూలై 4 (మనం న్యూస్) : గిరిజనుల వందల సంవత్సరాల కలను నిజం చేసిన మహోన్నత నేత సీఎం కేసీఆర్ అని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే రేగా కాంతారావు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని మర్కోడు గ్రామ పంచాయతీలోని రైతు వేదికలో ఎంపీడీవో ఎం.రామారావు ఎమ్మార్వో సాదియా సుల్తాన్ అధ్యక్షతన పోడు భూములకు పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో రాష్ట్రంలో ఎన్నో ప్రభుత్వాలు కుర్చీలు మారాయనీ వారి వల్ల ప్రజలకు జరిగిన మేలు ఏమి లేదని అధికారం కోసం తప్ప అభివృద్ధి సంక్షేమ పథకాలను ఎవరూ అందించలేకపోయారని, టీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చినప్పటి నుండి అభివృద్ధి సంక్షేమ పథకాలలో నెంబర్ వన్ స్థానంలో నిలిచింది అని అన్నారు. మండల వ్యాప్తంగా 12 గ్రామ పంచాయతీలలో 2082 మంది లబ్ధిదారులకు 13,938 ఎకరాలకు పట్టాలని స్థానిక ఎంపీపీ కొండ్రు మంజు భార్గవి స్థానిక ప్రజా ప్రతినిధుల చేతుల మీదుగా పంపిణీ చేశారు. కొన్ని పట్టాలు అనివార్య కారణాలవల్ల ఆగాయని త్వరలో రెండో విడతలో వాటిని లబ్ధిదారులకు అందిస్తామని, గిరిజనేతరులకు కూడా పట్టాలు వస్తాయని ఈ సందర్భంగా వారు అన్నారు, ఈ సందర్భంగా స్థానిక ఎంపీపీ కొండ్రు మంజు భార్గవి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఎమ్మెల్యే రేగా కాంతారావు తోనే అభివృద్ధి సాధ్యమని గిరిజన ప్రజల జీవితాలలో పూడు పట్టాలతో వెలుగులు విరజిమ్ముతున్నాయని, మండల వ్యాప్తంగా ప్రతి పల్లెకు రోడు మార్గాలు,బ్రిడ్జిల నిర్మాణం వారి కృషివల్లే సాధ్యమైందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి హనుమంతరావు, రైతు సమన్వయ సమితి అధ్యక్షులు కొమరం వెంకటేశ్వర్లు, స్థానిక సర్పంచ్ కొమరం శంకర్ బాబు, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు పాయం నరసింహారావు, ప్రధాన కార్యదర్శి షేక్ బాబా, కోపరేటివ్ చైర్మన్ గొగ్గెల రామయ్య, వ్యవసాయ శాఖ అధికారి అశోక్, సర్పంచులు పాయం వెంకటనారాయణ, నరసింహారావు ప్రేమ కళ, పునెం నిర్మల, అన్ని గ్రామ పంచాయతీల సర్పంచులు, కార్యదర్శులు, బిఆర్ఎస్ మండలం ఉప అధ్యక్షులు కొమరం వెంకటేష్, బి ఆర్ ఎస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# 59 జిఓ ద్వారా క్రమబద్ధీకరణ

- ప్రజలు వినియోగించుకోవాలి : కలెక్టర్ గౌతమ్



సత్తుపల్లి, జూలై 4(మనం న్యూస్) : ప్రభుత్వ స్థలాల్లో నివాసం ఏర్పరచుకున్న వారికి జీవో 59 ద్వారా ప్రభుత్వం చేపట్టిన క్రమబద్ధీకరణ ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ వి.పి.గౌతమ్ అన్నారు. మంగళవారం కలెక్టర్ సత్తుపల్లి పట్టణంలోని జవహర్ నగర్, జలగం నగర్, ఎన్టీఆర్ నగర్‌లలో పర్యటించి, జీవో 59 దరఖాస్తుదారులకు డిమాండ్ చెల్లింపుపై అవగాహన కల్పించారు. క్రమబద్ధీకరణతో చేకూరే ప్రయోజనాల గురించి వారికి వివరించారు. ప్రభుత్వం మంచి అవకాశం కల్పించిందని, ఈ అవకాశాన్ని కోల్పోతే నష్టపోతారని వారికి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జీవో 59 క్రింద కల్లూరు డివిజన్‌లో 1,361 దరఖాస్తులను ఆమోదించినట్లు ఆయన తెలిపారు. ఇట్టి దరఖాస్తుదారులకు క్రమబద్ధీకరణ చేసి, పట్టాలు జారికిగాను ప్రభుత్వ కనీస భూ ధర చెల్లింపుకు డిమాండ్ జారిచేయుట జరిగినదని ఆయన అన్నారు. డిమాండ్ మేరకు చెల్లింపులు చేసి, ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. చెల్లింపులు చేసిన వారికి క్రమబద్ధీకరణ చేసి, పట్టాల జారిచేయుట జరుగుతుందన్నారు. క్రమబద్ధీకరణతో సర్వ హక్కులు వస్తాయన్నారు. బ్యాంకర్లు నిర్మాణాలు తదితర అవసరాలకు ఋణాలు అందజేస్తారన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో సందర్శించి చెల్లింపులు చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. సంబంధిత తహసీల్దార్, మునిసిపల్ కమిషనర్లు సంయుక్తంగా క్షేత్ర సందర్శన చేయాలని, డిమాండ్ వసూళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అనధికారికంగా ప్రభుత్వ స్థలాల్లో ఉంటున్న వారికి ప్రభుత్వం మంచి అవకాశం కల్పించిందని ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వెంటనే క్రమబద్ధీకరణ చేసుకోవాలన్నారు. డిమాండ్ చెల్లించకుండా అనధికారికంగా ప్రభుత్వ స్థలాల్లో ఉన్న వారిపై తగు చర్యలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. కలెక్టర్ పర్యటన సందర్భంగా కల్లూరు ఆర్డీవో సిహెచ్. సూర్యనారాయణ, సత్తుపల్లి తహసీల్దార్ శ్రీనివాసరావు, కమీషనర్ సుజాత, అధికారులు తదితరులు ఉన్నారు.

## మార్నింగ్ వాక్‌లో విషాదం

- కారు ఢీకొనడంతో ముగ్గురు మృతి
- మృతుల్లో ఇద్దరు మహిళలు, కూతురు

హైదరాబాద్, జూలై 4 (మనం న్యూస్): కారు ఢీకొట్టడంతో మార్నింగ్ వాక్‌కు వెళుతున్న తల్లి కూతురుతో పాటు మరో మహిళ మృతి చెందారు. ఈ ఘటన మంగళవారం హైదరాబాద్ శివారు బండ్లగూడలో జరిగింది. బండ్లగూడ జాగీర్ సన్ సిటీ వద్ద మార్నింగ్ వాక్‌కు వెళుతున్న నలుగురిని కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తల్లీకుమార్తె మృతి చెందగా.. మరో ఇద్దరు మహిళలకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే గాయపడిన మహిళలను ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకున్నారు. మృతులను అనురాధ (38), మమత (26)గా గుర్తించారు. అతివేగమే ప్రమాదానికి కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. తల్లీకూతురు కలిసి సరదాగా కబుర్లు చెప్పుకుంటూ మార్నింగ్ వాక్ చేస్తుండగా.. ఎక్కడి నుంచి వచ్చిందో కానీ కారు.. మృత్యు రూపంలో వెంటాడి తల్లీకూతుళ్లతో పాటు మరో మహిళ ఉసురు తీసింది. మార్నింగ్ వాక్‌కు వెళ్లి ఇద్దరు మహిళలు.. ఒక చిన్నారి మృతి చెందింది. బండ్లగూడ జాగిర్ కార్పొరేషన్ పరిధిలోని హైదర్ షాకోట్ ప్రధాన రహదారిపై రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో మార్నింగ్ వాక్ కు వచ్చిన ఇద్దరు మహిళలు... చిన్నారి మృతి చెందింది. కారు ఓవర్ స్పీడ్‌తో వస్తూ అదుపు తప్పింది. దీంతో రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తున్న వాకర్స్‌పైకి దూసుకు వెళ్లింది. ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా.. ఏడుగురికి గాయాలు అయ్యాయి. మృతుల్లో తల్లీకూతుళ్లతో పాటు మరో మహిళ ఉన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడు. అక్కడి పరిస్థితి భయానకంగా మారింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలను పోస్ట్‌మార్టానికి తరలించారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఘటనకు సంబంధించి పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

## తెలంగాణలో పెరిగిన మెడికల్ సీట్లు

- 43శాతం సీట్లు పెరిగాయన్న హరీష్ రావు

హైదరాబాద్, జూలై 4 (మనం న్యూస్):తెలంగాణలో వైద్యారోగ్యాన్ని బలోపేతం చేసే క్రమంలో ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కాలేజీని ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి హరీష్ రావు తెలిపారు. ఇప్పటికే దాదాపు అన్ని జిల్లాల్లో మెడికల్ కాలేజీలు అందుబాటులోకి వచ్చాయి. ఈ క్రమంలో తెలంగాణ మెడికల్ కాలేజీలు పెరిగాయి.202324లో దేశంలో అందుబాటులోకి వచ్చిన మొత్తం మెడికల్ సీట్లలో తెలంగాణ నుంచి అందుబాటులోకి వచ్చినవి 43 శాతం సీట్లు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు ట్వీట్ చేశారు. దేశంలో అందుబాటులోకి వచ్చిన 2118 ఎంబీబీఎస్ సీట్లలో 900 సీట్లు తెలంగాణ నుండి వచ్చినవే అని తెలిపారు. జిల్లాకొక మెడికల్ కాలేజీ ఏర్పాటు ద్వారా సూపర్ స్పెషాలిటీ వైద్యంతో పాటు, వైద్య విద్యను ప్రజలకు మరింత చేరువ చేసి ఆరోగ్య తెలంగాణ సాకారం చేయాలన్నదే సీఎం కేసీఆర్ సంకల్పం అని హరీశ్‌రావు స్పష్టం చేశారు.

# అంతా మా ఇష్టం... మమ్మల్ని ఎవరేం చేయలేరు..

- కార్పొరేట్ పాఠశాలల్లో నిలువు దోపిడీ..
- విద్యార్థుల పేరెంట్స్‌ను భయపెడుతూ, ముక్కు పిండి వసూళ్లు
- శ్రీ చైతన్య పాఠశాల యాప్‌తో దోచుకుంటున్న వైనం
- నామమాత్రపు చర్యలతో సరిపెడుతోన్న విద్యాశాఖ

ఆర్మూర్, జులై 4 (మనం న్యూస్): మా స్కూల్ మా ఇష్టం... మా స్కూల్లో ఇలాంటి పద్ధతిలే ఉంటాయి.... బరాబర్ ఇలాగే ఫీజులు వసూలు చేస్తాం... మమ్మల్ని ఎవరేం చేయలేరు.. అంటూ కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు కరాఖండీగా చెబుతూ విద్యార్థుల తల్లిదండ్రుల వద్ద లక్షలాది రూపాయలను ఫీజుల రూపంలో ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నించిన తల్లిదండ్రులను పిల్లల విద్యసాకుగా చూపిస్తూ, వారు సరిగా చదవడం లేదని వంక చూపిస్తూ టిసి ఇచ్చి పంపిస్తామని, ఏ పాఠశాలలో చేరకుండా చేస్తామని భయ భ్రాంతులకు గురి చేస్తున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. కార్పొరేట్ పాఠశాలల నిలువు దోపిడిపై అనేక ఫిర్యాదులు అందినప్పటికీ, సంబంధిత విద్యాశాఖ మాత్రం నామమాత్రపు చర్యలతో చేతులు దులుపుకుంటోందన్న అపవాదును ఎదుర్కొంటోంది. గతంలో కూడా ఈ పాఠశాల యజమాని నిలువు దోపిడీ తీరుపై జిల్లా విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లిన మండల్ విద్యాశాఖ అధికారులతో పాటు ప్రైవేట్ స్కూల్ యజమాన్యం కుమ్మక్కై తప్పుడు నివేదికను సమర్పిస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కరోనా కష్టకాలంలో ఆన్ లైన్ చదువులంటూనే కార్పొరేట్ పాఠశాలలు ఫీజులను దండిగానే దండుకున్నాయి.ప్రతి ఏటా ఇష్ట రీతిన ఫీజులను వసూలు చేస్తూ అంతకుమించి అంటూ సినిమా డైలాగులను తలపించేలా బుక్స్, స్కూల్ యూనిఫామ్ అంటూ తనదైన శైలిలో వసూళ్లకు పాల్పడుతున్నారు. ఇప్పుడు మరింత కొత్తదనంతో యాప్‌ల పేరుతో




ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు దోపిడీకి చేస్తున్నాయి. కొన్ని ప్రైవేట్ పాఠశాలల్లో ప్రైమరీకి అనుమతులు లేవు. మరికొన్ని ప్రైవేట్ పాఠశాలలో టెన్త్ వరకు అనుమతి లేకున్న పాఠాలు చెబుతూ పిల్లల తల్లిదండ్రులను మభ్యపెడుతున్నారు. శ్రీ చైతన్య పాఠశాల యాజమాన్యం ర్యాంక్ గురు యాప్ పేరుతో ఒక్కో విద్యార్థి నుండి సుమారు 1300 రూపాయలు వసూలు చేస్తున్నాయని తల్లిదండ్రులు పేర్కొన్నారు. పుస్తకాల్లో లేని చదువులు, యాప్ లో ఏముంటుందని పలువురు తల్లిదండ్రులు ప్రశ్నిసున్నారు. ఇది పోగా మరి పెరిగిన ఫీజులకు అనుగుణంగా ప్రైవేట్ ఉపాధ్యాయుల సిబ్బందికి మాత్రం వేతనాలు పెంచుతున్నారా అంటే ప్రశ్నార్థకమే. సంవత్సరాంతం అధిక మొత్తంలో ప్రైవేట్ యాజమాన్యాలకే లాభాలు చేకూర్చుకుంటున్నారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు విద్యాశాఖ అధికారులు కార్పెట్ వేసి కాసులు దండుకుంటున్నారని పిల్లల తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

### షోకాజ్ నోటీసులతోనే సరి..

పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు పిల్లల తల్లిదండ్రుల నుండి విద్యార్థి సంఘాల నాయకులు నుండి వరుసగా ప్రైవేట్ స్కూల్లో దోపిడిని బట్టబయలు చేస్తున్న ఆర్మూర్ మండల విద్యాశాఖ అధికారికి కుసుమంత కూడా చలనం లేకుండా పోయింది. గత 15 సంవత్సరాల నుండి ఆర్మూర్ మండలానికి విద్యాశాఖ అధికారిగా ఇంఛార్జి బాధ్యతలు వహిస్తున్న పింజారాజ గంగారం ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలో అడుగుపెట్టిన దాఖలాలు లేవు. ప్రభుత్వ పాఠశాలలపై శ్రద్ధ వహిస్తున్న అధికారి మరి ప్రైవేట్ పాఠశాలలపై చలనం లేకపోవడం విడ్డూరమని పలువురు అనుకుంటున్నారు. ప్రైవేట్ పాఠశాలలపై ఏదైనా ఫిర్యాదు అందితే షోకాజ్ నోటీసులతోనే సరిపెడుతున్నారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం లోపాయికారి ఒప్పందమా అని జనాలు చర్చించుకుంటున్నారు. మరి మండల విద్యాశాఖ అధికారికి, ఉన్నత స్థాయి అధికారులకు ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాల నుండి ముడుపులు అందుతున్నాయనా అని ప్రశ్నార్థకంగా మారింది. ఆర్మూర్ మండల విద్యాశాఖ అధికారిపై ఉన్నత విద్యాశాఖ అధికారులు జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి ఆర్మూర్ మండల ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై నజర్ వేయవలసిందిగా పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు.

### విద్యార్థి సంఘాలు పట్టించుకోవాలి

విద్యార్థిని, విద్యార్థులకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల తారతమ్యం లేకుండా అండగా నిలవాల్సిన విద్యార్థి సంఘాల నాయకులు అక్రమ వసూళ్లు, అధిక ఫీజులు దోపిడీని అరికట్టాల్సిన బాధ్యత వహించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ఏబీవీపీ, బిఆర్ఎస్వీ, పిడిఎస్యు, ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాల నాయకులు యాప్ పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలపై దృష్టి సారించాలి. కొందరు సంఘాల నాయకులు వారి స్వలాభం కోసం ప్రైవేట్ పాఠశాలలపై చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారని కొందరు అనుకుంటున్నారు. పాఠశాల పిల్లలకు, తల్లిదండ్రులకు న్యాయం చేయాల్సిన విద్యార్థి సంఘాల నాయకులు మౌనం వీడాల ని మరికొందరు అంటున్నారు. లేనిపక్షంలో విద్యార్థి సంఘాల నాయకులతో మమేకమై విద్యార్థులతో పాటు తల్లిదండ్రుల మంత్రం జిల్లా కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తామని విద్యార్థులు తల్లిదండ్రులు హెచ్చరిస్తున్నారు.

## తెయు విద్యార్థినిపై ర్యాగింగ్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

- విద్యార్థిపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి : పిడిఎస్‌యు-ఎస్ఎఫ్ఐ డిమాండ్



డిచ్‌పల్లి, జూలై 4 (మనం న్యూస్) : తెలంగాణ యూనివర్సిటీ విద్యార్థినిపై ర్యాగింగ్ చేసిన మరియు విద్యార్థి పై భౌతికంగా దాడి చేసిన సంతోష్ ,శివ మరియు నవీన్ లపై చర్యలు తీసుకోవాలని రిజిస్టర్ ప్రొఫెసర్ యాదగిరి కి పిడిఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యూ నిజామాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్క గణేష్ మరియు ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ అధ్యక్షులు ఎల్ ప్రసాద్‌లు మాట్లాడుతూ తెలంగాణ యూనివర్సిటీ అనేక వివాదాలకు ఇప్పటికే కేంద్ర బిందువు అయిందని, యూనివర్సిటీ ప్రతిష్ట మసకబారిందని విద్యార్థులపై దాడులు చేసే సంస్కృతి ఇటీవల తరచుగా జరుగుతుందని తెలిపారు. తెలంగాణ యూనివర్సిటీకి ఉన్నత విద్య అభ్యసించడానికి వివిధ జిల్లాల నుండి విద్యార్థిని, విద్యార్థులు వస్తారని అన్నారు. దూర ప్రాంతాలు, ఇతర జిల్లాల నుండి వచ్చిన విద్యార్థులే హాస్టళ్ళల్లో ఉంటున్నారని తెలిపారు. ఇటీవల కాలంలో యూనివర్సిటీ హాస్టల్లో విద్యార్థులపై కొద్దిమంది భౌతిక దాడులు చేసిన ఘటనలు తరచుగా జరుగుతున్నాయని అన్నారు. అయినప్పటికీ నివారించే ప్రయత్నాలు జరగలేదని, తాజాగా బాలుర హాస్టల్లో న్యాయశాస్త్రం చదువుతున్న రాము అనే విద్యార్థిపై యూనివర్సిటీలోనీ గ్రౌండ్‌లో మద్యం సేవించి సంతోష్ (అప్లైడ్ ఎకనామిక్స్), శివ మరియు నవీన్ అనే విద్యార్థులు చేయి చేసుకున్నారని తెలిపారు. హాస్టల్లో విద్యార్థుల ముందే బెదిరించి కొట్టారని అన్నారు. సంతోష్, శివ మరియు నవీన్‌లపై చర్యలు తీసుకోవాలని, తనకు రక్షణ కల్పించాలని డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్లో రాము ఫిర్యాదు చేశారని అన్నారు. అదే విధంగా యూనివర్సిటీ మహిళా హాస్టల్ విద్యార్థిని వారికి వ్యతిరేకంగా వ్యవహరిస్తుందని, మధ్యాహ్నం సమయంలో సంతోష్, శివ, నవీన్ తదితరులు కొద్దిమంది విద్యార్థులను వెంటేసుకుని మహిళా హాస్టల్ వద్దకెళ్లి, పీజీ ఎకనామిక్స్ రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థినిని పిలిపించుకొని బెదిరించారని అన్నారు. ఆ అమ్మాయిని భయభ్రాంతుల గురిచేసి అందరి ముందు క్షమాపణ చెప్పించుకున్నారని అన్నారు. ఈ విషయమై బాధిత విద్యార్థిని డిచ్ పల్లి పోలీస్ స్టేషన్లో ఎస్ఐకి ఫిర్యాదు చేసిందని తెలిపారు. ఇంత జరుగుతున్న యూనివర్సిటీ అధికారులు, పోలీసులు ఈ ఘటనలపై దర్యాప్తు జరిపి, ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా ఈ ఘటనలపై యూనివర్సిటీ అధికారులు వెంటనే దర్యాప్తు జరిపి సంతోష్ శివ, నవీన్ లపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యూ నిజామాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్‌కె అశూర్, యూనివర్సిటీ ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షులు వెంకటేష్, నాయకులు చిత్రు, దినేశ్ లు పాల్గొన్నారు.

## కార్యకర్తల కుటుంబాలకు ప్రమాద బీమా చెక్కులు అందించిన మంత్రి

భీంగల్, జులై 4 (మనం న్యూస్) : ప్రమాదవశాత్తు మరణించిన బాల్కొండ నియోజకవర్గానికి చెందిన బిఆర్ఎస్ కార్యకర్తల కుటుంబ సభ్యులకు మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి మంగళవారం బీమా చెక్కు లను పంపిణీ చేశారు. వేల్పూరు క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ప్రమాదవశాత్తు మరణించిన వేల్పూర్ మండలలానికి చెందిన చిన్న మల్లయ్య, ఏర్గట్ల మండలం నాగేంద్రనగర్ కు చెందిన శంకర్, ముప్కాల్ మండలం నల్లూర్ గ్రామానికి చెందిన ప్రశాంత్, కమ్మర్‌పల్లి మండల కేంద్రానికి చెందిన అక్బర్ అనే నలుగురు కార్యకర్తల కుటుంబ సభ్యులకు రెండు లక్షల రూపాయల చొప్పున మొత్తం ఎనిమిది లక్షల రూపాయల విలువ చేసే చెక్కులను అందించారు.

## పోడుభూముల పట్టాల పంపిణీ గిరిపుత్రుల అస్తిత్వం, గౌరవానికి ప్రతీక





- మంత్రి ప్రశాంత్ రెడ్డి

నిజామాబాద్ ప్రతినిధి, జులై 4 (మనం న్యూస్) : రాష్ట్రవ్యాప్తంగా జరుగుతోన్న పోడు భూముల పట్టాల పంపిణీ కార్యక్రమం గిరిపుత్రుల అస్తిత్వం, గౌరవానికి ప్రతీకగా నిలుస్తోందని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. పట్టా పాస్ బుక్కుల పంపిణీతో ఇకపై గిరిజనులకే పోడు భూములపై పూర్తి హక్కులు లభించాయని, బిక్కుబిక్కుమంటూ, భయంభయంగా పంట పండించే దుస్థితి దూరమైందన్నారు. పట్టాల పంపిణీతో యజమానులుగా మారిన గిరిజనులు ఎలాంటి ఆటంకాలు లేకుండా ధైర్యంగా పంటలు సాగు చేసుకోవచ్చని ఆయన సూచించారు. భీంగల్ మండలం తాళ్ళపల్లి గ్రామంలో మంగళవారం కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుతో కలిసి మంత్రి లబ్ధిదారులకు పోడు భూముల పట్టా పాస్ బుక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దేవక్కపేట, దేవన్ పల్లి, కారేపల్లి, కుప్కాల్, మెండోరా, రహత్ నగర్, సికింద్రాపూర్, తాళ్ళపల్లి గ్రామాలకు చెందిన అర్హులైన ఒక వేయి ఏడు గిరిజన కుటుంబాలకు పోడు భూముల పట్టా పుస్తకాలను అందించారు. అనంతరం జరిగిన సమావేశంలో మంత్రి ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకున్న సాహసోపేతమైన నిర్ణయంతో అడవి బిడ్డలకు భరోసా ఏర్పడిందని, వారి భావితరాల జీవనోపాధికి కూడా భద్రత లభించిందని తెలిపారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పుడు, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు కలిగిన ఆనందం తరహాలోనే ప్రస్తుతం గిరిజనులకు పోడు పట్టాల పంపిణీ కార్యక్రమం ఎంతో సంతోషం కలిగించిందన్నారు. ఇదివరకెన్నడూ లేని విధంగా ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా లక్షా 50వేల మందికి నాలుగు లక్షల ఎకరాల పోడు భూములకు పట్టాలు అందిస్తోందని వివరించారు. ఇందులో భాగంగానే నిజామాబాద్ జిల్లాలో 4వేల3వందల మందికి 8వేల6వందల ఎకరాల భూములు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఒక్క బాల్కొండ నియోజకవర్గంలోనే 1478 మందికి సుమారు రూ. 400 కోట్ల విలువ చేసే 4వేల ఎకరాల పోడు భూముల పంపిణీ జరుగుతోందన్నారు. దీనికి అదనంగా ఇటీవలే భీంగల్ మండలంలోని దేవక్కపేట్, కారేపల్లి గ్రామాల్లో 1700 పైచిలుకు ఎకరాల అసైన్డ్ భూమిని సైతం లబ్ధిదారులకు పంపిణీ చేయడం జరిగిందని మంత్రి గుర్తు చేశారు. పోడు భూములపై హక్కులు కల్పించిన నేపథ్యంలో గిరిజనులు ఇకపై చెట్ల నరికివేతకు స్వస్తి పలకాలని మంత్రి ప్రశాంత్ రెడ్డి హితవు పలికారు. అడవుల సంరక్షణ ధ్యేయంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. పచ్చదనం పెరిగితేనే ప్రకృతి అనుకూలించి వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని తద్వారా సమృద్ధిగా పంటలు పండించుకోగలుగుతామని అన్నారు. గిరిజనులు ఎంతో ఇష్టంగా జరుపుకునే తీజ్ వేడుకను దృష్టిలో పెట్టుకొని ప్రతి తండాలో తీజ్ భవన్ ఏర్పాటు చేయాల్సిందిగా చేయాల్సిందిగా ముఖ్యమంత్రి కేసీఆర్ కు విన్నవిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ ఆర్డిఓ రవి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి నాగురావ్, భీంగల్ ఎంపీపీ మహేష్, జెడ్ పి టి సి చౌటుపల్లి రవి, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు శర్మ నాయక్, బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రునాయక్, జెడ్పి కో ఆప్షన్ మొయిజ్, సర్పంచ్ చంద్రకళ, స్థానిక ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, పెద్ద సంఖ్యలో గిరిజనులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

### బిటి రోడ్ల పునరుద్ధరణ పనులకు శంకుస్థాపనలు

2.25 కోట్ల రూపాయల వ్యయంతో భీంగల్ నుండి ముచ్కూర్ వరకు చేపట్టనున్న బిటి రోడ్డు పునరుద్ధరణ పనులకు మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి మంగళవారం పురాణీపేట్, పల్లికొండ గ్రామాలలో శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా స్థానికులు విన్నవించిన సమస్యలపై మంత్రి సానుకూలంగా స్పందించారు. వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఫోన్ ద్వారా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## మెగా జాబ్ మేళాకు అపూర్వ స్పందన



- లక్ష్యం ఉంటే సరిపోదు.. సాధించాలనే తపన ముఖ్యం
- మెగా జాబ్ మేళాలో ఎమ్మెల్యే షకీల్

బోధన్, జూలై 4(మనం న్యూస్) : జీవితంలో గెలుపోటములు అత్యంత సహజం. రెండిటినీ కూడా సమానంగా తీసుకున్నపుడే విజయం సునాయాసమని బోధన్ ఎమ్మెల్యే మహమ్మద్ షకీల్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఇందూర్ మోడల్ స్కూల్లో ఎమ్మెల్యే మెగా జాబ్ మేళాను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా షకీల్ మాట్లాడుతూ జాబ్ మేళా కార్యక్రమానికి యువత నుండి స్పందన బాగుందని తెలిపిన ఎమ్మెల్యే షకీల్, ఈ కార్యక్రమం స్ఫూర్తితో ఇదే తరహాలో ఆగస్ట్ 10న సుమారు ఐదువందల పైచిలుకు జాతీయ, అంతర్జాతీయ కంపెనీలతో మరో జాబ్ మేళాను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దేశ ,విదేశాలలో పలు కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు అపారంగా ఉన్నాయని, అలాంటి పెద్ద కంపెనీలను నియోజక వర్గ యువత ముంగిట్లో కి తీసుకువచ్చే దిశగా వేగంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. తన పాఠశాల రోజుల్లో తనకు ఎమ్మెల్యే అవ్వాలనే కోరిక చాలా బలంగా ఉండేదని, కానీ ఒకానొక సందర్భంలో హై జంప్ చేయడానికి ప్రయత్నించి చాలా సార్లు విఫలం అయ్యానని, అంత మాత్రాన తన వల్ల ఏమీ కాదని జీవితంలో ఓటమి ఒప్పుకుంటే ఈ రోజు మీ ముందు ఎమ్మెల్యేగా ఉండేవాడిని కాదని యువతకు హిత బోధ చేశారు. కేవలం లక్ష్యం సాధించాలనే కోరిక ఉంటే సరిపోదని ఆ దిశగా తపన అందుకు తగిన కఠోర శ్రమ తోడైతే విజయం అలవోకగా సిద్ధిస్తుందని అన్నారు. ప్రస్తుతం తల్లిదండ్రుల మీద ఆధార పడిన యువత తమను కన్నవారి కష్టాన్ని వృధా చేయకుండా అందివచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తల్లిదండ్రుల కలలను నిజం చేసే దిశగా కృషి చేయాలని కోరారు.మెగా జాబ్ మేళా కార్యక్రమానికి నియోజక వర్గ యువత నుండి విశేష స్పందన లభించింది. నిరుద్యోగ యువతీ యువకులు, విద్యావంతులైన నిరుద్యోగ వికలాంగ అభ్యర్థులు వేలాదిగా హాజరయ్యారు. సుమారు 3000ల పై చిలుకు నిరుద్యోగ యువతీ యువకులు ఆన్లైన్ లో రిజిస్ట్రేషన్ చేసుకోగా సాఫ్ట్ వేర్ , అగ్రికల్చర్, బ్యాంకింగ్,మార్కెటింగ్ తదితర రంగాలకు సంబంధించిన దాదాపు 82 కార్పొరేట్ కంపెనీలే కాక 40 వరకు స్థానిక కంపెనీలు ఈ జాబ్ మేళాలో పాల్గొని వారికి అవసరమైన అర్హతలున్న అభ్యర్థులను ఎంపిక చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రవీందర్ యాదవ్, బోధన్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విఆర్ దేశాయ్, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు సంజీవ్, మారుతీ మందిర్ చైర్మన్ గుమ్ముల అశోక్ రెడ్డి, అమరనాథ్ బాబు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బెంజర్ గంగారాం,ప్రైవేట్ విద్యా సంస్థల ప్రతినిధులు దిగంబర్, కొడాలి కిశోర్ కుమార్, విద్యా వికాస్ శ్రీనివాస్, నాగన్ పల్లి మధు, జాదవ్ ప్రవీణ్ నాయక్, లోకం శీను, రవిశంకర్ గౌడ్ మరియు బీఆర్ఎస్ నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్, బిజెపిల నుంచి బిఆర్ఎస్‌లో చేరికలు



వేల్పూర్, జులై 4 (మనం న్యూస్): ఏర్గట్ల మండలం గుమ్మిర్యాల, తొర్తి గ్రామాలకు చెందిన బిజెపి, కాంగ్రెస్ పార్టీలకు చెందిన సుమారు 100 మంది నాయకులు, కార్యకర్తలు మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి సమక్షంలో మంగళవారం బిఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి మంత్రి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ జనరంజక పాలన, బాల్కొండ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై అనేక మంది బిఆర్ఎస్‌లో చేరుతున్నారన్నారు. గుమ్మిర్యాల గ్రామ రైతుల కోసం ఎంతో చేశామని వారు అదే స్థాయిలో ఆదరించాలన్నారు. ఎమ్మెల్యేగా ప్రజలకు కావాల్సిన పనులు చేస్తాం, ఓట్లు వేసి ఆశీర్వదించాలని కోరారు.

## విద్యార్థులకు ఆర్‌బిఐ ఆలిండియా క్విజ్ పోటీలు



నిజామాబాద్, జులై 4 (మనంన్యూస్) : నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని గవర్నమెంట్ ప్రైమరీ స్కూల్ పోలీస్ లైన్‌లో ఆర్‌బిఐ దేశవ్యాపంగా నిర్వహించిన ఆల్ ఇండియా క్విజ్ ఆన్ ఫైనాన్షియర్ లిటరసీలో భాగంగా జిల్లా స్థాయి క్విజ్ పోటి పరీక్షను మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆర్.బి.ఐ అధికారి పి.ప్రసాద్ హాజరై మాట్లాడుతూ, మారుతున్న కాలానికి అనుగుణంగా ఆర్థికపరమైన అంశాలపై విద్యార్థి దశ నుండే అనగాహన పెంచుకోవడం అవసరమన్నారు. జిల్లా స్థాయి క్విజ్ పోటిల్లో 19 పాఠశాలలకు చెందిన మండల స్థాయి విజేతలుగా నిలిచిన 38 మంది పాల్గొన్నారు. వీరిలో ప్రథమ బహుమతి టి.ఎన్.ఎమ్.ఎస్, ఆర్మూర్ విద్యార్థులు వేదా శ్రీ, సయ్యద్ అహ్మద్ ,ద్వితీయ బహుమతి జిల్లా పరిషత్ హైస్కూల్, కమ్మరపల్లి విద్యార్థులు ఆర్.అక్షిత, కె.గణేష్ , తృతీయ బహుమతి జిల్లా పరిషత్ హైస్కూల్, మాక్లూర్ విద్యార్థులు జె.హరిత, వి. ఆకాంక్షలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ అధికారి శ్రీనివాసరావు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బోగస్ ఓట్లు తొలగించాలి

- ఆర్డీవోకు కాంగ్రెస్ నాయకుల వినతి



బోధన్, జూలై 04(మనం న్యూస్) : బోధన్ పట్టణంలో ఇప్పటికే నమోదై ఉన్న బోగస్ ఓట్లను గుర్తించి వెంటనే తొలగించాలని పక్క రాష్ట్రమైన మహారాష్ట్రకు చెందిన వ్యక్తుల పేర్లతో బోగస్ ఓట్లను ఇక్కడ నమోదు చేయడం జరిగిందని అన్నారు. వాటిని వెంటనే తొలగించాలనీ మంగళవారం పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆర్డీవో రాజేశ్వర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.బోగస్ ఓట్ల వల్ల తెలంగాణ ప్రజలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కల్యాణ లక్ష్మి ,షాదీ ముబారక్, రేషన్ కార్డు తదితర పథకాల అమలులో తీవ్ర అన్యాయం జరుగుతుందని అన్నారు. బోగస్ ఓట్ల మూలంగా నిజమైన ఓటర్లు లబ్ధి పొందడంలో ఇబ్బంది పడతారని తెలిపారు. ఇలాంటి బోగస్ ఓట్లను తొలగిస్తే తెలంగాణ ప్రజలకు మేలు జరుగుతుందని అన్నారు. బోగస్ ఓట్లు గుర్తించి తక్షణమే వాటిని తొలగించాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్రెసిడెంట్ పాషా,జనరల్ సెక్రెటరీ హరికాంత్ చారి, కాంగ్రెస్ నాయకుడు దాము,యూత్ ప్రెసిడెంట్ తలారి నవీన్,జహీర్, వహీద్,మైనార్టీ ప్రెసిడెంట్ కలీం లు పాల్గొన్నారు.

## ప్రభుత్వ యూనివర్సిటీలలో పీజీ సీట్లను పూర్తి స్థాయిలో భర్తీ చేయాలి

- ఉన్నత విద్యమండలి ఛైర్మెన్ లింబాద్రికి పిడిఎస్‌యూ నేతల వినతి

డిచ్‌పల్లి, జూలై 4(మనం న్యూస్) : 2023-24 విద్యా సంవత్సరంలో తెలంగాణ రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ యునివర్సిటీల క్యాంపస్‌లలో మరియు పరిధిలో కళాశాలల్లో పీజీ సీట్లను పూర్తి స్థాయిలో భర్తీ చేయాలని, యూనివర్సిటీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం పీ.డీ.ఎస్.యు రాష్ట్ర ప్రతినిధి బృందం రాష్ట్ర ఉన్నత విద్య మండలి ఛైర్మెన్ లింబాద్రి కి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా పీ.డీ.ఎస్.యు తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష,ప్రధాన కార్యదర్శిలు పి.మహేష్, ఎస్.వి.శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం రాష్ట్రంలో వివిధ యూనివర్సిటీలలో పీజీ సీట్లను పూర్తి స్థాయిలో భర్తీ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఈసారి ఈ విషయాన్ని పునరావృతం కానివ్వకుండా వివిధ యునివర్సిటీల పరిధిలో ఉన్న అన్ని పీజీ కళాశాలలలో మిగిలి పోయే సీట్లను ప్రత్యేక కౌన్సిలింగ్ ద్వారా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.అదే విధంగా నిబంధనలు పాటించని ,లక్షలాది రూపాయలను వసూలు చేస్తున్న గురునానక్, శ్రీనిధి,అవినాష్ విద్య సంస్థలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు.ప్రభుత్వ యునివర్సిటీలలో పేరుకుపోయిన అన్ని రకాల సమస్యలను పరిష్కరించాలని, ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి మరియు యూనివర్సిటీల అభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు.లేని పక్షంలో పెద్ద ఎత్తున విద్యార్థి ఉద్యమానికి పిలుపునిస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పి.డీ.ఎస్.యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జన్నారపు రాజేశ్వర్, రాష్ట్ర నాయకులు శ్రీను,సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# మానవ మనుగడకు నీటి లభ్యత కీలకం





- జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్
- గణపతి సముద్రం చెరువు పరిశీలన

వనపర్తి ప్రతినిధి, జులై 04 (మనం న్యూస్) : ఎక్కడైతే నీటి లభ్యత ఉంటుందో అక్కడే నాగరికత ఉంటుందని, మానవ మనుగడకు నీళ్లే కీలకమని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ పేర్కొన్నారు. జిల్లాలోని గణపతి సముద్రం చెరువును రిజార్వాయర్‌గా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం సంకల్పించింది. చెరువు చుట్టు పక్కల ప్రజల అనుమానాలు, లాభాలు, నష్ట పరిహారం తదితర అంశాలపై అవగాహన కల్పించేందుకు జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ మంగళవారం స్వయంగా వెళ్లి ప్రజలతో మాట్లాడారు. ఎక్కడైతే పుష్కలంగా నీరు ఉంటుందో అక్కడే మానవమనుగడ సాధ్యమవుతుందని, పూర్వం ఎంతో దూర దృష్టితో చెరువులను ఏర్పాటు చేసి మానవ మనుగడకు, నాగరికతకు పునాదులు వేశారని ప్రజలకు, రైతులకు ఉన్న అనుమానాలను నివృత్తి చేశారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ముందు చూపుతో రిజర్వాయర్లు, చెరువుల పునరుద్ధకరణ చేపడుతుందని రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. ఇందులో భాగంగానే గణపతి సముద్రం చెరువును పునరుద్ధరించి 0.46టిఎంసిల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన రిజర్వాయర్‌గా ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చిందన్నారు. ఇంతకు ముందు మీ చెరువు పైన ఉన్న వారివి దాదాపు 534 ఎకరాలు సాగు అయ్యేదని, రిజర్వాయర్‌గా మార్చడం వల్ల దిగువన ఉన్న 5281 ఎకరాలు సాగు నీరు అందించడం జరుగుతుందన్నారు. రైతులు రెండు లేక మూడు పంటలు సాగు చేసుకోవచ్చని తెలిపారు. చెరువును రిజర్వాయర్‌గా మార్చడంలో చెరువు పొడవు మారని, అదే రెండు కిలో మీటర్లు ఉంటుందన్నారు. ఎత్తు మాత్రం కొంత పెంచడం జరుగుతుందని, రిజర్వాయర్‌పైన ఈ కొన నుండి ఆ కొనకు వెళ్లడానికి రోడ్డు మార్గం వేయడం జరుగుతుందన్నారు. రిజర్వాయర్ నిర్మాణం వల్ల 412 ఎకరాలు మాత్రమే మునిగే అవకాశం ఉందని, 5వేల పైచిలుకు ఎకరాలకు మేలు జరుగుతుందని కలెక్టర్ రైతులకు వివరించారు. భూమి కోల్పోయిన రైతుకు నష్ట పరిహారం, తగిన లాభం చేకూర్చాలని ఆశించడంలో తప్పు లేదన్నారు. భూమి ఇచ్చిన రైతు దేవునితో సమానమని అభిప్రాయపడ్డారు. వనపర్తి జిల్లా రైతులు చాలా మంచి వారని వారు తమ తమ సమస్యలను విజ్ఞతతో విధేయంగా వివరిస్తారని, అందుకే వనపర్తి జిల్లా రైతుల పట్ల తనకు ప్రత్యేక అభిమానం ఉందని చెప్పారు. రైతులు తమ సమస్యలతో తన కార్యాలయానికి ఎప్పుడైనా సరై వచ్చి కలవొచ్చని, తాను ఎంత బిజీగా ఉన్నా రైతుల సమస్యలు ఆలకించి పరిష్కరించేంలా చర్యలు తీసుకుంటానన్నారు. గణపతి సముద్రం చెరువును రిజర్వాయర్‌గా మార్చే క్రమంలో రైతులకు ఎలాంటి సమస్యలు ఉన్నా, అనుమానాలు ఉన్నా తనతో సంప్రదిస్తే రైతుల సలహాలు, సూచనలు సైతం కచ్చితంగా స్వీకరిస్తానని కలెక్టర్ భరోసా కల్పించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, ఇరిగేషన్ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## దొడ్డి కొమరయ్య జీవితం నేటి తరానికి ఆదర్శం

- జిల్లా పరిషత్ ఛైర్మన్ ఆర్. లోక్ నాథ్ రెడ్డి



వనపర్తి/నారాయణ పేట ప్రతినిధి, జులై 04 (మనం న్యూస్) : తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య జీవితం నేటి తరానికి ఆదర్శమని జిల్లా పరిషత్ ఛైర్మన్ ఆర్.లోక్ నాథ్ రెడ్డి పేర్కొన్నారు. జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ ఆవరణంలో జిల్లా బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన దొడ్డి కొమరయ్య వర్ధంతి కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ హాజరు అయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దొడ్డి కొమరయ్య చిత్ర పటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం జెడ్పీ ఛైర్మన్ మాట్లాడుతూ.. నేటి తరం విద్యార్థులు, యువకులు తెలంగాణ పోరాట యోధులను స్మరించుకొని వారి త్యాగాలను స్ఫూర్తివంతంగా తీసుకోవాలని సూచించారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం అనే నినాదంతో నిజాం నిరంకుశత్వ పాలనకు వ్యతిరేకంగా పోరాడి 1946 జులై 4న తూటాలకు బలయ్యారని గుర్తు చేశారు. మహనీయుల వర్ధంతి, జయంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ మాట్లాడుతూ.. మహనీయులు ఎవరూ ఒక జాతికో, కులానికో పరిమితం కాదని, సమ సమాజ నిర్మాణం కోసం పాటు పడిన ప్రతి మహనీయుడు సమాజానికి చెందిన వారన్నారు. దొడ్డి కొమరయ్య పటేల్ పట్వారీ, జమీందారీలకు వ్యతిరేకంగా పోరాటం చేశారని కొనియాడారు. తమ భూమి తమకే చెందాలని, అందులో పండించిన పంటకు తామే హక్కుదారులమని పోరాడుతూ తన ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. వారిని స్ఫూర్తిగా తీసుకొని చాకలి ఐలమ్మ లాంటి వారు సాయుధ పోరాటానికి సిద్ధం అయ్యారని గుర్తు చేశారు. అమరుల త్యాగాలను నిత్యం స్మరించుకుంటూ వారి ఆశయ సాధన కోసం కంకణ బద్ధులు కావాలన్నారు. అలాగే నారాయణ పేట జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రజావాణి హాల్‌లో బిసి అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో దొడ్డి కొమరయ్య వర్ధంతిని నిర్వహించారు. ముందుగా దొడ్డి కొమరయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు డిబిసిడిఓ కృష్ణమాచారి, డిఎం హతిరాం, ఎస్సీసిడిఓ కన్యాకుమారి, సిపిఓ గోవింద రాజులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు. వనపర్తి మున్సిపల్ ఛైర్మన్ గట్టు యాదవ్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ వాకిటి శ్రీధర్, గొర్ల కాపరుల సంఘం జిల్లా అధ్యక్షులు కురుమూర్తి యాదవ్, బిసి సంఘాల నాయకులు, కలెక్టరేట్ ఏఓ భాను ప్రకాష్, జిల్లా బిసి అభివృద్ధి అధికారి భీరం సుబ్బారెడ్డి, సిపిఓ వెంకటరమణ, డిఆర్‌డిఓ నర్సింహులు, డిఎస్‌సిడిఓ నుషిత, ఎస్సీ కార్పొరేషన్ ఇడి మల్లికార్జున్, మత్స్యశాఖ అధికారి రెహమాన్, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## 'పాలమూరు-రంగారెడ్డి'ని త్వరగా పూర్తి చేయాలి



- జిల్లా కలెక్టర్ పి. ఉదయ్ కుమార్ ఆదేశం

నాగర్ కర్నూల్ ప్రతినిధి, జులై 04 (మనం న్యూస్) : పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులను వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి. ఉదయ్ కుమార్ ఇరిగేషన్ శాఖ అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్లో పిఆర్ఎల్ఐ, మొదటి ఫేజ్, రెండవ ఫేజ్, కల్వకుర్తి, మార్కండేయ రిజర్వాయర్, కాలువల భూ సేకరణ సమస్యలు, ఇతర సమస్యలపై ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో కలెక్టర్ మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. జులై చివరి వారం నాటికి పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పంపులు, మోటార్లు ప్రారంభించి నీరు ఎత్తిపోయాలని సిఎం కేసిఆర్ ఇప్పటికే ఆదేశించినందున అందుకు అనుగుణంగా పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. ఎత్తిపోతలకు సంబంధించి రిజర్వాయర్లు, ప్రధాన కాల్వల నిర్మాణానికి ప్యాకేజీ-1 నుండి ప్యాకేజీ-2 వరకు భూ సేకరణకు సంబంధించిన సమస్యలు ఏమున్నాయో చెప్పాలని సూచించారు. మొత్తం 11,861.05 ఎకరాలు భూ సేకరణ చేయాల్సి ఉండగా.. ఇప్పటి వరకు 11,770.29 ఎకరాల స్థలాన్ని సేకరించడం జరిగిందన్నారు. ఇంకా 90.15 ఎకరాలు సేకరించాల్సి ఉందన్నారు. సేకరించిన చాలా వాటికి పేమెంట్ ఇవ్వడం పూర్తి అయ్యిందని, మిగిలి వాటికి పిఎన్ స్టేజీలో, పిడి స్టేజీలో, అవార్డు స్టేజీలో ఉన్నాయన్నారు. అలాగే అప్పర్ ప్లాట్‌కు, రెండవ ఫేజ్‌కు సంబంధించిన, మార్కండేయ భూ నిర్వాసితులకు నష్టపరిహారం విషయంలో త్వరలోనే ఒక నిర్ణయం తీసుకొని ప్రకటించడం జరుగుతుందన్నారు. ఇరిగేషన్ ఎస్.ఇ విజయ్ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ.. నార్లాపూర్ రిజర్వాయర్‌కు సంబంధించి 10 ఎకరాల భూ సేకరణ పెండింగ్ ఉందని, రైతులకు అవార్డు పాస్ చేసి స్థలాన్ని అప్పగించాలని కోరారు. అలాగే సేకరించిన స్థలంకు సంబంధించి కొన్ని ఎకరాలకు మ్యూటేషన్ చేసి స్థలాన్ని ప్రభుత్వం పేరున మార్చాలని కోరారు. మ్యూటేషన్ పనులు వెంటనే పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ మోతీలాల్‌కు జిల్లా కలెక్టర్ సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ మోతీలాల్, కల్వకుర్తి ఆర్డీఓ రాజేష్ కుమార్, ఎస్ఇ-1 ఇరిగేషన్ విజయ్ భాస్కర్ రెడ్డి, ఎస్ఇ-2 ఎఎస్ఎన్ రెడ్డి, ఇరిగేషన్ కార్యనిర్వాహక ఇంజనీర్లు పార్థ సారథి, బి. సంజీవ్ రావు, జె. శ్రీనివాస్ రెడ్డి, ఆర్ రవీందర్, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్లు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి





- జిల్లా అదనపు కలెక్టర్ మయాంక్ మిత్తల్

నారాయణ పేట ప్రతినిధి, జులై 04 (మనం న్యూస్) : జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ మయాంక్ మిత్తల్ అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలో చేపడుతున్న అభివృద్ధి పనులను అదనపు కలెక్టర్ మున్సిపల్ అధికారులతో కలిసి మంగళవారం మధ్యాహ్నం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... యాదగిరి రోడ్డు, ఎర్రగుట్ట సమీపాన నిర్మిస్తున్న 700 స్కైర్ యార్డులో రూ. 2కోట్ల అంచనాతో నిర్మిస్తున్న దోభీ ఘాట్ పనులను ప్రారంభోత్సవానికి కేటాయించిన సమయంలోగా త్వరగా పూర్తి చేయాలన్నారు. అలాగే దామరగిద్ద రోడ్డులో ఉన్న స్మశాన వాటిక పనులను పరిశీలించారు. స్మశాన వాటిక లోపల పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించి పూల మొక్కలను నాటాలన్నారు. అనంతరం హరిత హారానికి అవసరమైన మొక్కలను అందుబాటులో ఉన్నాయా వేలా అని నర్సరీ తనిఖీ చేశారు. ప్రతి ఇంటికి పండ్ల మొక్కలు, పూల మొక్కలు అందించాలని దేవాలయాల్లో ఖాళీ స్థలాల్లో పండ్లు, పూల మొక్కల నాటాలన్నారు. అదనపు కలెక్టర్ మున్సిపల్ కమిషనర్ సునీత, ఏ.ఇ మహేష్, మున్సిపల్ అధికారులు తదితరులు ఉన్నారు.

## పాన్‌గల్ పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ ఆకస్మిక తనిఖీ



వనపర్తి ప్రతినిధి, జులై 04 (మనం న్యూస్) : వనపర్తి జిల్లా పాన్‌గల్ పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ కె. రక్షితా మూర్తి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. వర్టికల్స్ నిర్వహణ, ఆన్‌లైన్ వినియోగం, కేసుల వివరాల గురించి ఎస్ఐ రవి ప్రకాష్‌ను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదు దారులతో మర్యాదగా ఉండాలని, బాధితుల ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచరాదని, త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో పాన్‌గల్ ఎస్.ఐ రవి ప్రకాష్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

## కొనసాగుతున్న బిజెపి ఇంటింటి ప్రచారం



వనపర్తి ప్రతినిధి, జులై 04 (మనం న్యూస్) : జిల్లాలో బిజెపి నాయకులు చేపట్టిన ఇంటింటి ప్రచారం మంగళవారం టీచర్స్ కాలనీలోని 130వ. బూత్‌లో కొనసాగింది. కేంద్ర ప్రభుత్వం ప్రజలకు ఇస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ.. ఇంటింటికి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, రామన్న, వెంకటేశ్వర రెడ్డి, సూగురు రాములు, మామిళ్ల పల్లి రాయన్న సాగర్, విజయ్ కుమార్ సాగర్, శివ పాల్గొన్నారు.

## కొల్లాపూర్ మామిడికి ప్రత్యేక స్థానం

- వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి



వనపర్తి ప్రతినిధి, జులై 04 (మనం న్యూస్) : తెలంగాణ రాష్ట్రంలోని కొల్లాపూర్ మామిడి పండ్లకు ప్రత్యేక స్థానం ఉందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. విదేశీ పర్యటనలో ఉన్న ఆయన ఆమెరికాలోని ఫ్లోరిడా రాష్ట్రం టంపాలో ఎన్ఆర్ఐ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి సాగు చేస్తున్న వివిధ రకాల మామిడి చెట్లను మంత్రి సందర్శించి అభినందించారు. పండ్లలో రారాజు మామిడి అని, అమెరికా వెళ్లినా ఆసకితతో మామిడిని సాగు చేయడం అభినందనీయమన్నారు. తెలంగాణ మామిడికి దేశ, విదేశాల్లో ఆదరణ ఉందని, ప్రత్యేకించి కొల్లాపూర్ మామిడికి ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఉద్యాన పంటల సాగుకు తెలంగాణ ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుతో వ్యవసాయ రంగ ముఖచిత్రం సంపూర్ణంగా మారుతుందని మంత్రి తెలిపారు.

## పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలతో జిల్లా సస్యశ్యామలం



వనపర్తి ప్రతినిధి, జులై 04 (మనం న్యూస్) : పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం అందుబాటులోకి వస్తే ఉమ్మడి పాలమూరు జిల్లా సస్యశ్యామలం అవుతుందని స్వర్ణకార, బులియన్ మర్చంట్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. వనపర్తి జిల్లా కేంద్రానికి చెందిన స్వర్ణకార, బులియన్ మర్చంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం 200 మంది ఎదుల పంప్ హౌస్, ఏదుల రిజర్వాయర్‌ను సందర్శించారు. త్వరలో డ్రై రన్‌కు సిద్ధమవుతున్న నేపథ్యంలో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల అందుబాటులోకి వస్తే ఉమ్మడి పాలమూరు జిల్లా సస్యశ్యామలం అవుతుందని, సిఎం కేసిఆర్ కరువు జిల్లాను పాడి పంటల జిల్లాగా మార్చి ప్రజల గుండెల్లో నిలిచిపోయారని సందర్శకులు అభిప్రాయపడ్డారు.

## బడి ఈడు పిల్లల్ని బడిలో చేర్పించాలి

వనపర్తి ప్రతినిధి, జులై 4 (మనం న్యూస్) : బాల కార్మిక వ్యవస్థ సమూలంగా నిర్మూలించి బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. ఐడిఓసి సమవేశ మందిరంలో జిల్లా కార్మిక, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఆపరేషన్ ముస్కాన్ జిల్లా స్థాయి సమన్వయ సమావేశానికి కలెక్టర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. తండ్రి సంరక్షణలో లేకుండా ఇంటి నుండి పారిపోయిన, తప్పిపోయిన, ఇతరులు ఎత్తుకెల్లిన బాల బాలికలు, లేదా బడి ఈడు ఉండి బాల కార్మికులుగా పని చేస్తున్న వారిని, వీధి బాలలను, వివక్షకు గురైన 18 ఏళ్లలోపు బాల బాలికలను ఆపరేషన్ ముస్కాన్ సందర్భంగా రెస్క్యూ చేయాల్సి అవసరం ఉందన్నారు. ఆపరేషన్‌లో పాల్గొనే టీం సభ్యులు జిల్లాలోని గ్రామ , మండల స్థాయి అధికారులను సమన్వయం చేసుకోవాలన్నారు. సమావేశంలో ఎఎస్పీ షాకీర్ హుస్సెన్, జిల్లా సంక్షేమ అధికారి రామ మహేశ్వర్ రెడ్డి, జిల్లా అసిస్టెంట్‌లేబర్ అధికారి రవి శంకర్, జిల్లా విద్యాధికారి గోవింద రాజులు, చిల్డ్రన్స్ వెల్ఫేర్ కమిటీ అధ్యక్షురాలు అలివేలమ్మ, డిసిపిఓ రాంబాబు, చైల్డ్ లైన్ ఎన్జీవోస్ పాల్గొన్నారు.

## ఇంటింటి ఇన్నోవేటర్ కరపత్రాలు విడుదల



నాగర్ కర్నూల్ ప్రతినిధి, జులై 04 (మనం న్యూస్) : గ్రామ స్థాయిలో, వ్యవసాయ రంగంలో ఏదైనా నూతన ఆవిష్కరణ జరిగి ఉండే వాటిని ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమంలో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ పి. ఉదయ్ కుమార్ పేర్కొన్నారు. కలెక్టరేట్లోని తన చాంబర్‌లో ఇంటింటా ఇన్నోవేటర్ కరపత్రాన్ని కలెక్టర్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. దైనందిన జీవితంలో మనం ఎదుర్కొనే సమస్యలను నూతన చిట్కాలతో సులువగా చేయగలిగే ప్రతిదీ ఆవిష్కరణగా భావించడం జరుగుతుందన్నారు. అలాంటి నూతన ఆవిష్కరణలు వ్యవసాయ రంగంలో, గ్రామ స్థాయిలో అనేకం జరుగుతుంటాయని వాటిని తెలుసుకొని ఇంటింటా ఇన్నోవేటర్ అనే కార్యక్రమానికి పంపించేందుకు 9100678543 అనే వాట్సాప్ నెంబర్‌కు పంపించాలని సూచించారు. పంపిన వాటిని ఆగస్టు 15న జరిగే స్వాతంత్ర్య దినోత్సవం రోజున పరేడ్ గ్రౌండ్‌లో ప్రదర్శిస్తారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మేనేజర్ నరేష్, జిల్లా సైన్స్ అధికారి కృష్ణా రెడ్డి, సిపిఓ భూపాల్ రెడ్డి, గిరిజన సంక్షేమ శాఖ అధికారి కమలాకర్ రెడ్డి, ఐటి శాఖ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి

- జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్




వనపర్తి ప్రతినిధి, జులై 04 (మనం న్యూస్) : పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించడంతోపాటు వాటికి పాఠాలు అర్థమయ్యే రీతిలో బోధించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఉపాధ్యాయులకు సూచించారు. ఘనపూర్ మండలంలోని గిరిజన సంక్షేమ పాఠశాల, వనపర్తి పట్టణంలోని బాలికల పాఠశాలను కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వారి సామర్థ్యాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి తన భావి జీవితం పట్ల ఉన్నతమైన కలలు కనాలని, కలలను సాకారం చేసుకునేందుకు ఇష్టపడి చదవాలని సూచించారు. ఉపాధ్యాయులు సైతం ఉపకరణ సామాగ్రిని ఉపయోగించి విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని, విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీయాలని సూచించారు. ఘనపురం గిరిజన సంక్షేమ పాఠశాలలో విద్యార్థులకు పాఠాలు బోధించారు. అనంతరం మన ఊరు మన బడి పనులను పర్యవేక్షించారు. కలెక్టర్ వెంట ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

## కొమరయ్య త్యాగాలు చిరస్మరణీయం

నాగర్ కర్నూల్ ప్రతినిధి, జులై 04 (మనం న్యూస్) : తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొరమయ్య త్యాగాలు చిరస్మరణీయమని, ఆయన త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ ఎస్. మోతీలాల్ పేర్కొన్నారు. సమీకృత జిల్లా కార్యాలయ సముదాయ ఆవరణంలో తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమరయ్య 77వ. వర్ధంతిని జిల్లా బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమానికి అదనపు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరు అయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ దొడ్డి కొమరయ్య చిత్ర పటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. మహనీయులు జాతికో, కులానికో పరిమితం కాదని, సమాజం కోసం పాటు పడిన వారని గుర్తు చేశారు. కార్యక్రమంలో జిల్లా వెనుక బడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి శ్రీధర్, డిపిఆర్వో సీతారాం నాయక్, డిపిఓ కృష్ణ, జిల్లా భూగర్భ జలాల అధికారి రమాదేవి, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాసులు, వివిధ శాఖల సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.







## వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్‌లో

# అమెరికన్లకు షాక్..

### తొలి రౌండ్‌లో ఓడిన వీనస్ విలియమ్స్, కోకో గాఫ్

వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో అమెరికా ప్లేయర్లకు తొలి రౌండ్లోనే షాక్ తగిలింది. రికార్డు స్థాయిలో 24వ సారి ఆల్ ఇంగ్లండ్ సెంటర్ కోర్టులో అడుగుపెట్టిన అమెరికా వెటరన్ ప్లేయర్ వీనస్ విలియమ్స్.. మహిళల సింగిల్స్ తొలి రౌండ్లో పరాజయం పాలవ్వగా.. యంగ్ గన్ కోకో గాఫ్ అనామక ప్లేయర్ చేతిలో ఓడింది.

43 ఏండ్ల వయసులో మైదానంలోకి అడుగుపెట్టిన వీనస్కు ప్రేక్షకులు స్టాండింగ్ ఓవేషన్ ఇవ్వగా.. ఎలినా స్విటాలినాతో పోరులో వీనస్ మునుపటి దూకుడు కనబర్చేందుకు ప్రయత్నించింది. బిగ్ సర్వ్‌లు, క్రిస్ప్ స్ట్రోక్స్‌తో పాత వీనస్ను తలపించింది. అయితే కోర్టులో ఎక్కువ గడ్డి ఉండటంతో పదే పదే జారిన వీనస్ విలియమ్స్.. ఓ సారి కిందపడింది. దీంతో ఆమె కుడి కాలికి గాయమైంది. రెండుసార్లు ఫిజియో సహాయం తీసుకున్న వీనస్ చివరకు 4-6, 3-6తో స్వితోలినా చేతిలో పరాజయం పాలైంది. వీనస్ తొలిసారి (1997) వింబుల్డన్ మైదానంలో అడుగు పెట్టినప్పుడు స్వితోలినా కేవలం రెండేండ్ల చిన్నారిగా ఉండటం గమనార్హం.మ్యాచ్ అనంతరం స్వితోలినా మాట్లాడుతూ.. 'వీనస్తో పోటీపడటమే గొప్ప విషయం. నాలాంటి ఎందరో యువ ఆటగాళ్లు టెన్నిస్ను కెరీర్గా ఎంచుకునేందుకు స్ఫూర్తి ఆమెనే' అని పేర్కొంది. గతంలో ప్రపంచ నంబర్వన్గా వెలుగొందిన వీనస్ విలియమ్స్ ప్రస్తుతం టాప్-500 ర్యాంకుల్లోనూ చోటు దక్కించుకోలేకపోయినా.. వైల్ కార్డ్ ఎంట్రీ ద్వారా వింబుల్డన్ బరిలో దిగింది.

### గాఫ్‌కు చుక్కెదురు..

వీనస్ విలియమ్స్, సెరెనా విలియమ్స్ బాటలోనే.. దూసుకొస్తున్న అమెరికా యువ సంచలనం కోకో గాఫ్కు వింబుల్డన్ తొలి రౌండ్లోనే చుక్కెదురైంది. ఏడో సీడ్గా బరిలోకి దిగిన గాఫ్ 4-6, 6-4, 2-6తో ప్రపంచ 128వ ర్యాంకర్ సోఫియా కెనిన్ చేతిలో ఓడింది.

## ఇంగ్లండ్ జట్టుకు షాక్..
## యాషెస్ సిరీస్ నుంచి ఒలీ పోప్ అవుట్..!

ఆస్ట్రేలియాతో సిరీస్‌లో 0-2తో వెనుకబడిన ఇంగ్లండ్ జట్టు ఘోర పరాజయాన్ని చవి చూసింది. వైస్ కెప్టెన్ ఒలీ పోప్ సిరీస్‌కు దూరమయ్యాడు. లారడ్స్ టెస్టులో ఒలీ పోప్ కుడి భుజానికి తీవ్ర గాయమైంది. త్వరలో శస్త్ర చికిత్స చేయనున్నారు. ఇంగ్లండ్ - ఆస్ట్రేలియా మధ్య సిరీస్లో భాగంగా ఈ నెల 6 నుంచి హెడింగ్లీ వేదికగా మూడో టెస్టు మ్యాచ్ జరగనుంది. పోప్ గాయానికి సంబంధించి ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) ఓ ప్రకటన విడుదల చేసింది. 'గత వారం లార్డ్స్‌లో జరిగిన రెండో యాషెస్ టెస్టులో ఇంగ్లండ్ బ్యాట్స్‌మెన్ ఒలీ పోప్ కుడి భుజానికి గాయంకావడంతో యాషెస్ సిరీస్లోని మిగిలిన మ్యాచ్లకు దూరమయ్యాడు' అని పేర్కొంది. సోమవారం లండన్‌లో నిర్వహించిన స్కానింగ్‌లో గాయం పూర్తి స్థాయిలో బయటపడింది. అతనికి శస్త్రచికిత్స అవసరం అని తెలిపింది. అతని ప్లేస్‌లో మరో ఆటగాడి పేరును ఇంగ్లండ్ మేనేజ్‌మెంట్ ప్రకటించలేదు. వాస్తవానికి ఒలీ పోప్ ఈ సీజన్‌లో ఫామ్ లేమితో సతమతమవుతున్నాడు. ఎడ్జాస్టన్ టెస్టులో పోప్ తొలి ఇన్నింగ్స్‌లో 31 పరుగులు, సెకండ్ ఇన్నింగ్స్‌లో 14 పరుగులు చేశాడు. రెండో టెస్టులో 42, 3 పరుగులు చేశాడు. సిరీసును నిలబెట్టుకునేందుకు హెడింగ్లీ టెస్టులో ఇంగ్లండ్ తప్పనిసరిగా గెలువాల్సిన పరిస్థితి ఒక వేళా మ్యాచ్లో ఓడినా, డ్రా చేసుకున్నా ఆస్ట్రేలియా యాషెసును నిలబెట్టుకుంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో యాషెస్ను కైవసం చేసుకునేందుకు ఇంగ్లండ్ అద్భుత ప్రదర్శన చేయాల్సి రానున్నది. మూడు టెస్టుల్లో తమ జట్టు విజయం సాధిస్తుందని కెప్టెన్ బెన్ స్టోక్స్ ధీమా వ్యక్తం చేశాడు.





## ఆయనతో డేటింగ్.. నా కెరీర్ నాశనమైంది

ఇరవై మూడేళ్ల క్రితం 'కహో నా.. ప్యార్ హే' సినిమాతో బాలీవుడ్ చిత్ర సీమలోకి అడుగుపెట్టింది అమీషా పాటేల్. హృతిక్ రోషన్ హీరోగా నటించిన ఈ సినిమా అప్పట్లో నెలకొల్పిన రికార్డులు అంతా ఇంతా కాదు. ఇక అదే ఏడాది పవన్‌తో 'బద్రి' సినిమా చేసింది. ఈ సినిమా ఇక్కడ బంపర్ హిట్టయింది. ఇలా ఒకే ఏడాది రెండు ఇండస్ట్రీలలో ఎంట్రీ ఇచ్చి.. రెండిట్లోనూ బ్లాక్ బస్టర్లు కొట్టిన ఘనత అమీషా పటేల్‌కే దక్కింది. ఆ తర్వాత బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో తెగ బిజీగా గడిపింది. తెలుగులో ఎక్కువగా సినిమాలు చేయకపోయినా బాలీవుడ్‌లో మాత్రం మూడు, నాలుగేళ్లు ఏడాదికి నాలుగైదు సినిమాలు చేసింది. కెరీర్ పీక్ స్టేజిలో ఉన్నప్పుడే అమీషా పటేల్ బాలీవుడ్ దర్శక నిర్మాత విక్రమ్ భట్‌తో డేటింగ్ చేసింది. ఆ తర్వాత అమీషా ఎక్కువగా సినిమాల్లో కనిపించలేదు. కాగా తాజాగా ఈ విషయంపై అమీషా సంచలన వ్యాఖ్యలు చేసింది. విక్రమ్ భట్ డేటింగ్ గురించి బహిరంగంగా చెప్పడం తన కెరీర్‌ను నాశనం చేసిందని అమీషా చెప్పింది. ఈ పరిశ్రమలో నిజాయితీకి విలువ లేదు. నిజాయితీగా నా రిలేషన్షిప్ గురించి బయటకు చెప్పడంతో 12-13ఏళ్లు సినిమా చాన్సులు దక్కలేదు. నా కెరీర్ దెబ్బ తింది. దీంతో నా లైఫ్లోకి మరొకరికి చోటివల్లేదు. ఇప్పుడు శాంతి మాత్రమే నాతో ఉంది. నా జీవితంలో ఇంకేమి అక్కర్లేదు అని అమీషా చెప్పుకొచ్చింది.

మనం సినిమా
manamcinema

## బ్రోకి భారీగా డిమాండ్ చేస్తున్నారా.?




ఇప్పుడు మన టాలీవుడ్ నుంచి రిలీజ్‌కి రాబోతున్న క్రేజీ చిత్రాల్లో సాయి ధరమ్ తేజ్ హీరోగా పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ గెస్ట్ రోల్‌లో నటించిన సాలిడ్ ఎంటర్టైనర్ చిత్రం బ్రో ది అవతార్. మరి దర్శకుడు సముద్రఖని తెరకెక్కిస్తున్న ఈ చిత్రం టీజర్ తర్వాత మంచి హైప్ ని తెచ్చుకోగా ఫ్యాన్స్ అయితే ఇప్పుడు చాలా ఆసక్తిగా సినిమా కోసం ఎదురు చూస్తున్నారు. అయితే ఈ క్రేజ్ లో మేకర్స్ సినిమా బిజినెస్ పరంగా భారీగా డిమాండ్ చేస్తున్నట్టుగా రూమర్స్ వినిపిస్తున్నాయి. పవన్ ఈ సినిమాలో చేస్తుంది గెస్ట్ రోల్ అయినప్పటికీ తెలుగు స్టేట్స్‌లో పవన్ హీరోగా నటించే సినిమా రేంజ్ బిజినెస్ చేస్తున్నట్టుగా టాక్. దీనితో తెలుగు రాష్ట్రాల్లో అయితే బ్రో కి మేకర్స్ 90 కోట్ల మేర బిజినెస్ ని డిమాండ్ చేస్తున్నట్టుగా తెలుస్తుంది. మరి ఇది ఎంతవరకు నిజమో తెలియాల్సి ఉంది. ఇక ఈ చిత్రానికి థమన్ సంగీతం అందిస్తుండగా పీపుల్ మీడియా ఫ్యాక్టరీ వారు నిర్మా ణం వహిస్తున్నారు.

## ఇంట్రెస్టింగ్.. స్కందతో బోయపాటి యూనివర్స్.?

ఇపుడు ఇండియన్ సినిమా దగ్గర ప్రతి సినిమా ఇండస్ట్రీ నుంచి దర్శకులు తమ సినిమాటిక్ యూనివర్స్ ని అయితే యాడ్ చేస్తున్నారు. అలా తమిళ్, కన్నడ సహా హిందీ నుంచి కూడా ఈ సినిమాటిక్ యూనివర్స్ లు ఇప్పుడు ఊపందుకోగా మన తెలుగు సినిమా నుంచి కూడా యంగ్ అండ్ టాలెంటెడ్ దర్శకుడు ప్రశాంత్ వర్మ తన సినిమాటిక్ యూనివర్స్ ని పరిచయం చేసాడు. అయితే లేటెస్ట్ గా ఓ టాక్ చిన్నగా వినిపిస్తుంది.

మాస్ దర్శకుడు బోయపాటి శ్రీను కూడా తన సినిమాటిక్ యూనివర్స్ ని స్టార్ట్ చేశాడా అంటూ టాక్ వచ్చింది. యంగ్ అండ్ ఎనర్జిటిక్ హీరో రామ్ పోతినేనితో చేస్తున్న సాలిడ్ మాస్ యాక్షన్ డ్రామా స్కంద నుంచి నిన్ననే ఈ సినిమా టైటిల్ ని మేకర్స్ పరిచయం చేశారు. అయితే ఈ టైటిల్ లోగో కానీ దాని డిజైన్, ప్రెజెంటేషన్




తో బోయపాటి సెన్సేషనల్ హిట్ అఖండ చాలా మందికి గుర్తొచ్చింది.

పైగా రామ్ లుక్స్ కూడా ఆ తరహాలోనే డిఫరెంట్ గా అనిపిస్తుండడం పైగా అఖండ లో డివోషనల్ టచ్ ఉండగా ఇపుడు స్కంద టైటిల్ లో సరిగ్గా చూస్తే కుమార స్వామి ఆయుధం కనిపిస్తుంది. దీనితో స్కంద కూడా డివోషనల్ టచ్ తో వస్తుంది అనిపిస్తుంది. ఇలా అఖండ కి స్కంద కి ఏమన్నా కనెక్షన్ ఉందా బోయపాటి తన స్టైల్ సినిమాటిక్ యూనివర్స్‌ని ప్రెజెంట్ చేస్తున్నారా అనేది మాత్రం మొదలైంది. మరి దీనికి సమాధానం అయితే కాలమే అందించాలి.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No: 98/1, CIE Phase II, Gandhinagar, Quthabullapur Mandal, Medchal-Malkajgiri, Hyderabad-500 037.Telangana state and Published From H.No:6-3-864/4/B, SBN Arcade, 2nd Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, CHIEF EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952. Phone No.040-27819999. E-mail Id: editor@manamnews.com.